ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 46 సంచిక : 8 అభివృద్ధి మాసపత్రిక జూన్, 2018 ₹ 22

## ప్రగతిపథంలో భారతదేశం



**ప్రత్యేక వ్యాసం :**

డిజిటలీకరణ ద్వారా ప్రగతి

అమితాబ్ కాంత్

మోదీ ప్రభుత్వ అభివృద్ధి వ్యూహం : ఒక పరిశీలన

రాజీవ్ అహుజా

'దొడ్డి' దారి అలవాటు మాన్పిన బహుదొడ్డ కార్యక్రమం

పరమేశ్వరన్ అయ్యర్

**విశిష్ట వ్యాసం :**

మాతా శిశు రక్షణకు చేయూత

రాకేశ్ శ్రీవాత్సవ

జూన్ 21, అంతర్జాతీయ యోగ దినోత్సవం

సిద్ధ యోగ

డాక్టర్ ఆర్.ఎస్.రామస్వామి

# అభివృద్ధి మార్గ సూచి:

## రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే ఐదేళ్ళకు సమగ్ర గిరిజనాభివృద్ధి ప్రణాళికను విడుదల చేశారు. చిత్రంలో మధ్యప్రదేశ్ గవర్నర్ శ్రీమతి ఆనందిబేన్ పటేల్, ముఖ్యమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహన్‌లను కూడ చూడవచ్చు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల మధ్యప్రదేశ్‌లోని మాండ్లలో రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన రానున్న ఐదు సంవత్సరాలలో గిరిజనుల సమగ్రాభి వృద్ధికి ఒక ప్రణాళికను కూడా ఆవిష్కరించారు. మాండ్ల జిల్లాలోని మనేరిలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి ఎల్‌పిజి బాట్లింగ్ ప్లాంట్‌కు శంఖుస్థాపన కూడా చేశారు. నూరు శాతం పొగలేని పొయ్యిలను వినియోగిస్తున్న, మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం కింద నూరు శాతం టీకీకరణ చేసిన, మరియు సౌభాగ్య పథకం కింద నూరు శాతం విద్యుదీకరణ చేసిన నూరు గ్రామాల సర్పంచ్‌లను ఆయన సత్కరించారు. అక్కడి నుండి దేశవ్యాప్త పంచాయత్‌రాజ్ ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాని మహాత్ముని గ్రామోదయం నుండి రాష్ట్రోదయం పిలుపును, గ్రామ స్వరాజ్యాన్నీ గుర్తు చేశారు. గ్రామాలకు తగిన సేవలనందించడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు.

## ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య హామీ పథకం ఏర్పాట్లను పరిశీలించిన ప్రధాని



ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రారంభించబోతున్న ఆరోగ్య హామీ పథకం ఏర్పాట్లను ప్రధానమంత్రి సమీక్షించారు. ఈ పథకం కింద ప్రతి కుటుంబానికీ ఐదు లక్షల రూపాయల మేర ఆరోగ్య బీమా కల్పిస్తారు. దేశంలోని 10 కోట్ల అతి పేద కుటుంబాలకు ఈ బీమా పథకం వర్తిస్తుంది. అంబేద్కర్ జయంతి నాడు (ఏప్రిల్ 14, 2018న) ప్రధాని ఈ ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఒక ఆరోగ్య కేంద్రాన్ని చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ప్రారంభించారు. ■

ISSN : 0971-8729

మమ్మల్ని కలవండి: https://www.facebook.com/pages/Yojana-journal

e-mail : yojanatelugu@gmail.com e-mail : yojana.telugu@nic.in

**జూన్, 2018** **సంపుటి : 46** **సంచిక : 8** **యోజన**

ముఖ్య సంపాదకులు : **దీపికా కచ్చల్**
సీనియర్ సంపాదకుడు : **విజయకుమార్ వేదగిరి**
సంపాదకుడు : **మహమ్మద్ సిరాజుద్దీన్**

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః*
*(ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

**1973 నుండి**

దేశం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలపై విస్తృత చర్చకు యోజన ఒక వేదిక. దీనికోసం ప్రభుత్వ విధానాలపై పరిశీలనకు వ్యాసాల రూపంలో వెసులుబాటు కల్పిస్తోంది. యోజన కేవలం ప్రభుత్వ వాణిని వినిపించే బాకా కాదు. ఈ మాస పత్రిక అస్సామీ, బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళ్, తెలుగు మరియు ఉర్దూ భాషలలో ప్రచురించబడు తున్నది.

చీఫ్ ఎడిటర్ కార్యాలయం: రూం నెంబర్-660 సూచనాభవన్; సి.జి.ఓ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003. ఫోన్: 011-24362971.
ఈ-మైల్: yojanace@gmail.com:
వెబ్ సైట్: www.yojana.gov.in; www.publicationsdivision.nic.in
యోజన ఇంగ్లీష్; రూం నెంబర్ 647; సూచన భవన్; సి.జి.ఒ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003.
సంయుక్త సంచాలకుడు (ప్రొడక్షన్) : **వి.కె. మీనా**

మా ప్రతినిధులు: అహ్మదాబాద్: శ్రీమతి అమిత మారు; బెంగుళూరు: కుమారి ఎస్. పునీత; చెన్నై: ఏ. ఇలంగోవన్; గువహటి: ఆనుపమ దాస్; హైదరాబాద్: విజయకుమార్ వేదగిరి; కొల్ కత్తా: శ్రీమతి రమా మండల్; ముంబై: ఉమేష్ సదాశివరావు ఉజ్గరె; తిరువనంతపురం: శ్రీమతి కె. ధన్య సన్యాల్; జలంధర్: శ్రీమతి గగన్ దీప్ కౌర్ దేవగన్; భువనేశ్వర్ గిరీష్ చంద్ర దాస్.

**సూచన:** ఈ పత్రికలోని వివిధ వ్యాసాలలో వెలువరించిన అభిప్రాయాలు ఆయా వ్యాస కర్తలవే గానీ, ప్రభుత్వానివి కావు.
వ్యాసాలలో ఉపయోగించిన ఏ దేశానికి చెందినవైనా జెండాలు, మ్యాపులు కేవలం సూచనప్రాయమేగానీ, అధికార మ్యాపులను ప్రతిఫలించవు. చట్టపరమైన సూచికలు కూడ కావు.
ఈ పత్రికలో వచ్చే ప్రకటనలలోని నిజానిజాలను పాఠకులు ముందుగా నిర్ధారించుకోవలసిందిగా మనవి. వీటిలోని ఏ అంశానికీ యోజన బాధ్యత వహించదు.

**చందా:**
యోజన మాసపత్రిక ఏ భాషదైనా సంవత్సర చందా రూ. 230/- రెండు సంవత్సరాలకు రూ. 430/- మరియు మూడు సంవత్సరాలకు రూ 610/- విదేశాలకైతే ఇవే చందారేట్లతో పాటు, ఇండియా పోస్టు వారు నిర్ణయించిన ఎయిర్ మెయిల్ ఛార్జీలను చెల్లిస్తే చాలు.
**నూతన చందాలు, నవీకరణలు, ఫిర్యాదులకు సంప్రదించండి : యోజన (తెలుగు), రూం.నం. 205, సి.జి.ఒ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80.**
ఫోన్ **040-27546313; 011-24367453** లేదా
**ఈ-మెయిల్: www.yojana_telugu@yahoo.co.in; www.pdjucir@gmail.com**

## ఈ సంచికలో...

1. డిజిటలీకరణ ద్వారా ప్రగతి.
   – *అమితాబ్ కాంత్ .............5*
2. మోదీ ప్రభుత్వ అభివృద్ధి వ్యూహం : ఒక పరిశీలన
   – *రాజీవ్ ఆహుజా.............9*
3. 'దొడ్డి' దారి అలవాటు మాన్పిన బహుదొడ్డ కార్యక్రమం
   – *పరమేశ్వరన్ అయ్యర్.........13*
4. మాతా శిశు రక్షణకు చేయూత
   – *రాకేశ్ శ్రీవాత్సవ..............15*
5. సిద్ధ యోగ
   – *డాక్టర్ ఆర్.ఎస్.రామస్వామి..18*
6. నూతన సాంకేతిక పరిణామాలు – యువతకు ఉపాధి కల్పన
   – *జతిందర్ సింగ్.................21*
7. భారత్‌లో పన్ను సంస్కరణలు–సంక్షిప్త చరిత్ర – *టి.ఎన్. అశోక్.........25*
8. తెలంగానం.........................*31*
9. విజ్ఞాన విపంచి
   – *ప్రాతూరి పోతయ్య శర్మ......32*
10. దర్పణం............................*35*
11. భారతలో పన్ను సంస్కరణలు– నిరంతర ఎజెండా
   – *ప్రొఫెసర్ వి. ఉషా కిరణ్..........37*
12. కృత్రిమ మేధో యుగం దిశగా భారత్
   – *పరిమళ్ తంబోలి...........41*
13. తెలంగాణలో ప్రజా ఉద్యమంగా మారిన స్వచ్ఛ భారత్ మిషన్
   – *తరుణ్ చక్రవర్తి .............45*
14. ప్రగతి పథంలో భారత గ్రామీణాభివృద్ధి
   – *డాక్టర్ పుల్లయ్య దూదేకుల.....49*
15. గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కేంద్ర పథకాలు
   – *డా॥ ఎం. చిన్నదురై*
   – *డా॥ కె.ఆర్. అశోక్............53*
16. పేదలకు వరం – ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన
   – *బిప్లవ్ ఛటర్జీ.................58*
17. మనసులోని మాట.................*60*

**పేజీల సంఖ్య 64**

**Sales Emporia:** New Delhi: Soochna Bhawan, CGO Complex, Lodhi Road; New Delhi-110003 (Phone No: 011-24365610). Delhi: Hall No. 196; Old Secretariat; Delhi-110 054(Phone: 01123890205). Navi Mumbai: 701, B Wing, 07th Floor, Kendriya Sadan, Belapur-400 614 (Phone: 022-27570686). Kolkatta: 8, Esplanade East-700 069 (Phone:033-22486696). Chennai: 'A' Wing, Rajaji Bhawan, Basant Nagar-600 090 (Phone: 04424917673). Thiruvananthapuram: Press Road; Near Govt. Press-695 001 (Phone:0471-2330650). **Hyderabad: Room No. 204, Second Floor, CGO Towers, Kavadiguda-500 080 (Phone: 040-27535383).** Bengaluru: First Floor, 'F' Wing, Kendriya Sadan, Koramangala-560 034 (Phone:080-25537244). Patna: Bihar State Co-operative Building, Asoka Rajpath-800 004 (Phone:0612-2675823). Lucknow: Hall No.1, Second Floor, Kendriya Bhawan, Sector-H, Aligunj-226 024 (Phone: 0522-2325455). Ahmadabad: Ambica Complex, First Floor, Above UCO Bank, Paldi-380 007 (Phone: 079-26588669). Guwahati: House No. 4, Pension Para Road-781 003 (Phone:030-2665090).


ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### అభివృద్ధికి ఎజెండా




**ప్రధాన సంపాదకుని కలం నుండి.....**

అనాది కాలం నుండి మంచి పాలకులందరూ తమ రాజ్యం లేదా దేశం అభివృద్ధిలో ముందుకు పోవాలనే కృషి చేశారు. సమగ్ర సామాజిక-ఆర్థిక ప్రగతి ప్రాధాన్యం తెలిసిన వాళ్ళు కావుననే వారు అలా కృషి చేసి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. అయితే అభివృద్ధి అనేది అనేక కోణాలలో ఉంటుంది. ఆధునిక కాలంలో అయితే ప్రజలు అభివృద్ధి అంటే నాణ్యమైన విద్య, వైద్య సౌకర్యాలు, రైతుల సంక్షేమం, మెరుగైన నాణ్యత సమృద్ధిగా ఉపాధి అవకాశాలు అని చూస్తున్నారు.

మన భారత ప్రభుత్వం కూడా ఆ అభివృద్ధి సాధనలో ఏమాత్రం తీసిపోలేదు. సమీకృత అభివృద్ధి నేటి మన మంత్రం. అంటే, అభివృద్ధి ఫలాలను సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి సైతం అందచేయడం. దీనికి తగినట్లు మన విధానాలను కూడా సవరించారు. ఆర్థిక వ్యవస్థతో మొదలుపెట్టి ప్రభుత్వం ముందుగా పన్నులను సవరించింది. దేశమంతటికీ ఒకే పన్ను విధానం జిఎస్‌టిని ప్రవేశపెట్టింది. బ్యాంకింగ్‌రంగ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.

ప్రపంచం వేగంగా కంప్యూటరీకరించబడుతోంది. ఈ ఒరవడి నుండి మనదేశం విడిగా మనజాలదు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ పథకం, ప్రజా ఆర్థిక నిర్వహణా విధానం (పిఎఫ్ఎంఎస్) ఈ-మార్కెట్ ప్లేస్, డిజిటల్ చెల్లింపుల కోసం భీమ్ మాధ్యమం మొదలైన సృజనాత్మక చర్యలన్నీ ప్రభుత్వాన్ని ప్రజలకు దగ్గర చేశాయి.

వీటికి తోడు, స్వచ్ఛ భారత్ మిషన్ పారిశుధ్యాన్ని ఒక నిజమైన ప్రజాందోళనగా రూపుదిద్దింది. ఈ కార్యక్రమానికి ప్రజా స్పందన అమోఘం. అక్టోబర్ 02, 2014 నుండి 7.1 కోటి ఇళ్ళలో మరుగుదొడ్లు ఏర్పాటు అయ్యాయి. అప్పటికి కేవలం 39 శాతంగా ఉన్న గ్రామీణ పారిశుధ్య రేటు నేటికీ 83 శాతానికి చేరింది. ఆరోగ్య రక్షణ మరో ప్రధానాంశం. నాణ్యమైన మందులను సరసమైన ధరలకు పొందటం పేదలకు ఒక సవాలుగా నిలిచింది. ప్రధానమంత్రి "జన ఔషధీ పరియోజన" ఈ లోటును భర్తీ చేస్తున్నది.

సమాజంలోని బలహీన వర్గాలను అన్ని విధాల కాపాడుకోవటం అనేది ప్రభుత్వానికి ఒక పెద్ద సవాలుగా నిలిచింది. బాలికల పట్ల ప్రజల ఆలోచనావిధానాన్ని మార్చడానికి ప్రయత్నించడంతో ప్రారంభించి, "బేటీ బచావో బేటీ పఢావో" అంటే బాలికలను రక్షించండి, బాలికలను చదివించండి అనే కార్యక్రమాన్ని దశలవారీగా దేశంలోని అన్నీ జిల్లాలలోనూ అమలుచేస్తున్నారు. మహిళా, శిశు రక్షణకు హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేయడం, బాధితులకు పునరావాసాన్ని, న్యాయ, సామాజిక సహాయాన్ని అందచేయడం, పాఠశాలలలో లింగ వివక్షతకు వ్యతిరేకంగా విద్యార్థులకు చిన్నప్పుటి నుండే అవగాహనను పెంపొందించడం వంటి చర్యలు ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరిచి, జాతి ప్రగతికి అనుకూల వాతావరణాన్ని కల్పించినట్లయ్యింది.

గ్రామీణాభివృద్ధి జాతి పురోభివృద్ధిలో మరో ప్రధానాంశం. ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా కార్యక్రమం, రాష్ట్రీయ కృషి విగ్యాన్ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి పథకాలతో రైతుల సంక్షేమానికి హామీ ఇస్తూ, వారి ఆదాయాన్ని రెట్టింపు చేసి, గ్రామీణ-పట్టణ జీవనాలమధ్య అంతరాన్ని తగ్గించడానికి కృషి చేస్తున్నది. ప్రగతి అనేది గాలివాటుగా వచ్చేది కాదు. అన్ని శక్తులూ సమిష్టిగా కృషి చేస్తేనే సిద్ధిస్తుంది. నేడు మనదేశంలో ఈ శక్తులన్నీ కలిసికట్టుగా దేశాన్ని నూతన తీరాలకు చేర్చడానికి కృషి చేస్తున్నాయి. ■

# డిజిటలీకరణ ద్వారా ప్రగతి

**- అమితాబ్ కాంత్**



**సామాజిక లబ్ది ప్రయోజనాలను అందించడంలో అందరినీ భాగస్వాములను చేసే ప్రక్రియను బయోమెట్రిక్ ద్వారా గుర్తించే విశిష్టమైన ప్రక్రియను ఇండియా మేళవించింది. దీని ఫలితంగా వివిధ సంక్షేమ కార్యక్రమాల కింద అనుచితంగా లబ్ది పొందుతున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దాదాపు 437 పథకాల్లో నేరుగా లబ్ధిదారునికే బదిలీ అంటే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ పద్ధతిని అమలు చేస్తున్నారు. దీని ద్వారా ఇప్పటి వరకు 83 వేల కోట్ల రూపాయాలను ఆదా చేయగలిగింది.**

ప్రపంచమంతా డిజిటలైజేషన్ వైపు వేగంగా పరుగులు తీస్తోంది. వస్తువుల తయారీ, వాటి అమ్మకం, ప్రజలు తమ రోజువారీ లావాదేవీలను నిర్వహించుకోవడం నుంచి ప్రభుత్వం ప్రజలకు సామాజిక సేవలను అందించడం వరకు అంత డిజిటల్‌మయం అయిపోతోంది. మహావేగంతో విస్తరిస్తున్న డిజిటల్ డేటా, నానాటికీ అందుబాటులోకి వచ్చేస్తున్న డేటా స్టోరేజి ఖర్చులు, ఇతర మౌలిక సదుపాయాలు డిజిటలైజేషన్ పరిణామాన్ని మనం ఊహించనంత వేగంతో మన ముందుకు తెచ్చేస్తున్నాయి. అందుకే దీన్ని 4వ పారిశ్రామిక విప్లవం అంటున్నారు.

ఈ నేపథ్యంలోనే అటు భారత ప్రభుత్వం ఇటు పలు రాష్ట్ర ప్రభుత్వాలు డిజటల్ ఇండియా దిశగా పయనించే ముమ్మర అవకాశాలను గుర్తించి సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకునేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. గత కొన్ని ఏళ్లలోనే చూస్తే మన దేశంలోని వివిధ రంగాల్లో పాలన పలు కీలకమైన మార్పులకు లోనైంది – సాంకేతికత, డేటా విశ్లేషణ, వివిధ శాఖల విధులకు సంబంధించిన ప్రక్రియల రీ–ఇంజనీరింగ్ వంటివి దూసుకుని వచ్చేశాయి. ఇప్పుడు ప్రభుత్వాలు తమ తమ కార్యక్రమాలకు, పథకాలకు రూపకల్పన చేసి, అమలు చేసే విధానాలను మొత్తంగా సాంకేతికత మార్చి వేస్తున్నది. సాంకేతికత వల్ల మెరుగైన వ్యవస్థలు ఏర్పడ్డాయి, సామర్థ్యం మెరుగుపడింది. మొత్తంగా పాలన మీదే సాంకేతికత గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తోంది.

ప్రభుత్వం పలు చిన్న, భారీ ఈ–గవర్నెన్స్ పథకాలను, డిజిటలైజేషన్ కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. ఇప్పుడు వీటన్నింటిని 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం కిందకు తీసుకుని రావడం జరిగింది. ఈ–క్రాంతి పేరిట నేషనల్ ఈ–గవర్నెన్స్ ప్లాన్ 2.0 కింద 31 పథకాలను మిషన్ రూపాల్లో ప్రవేశపెట్టిన తర్వాత మొబైళ్లలో, క్లౌడ్ వంటివానిల్వ సౌకర్యాలను ఉపయోగించడం విపరీతంగా పెరిగి పోవడం వల్ల డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని పునర్వవస్థీకరించాల్సిన అవసరాన్ని గుర్తించడం జరిగింది. పాలనా ప్రక్రియను మార్చేందుకు ఈ–గవర్నెన్స్ ప్రక్రియను మార్చాలన్న దృక్కోణం ముందుకు వచ్చింది. ఇప్పుడు ఈ–గవర్నెన్స్ కింద ఉన్న అన్ని పథకాలు ఈ–క్రాంతి పథకంలోని ముఖ్య సూత్రాలను అనుసరిస్తున్నాయి – 'అనువాదమే కానీ, అనుకరణ కాదు, వ్యక్తిగతమైన సేవలు కాదు సమీకృతసేవలు (సమీకృత సేవలే కానీ వ్యక్తిగత సేవలు కాదు), ప్రతి మిషన్‌మోడ్ ప్రాజెక్టులోనూ ప్రభుత్వ ప్రక్రియల


ముఖ్య కార్యనిర్వహణాధికారి, నీతి అయోగ్, న్యూఢిల్లీ.
E-mail : Amitabh.kant@nic.in

రీ–ఇంజనీరింను తప్పనిసరి చేయడం, కోరగానే ఐసిటీ మౌలిక సదుపాయల కల్పన, నేరుగా మొదటే క్లౌడ్ విధానం, మొబైల్ ఫస్ట్ (తొలి ప్రాధాన్యం మొబైల్), వేగవంతమైన అనుమతులు (ఫాస్ట్ ట్రాకింగ్ అప్రూవల్స్), ప్రమాణాలను, విధానాలను తప్పని సరి చేయడం, స్థానిక భాషను ఉపయోగించడం, జాతీయ భూప్రదేశ సమాచార వ్యవస్థ (నేషనల్ జియో స్పేషియల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్), భద్రత – ఎలక్ట్రానిక్ విధానంలో సమాచారాన్ని భద్ర పర్చడం (సెక్యూరిటీ అండ్ ఎలక్ట్రానిక్ డేటా ప్రిజర్వేషన్).

సామాజిక లబ్ధి ప్రయోజనాలను అందించడంలో అందరినీ భాగస్వాములను చేసే ప్రక్రియను బయోమెట్రిక్ ద్వారా గుర్తించే విశిష్టమైన ప్రక్రియను ఇండియా మేళవించింది. దీని ఫలితంగా వివిధ సంక్షేమ కార్యక్రమాల కింద అనుచితంగా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దాదాపు 437 పథకాల్లో నేరుగా లబ్ధిదారునికే ప్రయోజన బదిలీ అంటే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ పద్ధతిని అమలు చేస్తోంది. దీని ద్వారా ఇప్పటి వరకు 83 వేల కోట్ల రూపాయాలను ఆదా చేయగలిగింది. ఇలా విశిష్ట గుర్తింపును, సంక్షేమ పథకాలను మేళవించడం ద్వారా ఇప్పటి వరకు 2.75 కోట్ల మేర నకిలీ, తప్పుడు, అస్తిత్వంలో లేని వ్యక్తుల రేషన్ కార్డులను తొలగించడం జరిగింది. అదే విధంగా 3.85 కోట్ల మేర నకిలీ లేదా వినియోగంలో లేని వినియోగదారులకు వంట గ్యాస్ రాయితీని చెల్లించకుండా నిలువరించ గలిగింది.

## సకల జనుల ఆర్థిక భాగస్వామ్య లక్ష్యంలో భారత్ ముందంజ


గత ప్రభుత్వాలకు ఇప్పటి విధానానికీ స్పష్టమైన, ముఖ్యమైన మార్పు కనిపిస్తోంది. నేను కేరళలో పని చేస్తూ ఉన్నప్పుడు మత్స్య రంగంలో పని చేసే అరుదైన అవకాశం నాకు దక్కింది. సాంప్రదాయికంగా మత్స్యరంగం మీద ఆధారపడి బతుకుతున్న బెస్తవారి జీవనోపాధిని పెంచే ప్రయత్నం చేయాలన్న ఒక లక్ష్యం ఉండేది. అప్పట్లో ఈ రంగం పూర్తిగా దళారీలమయం అయిపోయి ఉండేది. మార్కెట్ ధరల్లో కేవలం నాలుగో వంతు అంటే 25 శాతం మాత్రమే చేపలు పట్టేవారికి దక్కేది. ఆ దశలో మేము స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేశాం. వారికి కొత్త టెక్నాలజి రూపంలో సాంకేతిక సాయం అందించాం. వారి ఉత్పాదకతను పెంచే విధంగా ఫైబర్ గ్లాస్ క్రాఫ్టులు, అవుట్ బోర్డు మోటర్లు, చేపలు పట్టే వలలు అందజేశాం. సముద్రతీరం వద్దనే వేలం వేయగలిగే విధంగా నూతన విధానానికి శ్రీకారం చుట్టాం. ఈ ప్రక్రియ ద్వారా వారి రోజూవారీ శ్రమకు తగిన ఫలితం ఏరోజుకారోజు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతుండేది. ఈ మొత్తం ప్రయత్నంలో బాగా ఇబ్బందికరమైన అంశమల్లా మత్స్యకారుల ద్వారా బ్యాంకు అకౌంట్లను తెరిపించడమే. బ్యాంకులను, బ్యాంకు మేనజర్లను నిరంతరం వెంటపడుతూ ఈ పని చేయించడానికి 10 నెలలు పట్టింది. Know Your Customer (KYC) అంటే వినియోగదారుడి గుర్తింపును బ్యాంకు అకౌంట్లకు జత చేయడం మరో పెద్ద అవరోధం. దీనితో పోలిస్తే గతనెల నా అనుభవం ఎంతో భిన్నంగా ఉంది. నేను నేరుగా ఒక బ్యాంకుకి వెళ్లి నా బయోమెట్రిక్ గుర్తింపు ద్వారా ఒక్కటంటే ఒక్క నిమిషంలోనే ఖాతా తెరుచుకోగలిగాను. ఒకనాడు పది నెలలు పట్టిన ప్రక్రియకు ఇప్పుడు ఒకే ఒక నిమిషం పట్టడం సిసలైన పురోగతి సూచిస్తోంది. జన్ ధన్ – ఆధార్ – మొబైల్ .. ఈ మూడు కలిసి దేశంలో ప్రజలకు సేవలను అందించడంలో పునాదిగా నిలుస్తున్నాయి.




ఇందులో ఈ–కేవైసీ, ఈ–సైన్, యూపీఐ ద్వారా తక్షణ చెల్లింపుల సేవలు, డిజిలాకర్ వంటి ఫైల్ స్టోరేజి సేవలు వంటివి ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సకల జనులను ఆర్థికంగా భాగస్వామ్యులను చేసే ప్రక్రియ మరింత విస్తృతం కావడంలో అతి ముఖ్యమైన పాత్ర ఇలాంటి సేవలదే. ప్రపంచబ్యాంకు విడుదల చేసిన గ్లోబల్ ఇండెక్స్ నివేదిక 2017 ప్రకారం, 2014–17 మధ్యకాలంలో కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతాల్లో 55 శాతం ఖాతాలు ఇండియాలోనివే కావడం గమనార్హం. 2014 నుంచి జన్ ధన్ యోజన కింద 31 కోట్ల మంది బ్యాంకు ఖాతాలను ఏర్పాటు చేసుకున్నారు. 2014 లో 53 శాతం వయోజనులకు బ్యాంకు ఖాతాలు ఉండగా 2017లో బ్యాంకు ఖాతాలున్న వయోజనుల శాతం 80.

## డిజిటల్ విధానంలోనే పబ్లిక్ ఫైనాన్స్, పబ్లిక్ ప్రొక్యూర్మెంటు

ప్రజా ఆర్థిక నిర్వహణా విధానం–పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) కారణంగా అన్ని ప్రణాళికా పథకాల ఆర్థిక నిర్వహణ కోసం ఒక వేదికను నిర్మించినట్లైంది. ఇందులో సేవలను అందుకునే సంస్థల డేటాబేస్ కూడా ఉంది. బ్యాంకులకు సంబంధించిన కోర్ బ్యాంకింగ్ పరిష్కారాలు కూడా ఇందులో ఇమిడి ఉన్నాయి. వివిధ పథకాలను అమలు చేస్తున్న అత్యంత కింది స్థాయి అధికారి వరకు నిధుల బదిలీని నిరంతరం పర్యవేక్షించే వెసులుబాటు కల్గింది. పీఎఫ్ఎంఎస్ వల్ల నిధులను సకాలంలో విడుదల చేసే సౌకర్యం, విడుదల అయిన నిధుల సక్రమ వినియోగాన్ని సమర్థంగా పర్యవేక్షించ వచ్చు. మార్చి 28 నాటికి పీఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా 98 లక్షల లావాదేవీలకు గానూ 72 వేల కోట్ల మేర లావాదేవీలు డిజిటల్ రూపంలో జరిగాయి. ఒక్క రోజులో జరిగిన లావాదేవీల పరంగా ఇది ఒక రికార్డు కూడా. సాధారణంగా ఉపయోగించే, తక్కువ విలువ గల వస్తువుల, సేవల కోసం 2016 లో ఒక ఆన్ లైన్ సింగిల్




విండో ప్రొక్యూర్మెంట్ పోర్టల్ 'గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్' (జీఈఎం) ను ప్రారంభించడం జరిగింది. రెండు లక్షల రూపాయలు లేదా అంతకన్నా ఎక్కువ విలువైన వస్తువులు, సేవల ఈ-ప్రొక్యూర్మెంట్ కోసం సెంట్రల్ పబ్లిక్ ప్రొక్యూర్మెంట్ పోర్టల్ ఏర్పడింది. జీఈఎం ద్వారా ప్రభుత్వ సేవల వినియోగదారులకు, ఉత్పత్తుల అమ్మకందార్లకు, ఇతర సర్వీస్ ప్రొవైడర్లకు నేరుగా జరిపే కొనుగోళ్లు, ఈ-బిడ్డింగ్, రివర్స్ ఈ-ఆక్షన్స్, ఆన్లైన్ రిజిస్ట్రేషన్ సౌకర్యాలు వంటివి అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ కొనుగోళ్లకు ఇది ఒక మార్కెట్ మాదిరిగా ఉపయోగ పడుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 22 వేల మంది ప్రభుత్వ కొనుగోలుదారులు, లక్షకు పైగా అమ్మకందార్లు లేదా సేవలను అందించేవారు, 2.31 లక్షల మేర ఉత్పత్తులు లేదా సేవలు అందుబాటులో ఉన్నాయి. రూ. 6,500 కోట్ల మేర లావాదేవీలు జరిగాయి. ఇందులో 44 శాతం కొనుగోళ్లు మధ్యతరహా లేదా చిన్న తరహా వ్యాపారస్తులకు సంబంధించినవే.

### వినియోగదారుల చెల్లింపులో ఇండియా ముందంజ

యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్ (యూపీఐ), భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బీబీపీఎస్) వచ్చిన తర్వాత ప్రైవేట్ రంగంలో పలు యాప్లు అందుబాటులోకి వచ్చేశాయి. వీటి వల్ల వినియోగదారులు ప్రభుత్వ సేవలకు చెల్లింపులు జరపడం చాలా సులభమైపోయింది. బీబీపీఎస్ పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన నాటి నుంచి 2017 ఏప్రిల్ నాటికి దీని ద్వారా బిల్లులు చెల్లించిన సంఖ్య దాదాపు రెండింతలు అయింది. ఈ మధ్య కాలంలో ఇలా చెల్లించిన బిల్లుల విలువ కూడా 46 శాతం పెరిగింది. కేపీఎంజీ సంస్థ నివేదిక ప్రకారం 2016 చివరకు ఇండియాలో బిల్లుల చెల్లింపు రూ. 5.85 ట్రిలియన్ల కన్నా ఎక్కువగా ఉంది. ఇందులో 70 శాతం చెల్లింపులు నగదు రూపంలో గానీ, చెక్కు రూపంలో గానీ జరుగుతున్నాయి. 2020 నాటికల్లా బిల్లు చెల్లింపులు రూ. 9.4 ట్రిలియన్ల కన్నా ఎక్కువ ఉండవచ్చని ఈ సంస్థ అంచనా వేసింది. ఇప్పుడు డిజిటల్ రూపంలో చెల్లింపులు జరపడం




చాలా తేలిక అయిపోయింది. భారత్ ఇంటర్ ఫేజ్ ఫర్ మనీ (భీమ్) యూపీఐ ఇందుకు ప్రధాన కారణం అని చెప్పవచ్చు. గూగుల్ తేజ్, వాట్సప్ పేమెంట్ వంటివి అందుబాటులోకి రావడం వల్ల 2017-18లో భారత్లో డిజిటల్ రూపంలో బిల్లు చెల్లింపులు బిలియన్ కన్నా ఎక్కువగా పెరిగాయి. విలువ రూపేణా చూస్తే ట్రిలియన్ కన్నా ఎక్కువే. కొత్త సంస్థలు, కొత్త కొత్త సాంకేతికత అందుబాటులోకి వచ్చే కొద్దీ ఈ డిజిటల్ చెల్లింపుల మరింత ముమ్మరంగా సాగే సూచనలు ఉన్నాయి. 2023 నాటికి మనదేశంలో డిజటల్ చెల్లింపులు ఒక ట్రిలియన్ డాలర్లకు మించి పోతాయని క్రెడిట్ సుసీ ప్రాజెక్ట్స్ ఇండియా సంస్థ నివేదిక అంచనా వేసింది.

### ఆర్థిక ప్రక్రియలను డిజిటల్ రూపంలోకి తీసుకుని రావడం

ప్రత్యక్ష పన్నుల వసూళ్లను డిజటలైజ్ చేయడం వల్ల భారీ ప్రయోజనాలు కలిగాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను శాఖకు 6.84 కోట్ల మేర ఆదాయపు పన్ను రిటర్నులు అందాయి. అంటే 26 శాతం పెరుగుదల. వీటిలో కోటికి పైగా కొత్తగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసిన వారివే. అందులోనూ 98.5 శాతం రిటర్నులు ఆన్లైన్లో దాఖలు అయినవే. గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జీఎస్టీ) వచ్చిన తర్వాత పరోక్ష పన్నుల చెల్లింపుదారుల సంఖ్యలో అంతకు మునుపుతో పోలిస్తే 50 శాతం పెరుగుదల ఉంది. దాదాపు 34 లక్షల మంది పరోక్ష పన్ను




చెల్లింపుదారులు కొత్తగా ఏర్పడ్డారు. ఆర్థిక రంగంలో ఇది పెను మార్పే.

### డిజిటల్ ద్వారా పాలన, పర్యవేక్షణ

ప్రో యాక్టివ్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్ (ప్రగతి) కార్యక్రమం అమలులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డిపార్టుమెంటుల హద్దులను, భౌగోళిక సరిహద్దులను దాటి కార్యక్రమం వేగవంతగా అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఆయన స్వయంగా మాట్లాడి ఈ కార్యక్రమం అమలు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సామాజిక రంగ పథకాల అమలులో, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలులో ఎదరౌతున్న సవాళ్లను ఆయన ప్రత్యక్షంగా సమీక్షిస్తున్నారు. వీడియో కాన్ఫెరెన్సుల ద్వారా ప్రధాన మంత్రి 25 ప్రగతి సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాల్లో 227 ప్రాజెక్టులను సమీక్షించడం జరిగింది. వాటి విలువ 10.5 లక్షల కోట్లు. ఇటీవలే ప్రతిపాదించిన ఆయష్మాన్ భారత్ పథకం కింది

జిల్లా స్థాయి ఆసుపత్రులను ప్రాథమిక, సామాజిక వైద్య కేంద్రాలను డిజిటల్ రూపంలో లింక్ చేయడం జరిగింది. ఐదు లక్షల రూపాయల మేర ఆరోగ్య బీమాతో పాటుగా ఈ పథకం కింద 50 కోట్ల మంది భారతీయు లకు వర్తింపచేస్తారు. పూర్తి పేపర్ లెస్, క్యాష్ లెస్, పోర్టబుల్ పథకం ద్వారా ఆరోగ్యరక్షణ కల్పించవచ్చు. ఈ సమాచారాన్ని ఆధార్‌తో అనుసంధానించడం వల్ల మరింత మెరుగైన సేవలను అందజేయవచ్చు.

**నూతన సాంకేతికతల ప్రభావం**

యాక్సెంచర్ సంస్థ నిర్వహించిన విశ్లేషణ ప్రకారం కృత్రిమ మేధస్సు వల్ల భారత ఆర్థికానికి 2035 నాటికల్లా US $ 957 బిలియన్లు లేదా కరెంట్ గ్రాస్ వ్యాల్యూ యాడెడ్‌లో 15 శాతం జతచేరే అవకాశం ఉంది. భారతదేశంలో ఉన్న విశిష్టమైన సమస్యలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిష్కారాలు చూపగలదు. ఆసియా పసిఫిక్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆర్థిక ప్రభావం మీద మైక్రోసాఫ్ట్ – ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ అధ్యయనం ప్రకారం, 2021 నాటికి భారత్ స్థూల జాతీయోత్పత్తికి డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ 154 బిలియన్ డాలర్లను జత చేయనుంది. అంటే ఏటా 1 శాతం చొప్పున పెరుగనుంది. 2017లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ టెక్నాలజి వంటి వాటి వినియోగం ద్వారా ఉత్పత్తి అయిన వస్తువులు, సేవల రూపంలో స్థూల జాతీయోత్పత్తిలో 4 శాతం సమకూరింది. ప్రభుత్వ ప్రక్రియలు, పథకాలలో కొత్త సాంకేతికలను విరివిగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. నేషనల్ ప్రోగ్రాం ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జాతీయ కృత్రిమ మేధ కార్యక్రమం) అనే కార్యక్రమాన్ని నీతి ఆయోగ్ అభివృద్ధి చేస్తున్నది. ఈ విషయమై వివిధ మంత్రిత్వ శాఖలతో, విద్యా సంస్థలతో, పరిశ్రమలతో, పరిశోధకులతో, అంకుర పరిశ్రమలతో నీతి ఆయోగ్ చర్చలు జరుపుతున్నది. టెక్నాలజీలను, పరిపాలనలో, ఆర్థికాభివృద్ధిలో వాటి ఉపయోగాన్ని, అవి తీసుకుని వచ్చే అనర్థాలను గానీ, ప్రమాదాలను గానీ, వాటి భవిష్యత్ ప్రస్థానాన్ని అర్థం జేసుకోవడానికి ఈ చర్చలు ఎంతో కీలకం. అంతేగాకుండా, నిర్దిష్టమైన వినియోగాలు ఉన్న చోట్ల కూడా ఈ సాంకేతికలను వినియోగించేందుకు నీతి ఆయోగ్ చర్యలు తీసుకుంటున్నది. జాతీయ ప్రాధాన్యాతాంశాల్లో కూడా టెక్నాలజీ ఉపయోగాన్ని మదింపు చేసి, నమూనాగా ఉపయోగించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇలాంటి జాతీయ ప్రాధాన్యాతాంశాల్లో టెక్నాలజీ వినియోగ ప్రయత్నాలను ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ అంటున్నారు. వ్యవసాయంలో, భూమి రికార్డులను సరిచేయడంలో, ఆరోగ్య సంరక్షణకు సంబంధించి దయాగ్నోస్టిక్స్‌లలో ఖచ్చితత్వం అవసరైన అంశాల్లో కృత్రిమ మేధను పరీక్షించడం జరుగుతోంది. జాతీయ స్థాయిలో పరిపాలనలో కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగాన్ని పరీక్షించి వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోగలిగే విషయాన్ని నిర్ధారించు కోవడం ఈ ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ ముఖ్య ఉద్దేశ్యం. భారత్ ఒక సంక్లిష్ట దేశం. సామాన్యులు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవడంలో దశాబ్దాల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ రంగాల్లో సాంకేతికతను వేగంగా వినియోగించడం వల్ల పనులు సులభతరమౌతున్నాయి. అనవసర మానవ ప్రమేయం తగ్గిపోతోంది. పాలనకు సంబంధించి సమర్థత, ప్రభావశీలతల మీద ఇది గణనీయమైన ప్రభావం చూపుతుంది. ■


## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు "అను" 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు ప్రతి నెలా 15వ తేదీ లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. ఏ నెలకైనా సంబంధించిన అంశం (Topic of the month) పైనే వ్యాసాలు పంపాలి గమనించగలరు. వ్యాసాలను పంపేవారు ఏ నెలకానెల ఇచ్చే ప్రత్యేక అంశంపైననే 5వ తారీఖులోపు నాలుగు వాక్యాల అవరణం పంపాలి.

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in

# మోదీ ప్రభుత్వ అభివృద్ధి వ్యూహం : ఒక పరిశీలన

– రాజీవ్ అహూజా




**ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు వీలుగా, కొన్ని నిర్దిష్ట భౌగోళిక ప్రాంతాలు, జనసమూహాలకు ప్రత్యేకమైన కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందించింది. సామాజిక రంగంలో కూడా నియంత్రణ పద్ధతుల్లోని లోపాలను సవరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కీలక అంశాల్లో సైతం అభివృద్ధికి ఆమడ దూరంలో వెనుకబడి ఉన్న వంద జిల్లాలను ప్రభుత్వం గుర్తించి అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది.**

ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి, శీఘ్రాభివృద్ధి, సర్వతోముఖాభివృద్ధి – అనే త్రిముఖ వ్యూహాన్ని గురించి పదేపదే ప్రకటిస్తోంది. అభివృద్ధిని ఒక ప్రజా ఉద్యమంగా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని ప్రభుత్వం చెబుతోంది.

అంతకు ముందు ప్రభుత్వాలకు భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వమే భారత రాజకీయాల్లోకి అభివృద్ధి అనే అంశం చుట్టూ దృష్టిని కేంద్రీకరించటమనే మార్పును తెచ్చిందని కొందరు అంగీకరించారు. అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలకమైన చర్యలను చేపట్టింది. జనధన్ యోజన, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, ముద్ర బ్యాంకు యోజన, స్వచ్ఛ భారత్ అభియాన్, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాల జాబితా కొనసాగుతూనే ఉంది. గత నాలుగేళ్లలో ప్రభుత్వంచేపట్టిన పలు కార్యక్రమాలపై సామాన్య మానవుని అభిప్రాయం ఏమిటి?

వివిధ సంస్కరణలు/కార్యక్రమాలను ఆర్థికవృద్ధికి సాధనాలుగా పరిగణించడమే సానుకూల ధోరణిగా గుర్తించవచ్చు. ఈ భావన పరిధి పరిమితమైనప్పటికీ, ఈ అభిప్రాయం మాత్రం సానుకూలమైన దృక్పథాన్ని కల్పిస్తుంది. ఈ దృక్పథాన్ని అమలు చేయాలంటే సంస్కరణ కార్యక్రమాలను మూడు విస్తృత వర్గాలుగా సులభంగా వర్గీకరించవచ్చు

(i) అందుబాటులోఉన్న ఫలాలను సులువుగా అందుకుని తక్షణ విజయం సాధించడం

(ii) మధ్యతరహా లేదా దీర్ఘకాలికమైన ప్రయోజనాలను సాధించగలవన్న ఆశ కల్పించేవి

(iii) స్వల్పకాలిక వ్యయాల ద్వారా ఆ తరువాత గణనీయమైన లాభాలు తెచ్చిపెట్టే కార్యక్రమాలుగా విభజించవచ్చు

ఉదాహరణకు భారతదేశంలోని వైద్యులు కొరతను ఎదుర్కోవడానికి కేంద్ర వైద్య ఆరోగ్య సేవలలోని వైద్యుల పదవీ విరమణ వయసును పెంచడం, పెంపకాన్ని అఖిల భారత అటవీ చట్టం నుంచి తప్పించి అటవీ ప్రాంతం పరిధిలోనికి రాని ఇతర ప్రాంతాల్లో కూడా పెంచేందుకు వీలుగా సవరించడం వల్ల రైతుల ఆదాయం పెరిగే అవకాశం లభిస్తుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలలో అఖిలభారత వైద్య విజ్ఞాన కేంద్రాల వంటి ఆసుపత్రులను నెలకొల్పడం, అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎంతో వేగంగా నడిచే బులెట్ ట్రైన్లను ప్రవేశపెట్టడం వంటి పథకాలు దీర్ఘకాల ఫలితాలను అందజేసే ప్రాజెక్టులకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. అదేవిధంగా,

ఆర్థిక శాస్త్రవేత్త, న్యూఢిల్లీ.
E-mail : ahujaahuja@yahoo.com

అధిక విలువ కరెన్సీ నోట్లను రద్దు చేయడం, వస్తు సేవల పన్ను వంటి నిర్మాణాత్మకమైన సంస్కరణల వల్ల స్వల్పకాలంపాటు ఇబ్బందులు లేదా బాధలు కలిగినా, దీర్ఘకాలంలో ఎంతో ముఖ్యమైన ఆర్థిక లాభాలను అందజేసే పథకాలుగా చెప్పుకోవచ్చు

## ఆర్థిక శాస్త్రవేత్తల దృక్కోణం

ప్రభుత్వం చేపట్టే వివిధ సంస్కరణలు/ కార్యక్రమాలను మరో ఆర్థిక దృక్పథంతో, పరిశీలిస్తే, వాటివల్ల ఇప్పటివరకు ప్రభుత్వ వైఫల్యాల వల్ల కలిగిన నష్టాలను పరిష్కరించే సంస్కరణలు మాత్రమే గాక మార్కెట్‌పై కూడా దీర్ఘకాలిగా ప్రభావం చూపగల సంస్కరణలుగా చెప్పవచ్చు. మార్కెట్ యంత్రాంగాన్ని విచ్ఛిన్నం చేసే బలీయమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రభుత్వం తన విచక్షణను ఉపయోగించి తప్పక జోక్యం చేసుకుంటుందన్ననమ్మకం కలిగిన వారికీ ఇలాంటి చర్యలు తగిన భరోసా కల్పిస్తాయి. తమ లాభాలకోసం వస్తుసేవల సరఫరాలను నియంత్రించే సంస్థలు వ్యక్తుల చర్యల వల్ల సమాజంపై దుష్ప్రభావం ఏర్పడకుండా మార్కెట్ పరిస్థితులను ఎప్పటి కప్పుడు తగిన విధంగా సరిచేసి స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని ఏర్పరచడంలో ప్రభుత్వ నిర్ణయాలు కీలకమవుతాయి.

## మార్కెట్ లోపాల దిద్దుబాటు

ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో కొత్త ప్రాజెక్టులకు మాత్రమే గాక మునుపటి ప్రభుత్వాల హయాంలో నిలిచిపోయిన ప్రాజెక్టులకు కూడా తిరిగి పునరుత్తేజం కల్పించడం వల్ల వస్తుసేవల సరఫరాలో ఎక్కడ ఎలాంటి లోపం జరిగిందో ప్రజలకు బాగా అర్థం అవుతుంది. అంతే కాకుండా, భారత ప్రభుత్వం అంతర్జాతీయ సౌరశక్తి కూటమిలో వ్యవస్థాపక సభ్యత్వంతో ప్రజావసరాలను తీర్చే అంశంలో ప్రభుత్వం సానుకూలమైన క్రియాశీల పాత్రను నిర్వహి స్తున్నది.

డిజిటల్ లావాదేవీలకు బలమైన ఊతమివ్వడం లేదా జాతీయ పౌష్టికాహార పథకాన్ని పునరుద్ధరించడం లేదా స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రారంభించడం వంటి అనేక పథకాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం నిలిచిపోయిన అభివృద్ధిని కొనసాగించేందుకు మార్గం సుగమం చేయడమే అవుతుంది.

వెనుకబడిన వారికి ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించే దిశగా జనధన్ యోజన వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టడం, అల్పాదాయ వర్గాలవారికి సబ్సిడీతో కూడిన రుణాలు అందజేయడం ద్వారా గృహవసతి కల్పించడం, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా వృత్తి శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ద్వారా తగిన ఆదాయం పొందగలిగేలా చేయడం ద్వారా వస్తు సేవల ఉత్పత్తి డిమాండ్ సరఫరాలలో ఉన్న లోపాలను సరిదిద్ది మార్కెట్‌ను బలోపేతం చేస్తుంది. స్థూల ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని కొనసాగించడంలో ఆర్థికాభివృద్ధి ఎంతో కీలక పాత్ర వహిస్తుంది.

స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధించడానికి, వ్యవసాయ రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచేందుకు (ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన, భూసార పరీక్షల కార్డులు, ఫసల్ బీమా యోజన వాటి కార్యక్రమాలు), చిన్న వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు బ్యాంకుల నుంచి సులభమైన రుణ సదుపాయాలు (ముద్ర యోజన, ఇండియా స్టార్ట్ అప్, స్టాండ్ అప్ వంటి పథకాలు) కల్పిస్తున్నారు. అంతేగాకుండా 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, వచ్చే మూడేళ్ళలో విదేశీ పర్యాటకుల సంఖ్యను రెండింతలు పెరిగేలా చేయడం, సౌర విద్యుత్ ఉత్పత్తిని 100 గిగావాట్లకు పెంచడం వంటి బృహత్తర లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. ఆర్థిక పురోగతిలో కీలక ప్రాంతాలపై దృష్టి సారిస్తే ఆర్థికాభివృద్ధి మూలాధారాలను విస్తృత పరచ డానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అంతే గాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజల సామర్థ్యాన్ని వెలుగులోకి తేవడం ద్వారా ప్రజాస్వామ్యం పరిఢవిల్లేందుకు తోడ్పడుతోంది.

మార్కెట్ల వైఫల్యానికి ప్రభుత్వ వైఫల్యాలు కూడా తోడు కావచ్చు. మార్కెట్ వైఫల్యాలను సరిదిద్దలేకపోతే పేదరికాన్ని తగ్గించడం, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచలేక పోవడం వంటి విధుల నిర్వహణలో కూడా ప్రభుత్వం విఫలమవుతుంది.

## ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దడం

మార్కెట్ ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి ఉన్నత ప్రమాణాలను నిర్దేశించుకుని అందుకు తగిన విధంగా నిబంధనలను రూపొందించడం ద్వారా మార్కెట్లు సక్రమంగా పనిచేసి అభివృద్ధికి తోడ్పడే విధంగా కృషిచేయడం ప్రభుత్వ నిర్వహించాల్సిన ప్రధాన విధులలో ఒకటి. ఇందులో భాగంగానే ప్రభుత్వం నూతన నియంత్రణ సంస్థలను ఏర్పాటు చేయడంతో బాటు ప్రస్తుతం ఉన్న సంస్థలను బలోపేతం చేసేందుకు కూడా ప్రయత్నిస్తున్నది. ఉదాహరణకు, రియల్ ఎస్టేట్ లావాదేవీలలో పారదర్శకత ఉండటం ద్వారా కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడుతూనే రియల్ ఎస్టేట్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు వీలుగా ప్రభుత్వం రియల్ ఎస్టేట్ చట్టాన్ని ఆమోదిం చింది. అదేవిధంగా ఆహార భద్రతా నిబంధన లను బలోపేతం చేయడం, బ్యాంకింగ్ నిబంధనలను పటిష్టం చేయడం వంటి చర్యలను ఉదహరించవచ్చు. వృత్తి నియమాలను పాటించి నీతి నిజాయితీలను ప్రోత్సహించేందుకు వైద్యులు, అకౌంటెంట్లు, ఆడిటర్లు వంటి వారి వ్యవహారాలపై కూడా ఓ కన్ను వేసి ఉంచింది. సామాజిక రంగంలో కూడా నియంత్రణ పద్ధతుల్లోని లోపాలను సవరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఉదాహరణకు, ఆరోగ్య రంగంలో నియంత్రణ లేనప్పుడు, ఔషధాలు, వైద్య పరికరాల పరిశ్రమలలో పెద్ద ఎత్తున మార్కెట్ వైఫల్యం జరిగింది, దీంతో కమీషన్లు, చాటుమాటు వ్యవహారాలు (కిక్

బ్యాక్స్) సాగేవి. ఇప్పుడు ఇలాంటి వ్యవహారాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుండడం వల్ల ఈ పరిస్థితి కుదుట పడుతోంది

ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును మెరుగుపర్చడానికి, ప్రభుత్వం తన పెట్టుబడుల ఉపసంహరణకు లక్ష్యాలను పెట్టుకుంది. ఇది మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్పు చెందటానికి వీలుగా ప్రభుత్వ రంగ పరిశ్రమలు / సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంక్ తన కార్యకలాపాల కోసం తపాలా శాఖ పరిధిలోని 1.5 లక్షల పోస్ట్ ఆఫీసులను వినియోగించుకోవడం దీనికి చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అంతేకాకుండా, ఈ సంస్థల నిర్వహణలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది.


"కనీస ప్రభుత్వం, గరిష్ట పాలన"




నినాదంతో ప్రభుత్వ దైనందిన కార్యకలాపాల్లో మానవ జోక్యాన్ని తగ్గించడం కోసం డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుండడం వల్ల ప్రజలు పౌర సేవలను సులువుగా ఉపయోగించుకోవటమేగాక తమ జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి, ఇతర కార్యక్రమాలు/వ్యాపారాల వృద్ధి కోసం వినియోగించుకునేందుకు వీలైన అనుకూల వాతావరణం ఏర్పడుతోంది.

### భాగస్వామ్యం పెంపు

ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు వీలుగా, కొన్ని నిర్దిష్ట భౌగోళిక ప్రాంతాలు, జనసమూహాలకు ప్రత్యేకమైన కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందించింది. ఉదాహరణకు చాలాకాలంగా నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి దూరమైనా ఈశాన్య ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. దేశంలోని ఇతరప్రాంతాలతో సమానంగా అభివృద్ధి సాధించేందుకు వీలుగా ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొం




దించారు. అంతేగాకుండా కీలక అంశాల్లో సైతం అభివృద్ధికి ఆమడ దూరంలో వెనుకబడి ఉన్న వంద జిల్లాలను ప్రభుత్వం గుర్తించి అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది. అదేవిధంగా, తన ప్రభుత్వం 1000 రోజులలో 100 శాతం గ్రామీణ విద్యుదీకరణను సాధించాలనే మోడి నినాదం వెనుక అన్ని ప్రాంతాలలో సమానాభివృద్ధి సాధించాలనే ఆశయం కనిపిస్తున్నది. అదే విధంగా అన్ని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని లక్ష్యంతో సాగుతున్న కృషి వెనుక కూడా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్న స్ఫూర్తి కదలుతోంది.

మహిళలు, పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి, ప్రభుత్వం "ఉజ్వల యోజన"ను ప్రారంభించింది, ఈ పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్ లభిస్తుంది. అదేవిధంగా, పేద వర్గాలకు అనారోగ్యం సమయంలో ఆసుపత్రి ఖర్చులు నుండి విముక్తి కలిగించేందుకు ప్రభుత్వం జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకాన్ని ప్రవేశ పెట్టింది. నిర్దిష్ట జనాభాలో ఉప-సమూహాల మధ్య న్యాయబద్ధమైన వాటా కల్పనకు దోహదపడే కొన్ని పథకాలకు ఇవి చక్కటి ఉదాహరణలు.

వివిధ పథకాల కింద నగదు ప్రోత్సాహకాలు / నగదు బదిలీల నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి పరిపాలనను మెరుగుపరచడం కోసం నగదు బదిలీ పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పథకం కింద సబ్సిడీలు లేదా రాయితీల సొమ్ము నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బదిలీ అవుతుంది.

### మరో హేతుబద్ధమైన చర్య

మారుతున్న ఆర్థిక వ్యవస్థలో మార్కెట్ వైఫల్యాలు, న్యాయబద్ధమైన వాటా సాధన లక్ష్యాలతోపాటు, నూతన ఆర్థికవ్యవస్థ వల్ల కలిగే పరిణామాల్లో భాగంగా ఏర్పడే ఆర్థిక ప్రవర్తన అంశాల్లో ప్రభుత్వం జోక్యం తప్పక అవసరమవుతుంది. నిజానికి, ప్రభుత్వం అనేక అంశాలలో సామాజిక సంభాషణ ద్వారా ప్రజల ఆలోచనా ప్రక్రియలను, ప్రవర్తనలను, ఎంపికలను ప్రభావితం చేయాలని కోరుతోంది: ఉదాహరణకు బాలికాశిశు జననాలను ప్రోత్సహించడం, గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత ప్రదేశాలుగా మార్చడం వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రజలను చైతన్యపరుస్తోంది.

నిజానికి ప్రధానమంత్రి స్వయంగా తన విలువైన గొంతుకను అరువివ్వడం వల్ల ఈ కార్యక్రమాల ప్రచారానికి ఎంతో బలం చేకూరింది. ఉదాహరణకు ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను ఆచరించాలనీ, ఖాదీ వస్త్రాల వాడకంవల్ల ఎంతోమంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుందని చెప్పడానికీ, ఎవరికివారు స్వచ్ఛందంగా వంట గ్యాస్ సబ్సిడీని

వదులుకోవడం వల్ల కొత్తవారికి వంటగ్యాసు కనెక్షన్ లభించే అవకాశం కలుగుతుందని, విద్యుత్ వినియోగాన్ని ఆదా చేసేందుకు ఎల్ఈడీ బల్బులను వినియోగించాలన్న ప్రచారాల్లో కూడా ప్రధానమంత్రి స్వయంగా పాల్గొనడం విశేషం.

**మంచి రాజకీయాల వైపు అభివృద్ధి**

పైన పేర్కొన్న ఉదాహరణలు ప్రస్తుత పరిస్థితికి అద్దంపట్టే చిత్రాలు మాత్రమే. వాస్తవానికి ఈ సంస్కరణలు / కార్యక్రమాల జాబితా మరింత ఎక్కువగానే ఉంటుంది. ఈ **సంస్కరణలు / కార్యక్రమాల విధులను సమీక్షిస్తే ప్రభుత్వం ఎక్కువగా ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఉందనిపిస్తుంది. అంటే అది ప్రజాభిప్రాయం వెంటపడి అభివృద్ధిని నిర్లక్ష్యం చేయలేదు. సమాజంలోని దాదాపు అన్ని వర్గాలను, అన్ని వయస్సుల వారిని, అన్ని నియోజక వర్గాల వారిని దృష్టిలో ఉంచుకునే సంస్కరణలు / కార్యక్రమాలను నిర్వచించారు. ఆవిధంగా చేయడం వల్ల అభివృద్ధికి రాజకీయాలకు మధ్య తేడాను తగ్గించి మంచిరాజకీయాలను నిజమైన అభివృద్ధి వైపు నడిపించింది.**

పెరుగుతున్నప్రజల ఆకాంక్షలతో బేరీజు వేసుకుంటే ఇంత విశాలమైన దేశంలో వృద్ధి లోటు భారీగా ఉండడంవల్ల అనేక అంశాలు, ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి సారించవలసి ఉంటుంది. ఆ కోణంలో చూస్తే ప్రభుత్వం బాగా పనిచేస్తోందనే చెప్పాలి. ఏదేమైనప్పటికీ, సంస్కరణలు లేదా కార్యక్రమాల అమలు విషయంలో వాటిని అడ్డుకునే స్వార్థపరులు సృష్టించే అవరోధాలవల్ల ప్రభుత్వం అనేక సవాళ్ళను ఎదుర్కోవలసి వస్తున్నది.

ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు/ కార్యక్రమాలపై సానుకూల దృక్కోణాన్ని ప్రసరించడానికి మాత్రమే తప్ప వాటి పనితీరుపైగాని, పురోగతిపై గానీ వ్యాఖ్యానించడంగానీ ఈ వ్యాసం ఉద్దేశ్యం కాదు. ఇది ఒక ప్రత్యేకమైన అంశం గనుక దీనిపై మరో సందర్భంలో మరో ప్రత్యేకమైన వ్యాసంలో చర్చించవచ్చు. ■

---

MINISTRY OF FINANCE

## ఎన్.డి.ఏ. ప్రభుత్వ 4 సంవత్సరాల విజయాలు

(ఆర్థికవ్యవహారాల విభాగం–ఆర్థిక మంత్రిత్వశాఖ)

**భారతీయ ఆర్థిక సంస్కరణ – బధతా భారత్ – ఉభరతా భారత్**

### పెద్దనోట్ల రద్దు

1 నవంబర్ 08, 2016న ప్రధాన నరేంద్రమోదీ చారిత్రాత్మక ప్రకటన రూ. 1000/–లు, రూ. 500/–ల నోట్ల రద్దుపై.

2 నల్లధనం, అవినీతి, నకలినోట్ల చలామణీ, ఉగ్ర కార్యకలాపాలకు విధులు, మనీ లాండరింగ్‌ల నిరోధానకి.

3 దీర్ఘకాలంలో మన స్థూల జాతీయా దాయానకి చేయూతనిచ్చి ఆర్థికాభివృద్ధిని మరింత పెంపొందించడానికి.

4 ఆన్‌లైన్ లావాదేవీలకు ఊపునిచ్చి నల్ల ధనానికి షాక్.

5 నగదు రహిత లావాదేవిలను ప్రోత్సాహించేందుకు 50 లక్షల నూతన బ్యాంకు ఖాతాల ప్రారంభం.


6 2015–16 నుండి 2016–17 కి ఆదాయపు పన్ను రిటర్నుల ధాఖలులో 29.17 శాతం వృద్ధి. 2016–17 నుండి 2018–18కి 25.1 శాతం వృద్ధి.

7 ఈ రిటర్నుల దాఖలులో 2016–17 నుండి 2017–18కి 25 శాతం, 2013–14 నుండి 2017–18కి 81 శాతం వృద్ధి.

8 ఆగష్టు 2016 నుండి ఆగష్టు 2017 కాలానికి తక్షణ చెల్లింపుల (IMPS) విధానంలో 59 శాతం పెరుగుదల. 2.24 లక్షల బినామీ కంపెనీల రద్దు. లెక్క చూపని రూ. 29,213 కోట్ల నల్లధనం స్వాధీనం.

9 జనవరి 31, 2017న ఆదాయపు పన్ను విభాగం "ఆపరేషన్ క్లిన్ మనీ"ని ప్రారంభించింది.

10 20,500 ఆదాయపు పన్ను రిటర్నులను పరిశీలిస్తున్నారు. పూర్తి ఆదాయ వివరాలను చూపని 3 లక్షల మందికి నోటిసుల జారీ. వీరిలో 2.1 కోటి మంది తమ రిటర్నుల సవరణ.



www.finmin.nic.in FinMin.india finmin.goi

# 'దొడ్డి' దారి అలవాటు మాన్పిన బహుదొడ్డ కార్యక్రమం

- పరమేశ్వరన్ అయ్యర్



**స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభమయ్యేనాటికి అలవాటుగా బహిర్భూమికి వెళ్ళే భారతీయుల సంఖ్య 55 కోట్లు ఉండేది. అది ఇప్పుడు దాదాపు 20 కోట్లకు తగ్గింది. అక్టోబరు 2, 2014 తరువాత 7 కోట్ల 10 లక్షల ఇళ్ళలో మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. అంటే గ్రామీణ పారిశుద్ధ్యం 39 శాతం నుంచి ఈరోజుకు 83 శాతానికి పెరిగింది. 13 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలు, 382 జిల్లాలు, 3 లక్షల 60 వేల గ్రామాలు బహిరంగ మలవిసర్జన నిషేధ ప్రాంతాలుగా ప్రకటించబడ్డాయి. అంటే అక్టోబర్ 2, 2019 నాటికి స్వచ్ఛభారత్ సాక్షాత్కారానికి మార్గం సుగమం అవుతున్నది.**

ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖమయ జీవితం కొనసాగించాలంటే మౌలికంగా ఉండ వలసినవి-స్వచ్ఛమైన తాగు నీరు, పారిశుద్ధ్య పరిరక్షణ. ఇవి సరిగా లేక ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలమంది చనిపోతున్నారు.గత కొన్ని దశాబ్దాలుగా ఈ దిశగా మనదేశంలో పరిస్థితిని మెరుగుపరచడానికి ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు కృషిచేస్తూనే ఉన్నాయి. దానిలో ప్రధానంగా చెప్పుకోదగినవి-బహిరంగ మలమూత్ర విసర్జనకు స్వస్తి పలకడం, ఋతుక్రమ సమయంలో శుభ్రతపట్ల శ్రద్ధ వహించడం. ఈ క్రమంలో స్వచ్ఛభారత్ పేరిట ప్రస్తుత ప్రభుత్వం భారీఎత్తున చేపట్టిన కార్యక్రమం అద్భుతమైన ఫలితాలనిస్తున్నది. 'బహిరంగ మల విసర్జన' అలవాటును మార్చడానికి ప్రపంచంలోనే అతి పెద్ద ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. దీని లక్ష్యం ఒకటే - 2019కి 'స్వచ్ఛ భారత్'ను సాక్షాత్కరింప చేయడం.

అక్టోబరు 2, 2019న మహాత్మాగాంధీ 150వ జయంతి. ఆ రోజుకు యావద్భారత దేశాన్ని స్వచ్ఛ భారతంగా మార్చాలని ప్రధానమంత్రి 2014 స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఎర్రకోట వేదికనుండి పిలుపు నిచ్చారు. చిరస్మరణీయమైన ఆ పిలుపు అనూహ్యమైన మార్పులకు దారితీస్తున్నది. ఈ కార్యక్రమం ప్రారంభమయ్యేనాటికి అలవాటుగా బహిర్భూమికి వెళ్ళే భారతీయుల సంఖ్య 55కోట్లు ఉండేది. అది ఇప్పుడు దాదాపు 20కోట్లకు తగ్గింది.

21వశతాబ్దపు భారతదేశం అంటే -'ప్రపంచ ఆర్థిక సూపర్‌పవర్' అన్న అంచనాలు అంతటా ఊపందుకుంటున్నవేళ..."బహిరంగ మలమూత్ర విసర్జన..." వంటివి మచ్చుకు కూడా కనిపించకుండా ఉండాలి కదా !అందుకే ప్రధాని సర్వశక్తులూ కూడదీసుకుని ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఎక్కడలేని ప్రాధాన్యతనిచ్చారు.

అక్టోబరు 2, 2014 తరువాత 7కోట్ల10లక్షల ఇళ్ళలో మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. అంటే గ్రామీణ పారిశుద్ధ్యం 39 శాతం నుంచి ఈరోజుకు 83 శాతానికి పెరిగింది. మరోరకంగా చెప్పాలంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన గత 67ఏళ్ళతోపోలిస్తే గత మూడున్నర ఏళ్ళలో పారిశుద్ధ్యం బాగా పెరిగింది. 13 రాష్ట్రాలు(అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, మేఘాలయ, మిజోరం, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, ఉత్తరాఖండ్), నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలు(అండమాన్ నికోబార్ దీవులు, చండీగఢ్, డామన్ డయ్యూ, నాగర్‌హవేలీ), 382 జిల్లాలు, 3లక్షల 60వేల

కార్యదర్శి, కేంద్ర త్రాగునీరు, పారిశుధ్య మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ.
E-mail : param.iyer@gov.in

గ్రామాలు బహిరంగ మలవిసర్జన జరగని ప్రాంతాలుగా ప్రకటించబడ్డాయి. అంటే అక్టోబర్ 2, 2019 నాటికి స్వచ్ఛభారత్ సాక్షాత్కారానికి మార్గం సుగమం అవుతున్నది.

ప్రధానే స్వయంగా పూనుకోవడం, పైస్థాయినుంచి కిందిస్థాయివరకు అధికారులు ఉరుకులు పరుగులుపెట్టడం, వీటికి తోడు ప్రజల్లో స్వచ్ఛ ఉద్యమం రోజురోజుకూ చైతన్యం పుంజుకోవడంవంటి చర్యలతో కేవలం మరుగుదొడ్ల వరకే పరిమితం కాకుండా నివాస పరిసరాల శుభ్రతపైకూడా కేంద్ర మంత్రిత్వశాఖ దృష్టి కేంద్రీకరించింది. ఇదంతా సవ్యంగా జరగాలంటే ప్రభుత్వంవద్ద, ప్రజల అవగాహన కోసం లెక్కలుండాలి. 2012-13లో రాష్ట్ర ప్రభుత్వాలు సేకరించిన మౌలిక సర్వేల ఆధారంగా ఈ సమాచారాన్ని MIS ద్వారా అందుబాటులో ఉంచుతున్నారు.



ఇదిగాక 2017 మే-జూన్ మధ్యకాలంలో భారత్ క్వాలిటీ కౌన్సిల్ (QCI)అనే మూడో పక్షంద్వారా కూడా సర్వే నిర్వహించారు. దేశంలోని అక్కడక్కడా నమూనాకోసం 4626 గ్రామాలను ఎంపికచేసి 1లక్షా 40వేల ఇళ్ళకు సంబంధించి సర్వే నిర్వహిస్తే మరుగుదొడ్ల వాడకం 91.29 శాతంగా ఉన్నట్లు తేలింది.

ఇంకా తాజా సమాచారం ప్రకారం ప్రపంచ బ్యాంకుతోడ్పాటుతో 2017-18కి సంబంధించి జాతీయ వార్షిక గ్రామీణ పారిశుధ్య సర్వే (NARSS) నిర్వహించడం జరిగింది. వీరి సర్వే ఫలితాలు నిపుణుల కమిటీకి నివేదించారు. ఈ కమిటీకి ప్రపంచబ్యాంకు, యూనిసెఫ్, వాటర్ఎయిడ్, బిల్ & మెలిండా గేట్స్ ఫౌండేషన్, ఇండియా సానిటేషన్ కోఅలిషన్, సులభ్ ఇంటర్నేషనల్, నాలెడ్జ్ లింక్స్, నీతిఆయోగ్, కేంద్రమంత్రిత్వశాఖలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. మరుగుదొడ్లవాడకం 93.40% ఉన్నట్లు ఈ కమిటీ గుర్తించింది.

**ఇక్కడ ఒక చిన్న మర్మం ఉంది. వ్యక్తిగత శుభ్రత మాత్రమే కాదు. ఒక గ్రాము మలంలో ఒకకోటి వైరస్ క్రిములుంటాయి. లక్ష బాక్టీరియా సూక్ష్మజీవులుంటాయి. వెయ్యి పరాన్నజీవు లుంటాయి. అంటే ఒక గ్రామం పూర్తిగా బహిరంగ మల విసర్జనను నిషేధించకపోతే వీటిద్వారా అంటురోగాలు వ్యాపిస్తూనే ఉంటాయి. అందువల్ల మొత్తం గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా కృషిచేసి పాత అలవాట్లకు ముగింపు పలకాల్సి ఉంటుంది.**

**యూనిసెఫ్ లెక్కల ప్రకారం బహిరంగ మలవిసర్జన జరగని ఒక్క గ్రామంలోనే ఏటా రు.50 వేలు మందులపై పొదుపవుతుంది.** మరో అధ్యయనం ప్రకారం బహిరంగ మల విసర్జన జరిగే ప్రాంతాలతో పోలిస్తే, జరగని ప్రాంతాల్లో అతిసారం, గిటకబారడంవంటి లక్షణాలు గణనీయంగా తగ్గినట్టు తెలుస్తున్నది.

ఈ కార్యక్రమం మొత్తం ప్రజల భాగస్వామ్యంతోనే జరుగుతున్నది. గ్రామస్థాయిలో జనసభ ఏర్పాటుచేసి బహిర్భూమికి వెళ్ళరాదని తీర్మానం చేస్తారు. అది సరిగ్గా అమలుజరిగేదీ లేనిదీ కనిపెట్టడానికి నిఘా బృందాలు ఏర్పాటుచేస్తారు. దీని ఆధారంగా సమాచారం సేకరించి అందరికీ అందుబాటులో ఉంచుతారు.

మరో ముఖ్యమైన అంశం...ద్రవ, ఘన వ్యర్థాల నిర్వహణ (SLRM). దీనిని సమర్థంగా నిర్వహించడానికి ఎవరికివారే సమీక్షించుకునే ఒక సూచికను (VSI-గ్రామ స్వచ్ఛతా సూచిక) ఏర్పాటు చేసారు. సురక్షితమైన మరుగుదొడ్లు, వాటి వాడకం, ఇంటి పరిసరాల్లో మురికి గుంటలు లేకుండా చూడడం.వీటి సమాచారాన్ని కూడా సేకరిస్తున్నారు. ఏప్రిల్ 2018నాటికి 4 లక్షల మందికిపైగా ఈ సూచికలో సమాచారం నమోదు చేసారు.

**"స్వచ్ఛత, శుభ్రత అనేవి బడ్జెట్ కేటాయింపులతో రావు. ప్రజల అలవాట్లు మారితేనే అది సాధ్యం."** అని 2016నాటి బడ్జెట్ ప్రసంగంలో ప్రధాని ప్రకటించినట్లుగా ఆ దిశగా కార్యక్రమాల అమలును కేంద్రీకరించారు. దీనిలో భాగంగా బహిర్భూమి అలవాటున్న గ్రామాలను గుర్తించడం, వారికి నచ్చచెప్పడం, వారికి మౌలిక సదుపాయాలు సమకూర్చడం, అలాగే అలవాట్లలో మార్పు తీసుకురావడానికి వారు నియమాలను ఉల్లంఘించకుండా ఉండడానికి 'స్వచ్ఛగ్రాహి'లను కూడా నియమించారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా 4లక్షల 30వేలమంది స్వచ్ఛగ్రాహిలు నమోదయి ఉన్నారు. ప్రతి గ్రామానికి కనీసం ఒక స్వచ్ఛగ్రాహి ఉండాలన్నది లక్ష్యం. ఆ లెక్కన మార్చి 2019నాటికి 6.5లక్షలతో ఏకంగా ఒక స్వచ్ఛగ్రాహుల దళమే ఏర్పడుతుంది.

ఏప్రిల్, 2018లో స్ఫూర్తిమంతమైన ఒక కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. 10 ఏప్రిల్, 1917న అంటే నూరేళ్ళ కిందట మహాత్మాగాంధీ చంపారన్ సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించారు. కనీస విద్య, నైపుణ్యాలు,

*తరువాయి 44వ పేజీలో*

విశిష్ట వ్యాసం

# మాతా శిశు రక్షణకు చేయూత

- రాకేశ్ శ్రీవాత్సవ



**దేశంలోని 22 రాష్ట్రాలలో పోలీసు దళాలలో 33 శాతం రిజర్వేషన్‌ను కల్పించడంవల్ల, మహిళా సిబ్బంది సంఖ్య పెరిగి బాధిత మహిళలు ఫిర్యాదు చేయడానికి స్వతంత్రంగా ముందుకొస్తున్నారు. సమాజంలో మహిళలే కాదు, పిల్లలు కూడ అనేక హింసలకు, దౌర్జన్యానికి గురవుతున్నారు. కనుక వారి తరఫున ఎవరైనా ప్రభుత్వం ఏర్పాటుచేసిన "పోస్కో ఈ-బాక్సు" లో వ్రాతపూర్వక ఫిర్యాదును దాఖలు చేయవచ్చు. వినూత్నంగా 60 ప్రధాన రైల్వే స్టేషన్లలో బాలల సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకూ 34 వేల మంది బాలలకు సహాయమందించారు.**

అనాదిగా సమాజంలో మాతా-శిశువులకు చిన్నచూపే ఎదురవుతున్నది. జనాభాలో మూడింట రెండువంతులు ఉన్నప్పటికీ, వారి ప్రాధాన్యాలను విస్మరించి అభివృద్ధి పథంలో పక్కకు నెట్టేశారు. ఇది దీర్ఘకాలం మనజాలదు. ఏ వ్యవస్థ అయినా, తమ స్త్రీలు, పిల్లలను నిర్లక్ష్యంచేసి ప్రగతి సాధించలేదు. వారికి సమాజంలో సముచిత స్థానం ఇవ్వవలసిందే! ఈ లక్ష్యసాధనపట్ల ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో శక్తివంచనలేకుండా కృషిచేస్తున్నది. రక్షణ-భద్రత అనే రెండు అంశాలు రెండూ ఒకదానికొకటి అవినాభావ సంబంధంకలిగి ఉన్నాయి. ఒకటి లేకుండా రెండవదానిని సాధించలేము. అయితే ప్రస్తుత వ్యాసంలో మహిళల, పిల్లల భద్రత గూర్చి చర్చిద్దాం.

**మారుతున్నదృక్పథాలు:**

సానుకూల వాతావరణానికై ముందుగా మనుషుల ఆలోచనా దృక్పథాన్ని మార్చడానికి ప్రయత్నించాలి. ఇందు కోసమే "బేటీ బచావో - బేటీ పఢావో" పథకాన్ని దేశంలోని అన్ని జిల్లాలకూ విస్తరించారు. అవగాహనను పెంచడమే కాదు, గర్భస్రావాలను నియంత్రించడం, ఆడపిల్లలలో అక్షరాస్యతను పెంచడంలో ఈ కార్యక్రమం మారుమూల ప్రాంతాలలో సైతం విజయవంతం అయింది. మొదట్లో ఈ పథకాన్ని ప్రారంభించిన సగం జిల్లాలలో ఆడపిల్లల సంఖ్య పెరిగింది. పాఠశాలల్లో ఆడపిల్లలపట్ల వివక్షతను నిర్మూలించే విధంగా తీసుకున్న చర్యలు సత్ఫలితాలనివ్వసాగాయి. ఇంతవరకూ 150 విశ్వవిద్యాలయాలు, 200 కళాశాలలు ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా అమలుచేస్తున్నాయి.

**మద్దతు సేవలకు ప్రోత్సాహం:**

అధిక శాతం మహిళలు, పిల్లలు, నేరుగా పోలీసులను సంప్రదించడానికి సందేహిస్తారు/ జంకుతారు కనుక, దేశవ్యాప్తంగా 182 ఏక గవాక్ష సేవాకేంద్రాలను నిర్భయనిధి కింద ఏర్పాటుచేశారు. పోలీసు, వైద్య న్యాయ, మానసిక చికిత్స వంటి అనేక సహాయాలు ఈ కేంద్రాలలో లభిస్తాయి. ఈ కేంద్రాలు ఇప్పటివరకు 1.3 లక్షల మంది మహిళలకు సేవలనందించాయి. అంతేకాదు, హింసాత్మక చర్యలుంటే మహిళలు 181 టోల్ ఫ్రీ మహిళా హెల్ప్ లైనుకు సమాచారమందివ్వవచ్చు. ఈ నెంబరుకు ఒకసారి సమాచారమందిస్తే, చాలా వేగంగా స్పందిస్తారు. ఈ హెల్ప్‌లైన్‌ను ఇంత వరకు 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. దీనికితోడు, 1098 బాలల హెల్ప్‌లైన్ ఉండనే ఉన్నది. 22 రాష్ట్రాలలో పోలీసు దళాలలో 33 శాతం రిజర్వేషన్

కార్యదర్శి, కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ.
E-mail : secy.wcd@nic.in

కల్పించడంవల్ల, మహిళా సిబ్బంది సంఖ్య పెరిగి బాధిత మహిళలు ఫిర్యాదు చేయడానికి స్వతంత్రంగా ముందుకొస్తున్నారు. పోలీసు దళాలకు మహిళలతోను, పిల్లలతోనూ, మృదువుగా ప్రవర్తించేందుకు వారికి ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. సమాజంలో మహిళలే కాదు, పిల్లలు కూడ అనేక హింసలకు, దౌర్జన్యానికి గురవుతున్నారు. వారు ఎదుర్కొనే భయంకర హింసను గూర్చి బయటకు చెప్పుకోడానికి కూడ భయపడతారు. కనుక వారి తరపున ఎవరైనా ప్రభుత్వం ఏర్పాటుచేసిన "POSCO e-Box" లో వ్రాతపూర్వక ఫిర్యాదును దాఖలు చేయవచ్చు. దీనిలో కనీస సమాచారమందించినా, పోలీసులు రంగంలోకి దిగుతారు.

**పటిష్టమైన న్యాయ వ్యవస్థ:**

మహిళలు, పిల్లల అక్రమ రవాణా వంటి నేరాలను సత్వరమే అరికట్టడానికి పటిష్టమైన న్యాయ వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఇటీవలే, ప్రభుత్వం మనుషుల అక్రమ రవాణా (నిరోధము, రక్షణ, పునరావాసం) బిల్లు 2018 ని పార్లమెంట్ లో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలలోని లోపాలను సవరిస్తూ, ఒక బలమైన ఆర్థిక, సామాజిక, న్యాయరక్షణను బాధితులకు కల్పించడానికి కొన్ని సంస్థలను ఏర్పాటు చేయ తలపెట్టింది. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ఈ కేంద్రాలు ఉంటాయి. అంటే కాదు, సామాజిక రుగ్మతలైన బాల్య వివాహాలను అరికట్టడానికూడా పటిష్టమైన సిబ్బంది ని, ఏర్పాట్లను చేస్తున్నారు. బాల్య వివాహ చట్టం, 2006 ఇలాంటి వివాహాలను ఎవరైనా ప్రోత్సహించినా, చేసినా, మద్దతిచ్చినా కఠినంగా శిక్షిస్తుంది. ఈ చట్టం పటిష్ట అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా కలెక్టర్ల మద్దతుతో మారుమూల ప్రాంతాలలో సైతం తగిన చర్యలను చేపడుతున్నది. అసలు ఇలాంటి పెళ్లిళ్లు జరిగినా వాటిని చెల్లనివిగా ప్రకటించ డానికి తగిన ఏర్పాట్లను ఈ బిల్లులో పొందు పరిచారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక దాడులను, వేధింపులను నిరోధించడానికి పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల (నిరోధం, పరిష్కారం) చట్టం 2013 కు నూతన రక్తం ఎక్కిస్తున్నారు. ఈ అంశంలో తగిన శిక్షణకు దేశ వ్యాప్తంగా 112 సంస్థలను గుర్తించారు. ప్రచార/ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారమే కాక, ఈ అంశంపై మారుమూలలకు సైతం సమగ్ర అవగాహనకు నూతన జవజీవాలను ఇస్తున్నారు. SHe-Box అనే ఒక పోర్టల్‌ను సులభంగా ఫిర్యాదును నమోదు చేయడానికి అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా, మహిళలకు ఇంట్లోను, బయటా వేధింపులనూ, హింసను నిరోధించడానికై గృహహింస నిరోధక చట్టాన్ని అమలు చేశారు. వరకట్న నిషేధ చట్టం, దేశంలోని అన్ని అద్దె కార్లలోనూ మహిళల అత్యవసర రక్షణకు "పానిక్" మీటను ఏర్పాటు చేయమని, డ్రైవరు వివరాలు స్పష్టంగా కనిపించేటట్లు ప్రదర్శిం చాలనీ ఆదేశించారు. ఈ రక్షణ చర్యలన్నిటిపై తగిన ప్రచారానికి సమాచార మాధ్యమాలను వినియోగించు కుంటున్నారు.

**సృజనాత్మక ఆలోచనలకు ఆర్థిక సహాయం:**

దుర్వినియోగం అవుతున్నదని కొందరు విమర్శిస్తున్నప్పటికీ, రూ. 6,223.79 కోట్ల నిర్భయనిధిని మహిళల రక్షణకు, భద్రతకు అనేక సృజనాత్మక విధానాలను అమలుచేయ డానికి వినియోగిస్తున్నారు. ఉదాహరణకు అన్నీ అద్దె కార్లలో పానిక్ మీటల ఏర్పాటు, అన్నీ చరవాణుల్లో కూడా ప్యానిక్ మీట ఏర్పాటు, వీటిని దగ్గరలో ఉన్న పోలీసు వాహనాలకు అనుసంధానం చేయడం, దీనిద్వారా ఉపగ్రహ సహాయంతో సమస్యాత్మక ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించడం వంటి ఏర్పాట్లకు వినియోగిస్తున్నారు. ఈ సౌకర్యాన్ని ముందుగా ఉత్తర ప్రదేశ్ లో ప్రయోగాత్మకంగా పరీక్షించారు. క్రమంగా దశల వారీగా అన్ని నగరాలలోనూ ఏర్పాటుచేస్తారు. ఎనిమిది ప్రధాన నగరాలలో చిన్న, పెద్ద అన్ని వీధులలోనూ వీధి దీపాలు సరిగ్గా వెలిగేటట్లు చేయడం, ప్రజా రవాణాను మరింత భద్రంగా మార్చడం, తరచుగా పోలీసు వాహనాలు అన్నీ వీధులలోనూ తిరుగుతూ



ఉండేటట్లు ఏర్పాటు చేయడం వంటి పద్ధతులకు నిర్భయ నిధులను ఖర్చు చేస్తున్నారు. ఫోరెన్సిక్ ప్రయోగశాలలను మరింత అధునాతనంగా తీర్చిదిద్దటం, అతి సులభంగా మహిళలకు న్యాయ సహాయం అందేటట్లు చూడటం వంటి పనులకు కూడా ఈ నిధులను వినియోగి స్తున్నారు.

**సమాచార సాంకేతికతను వినియోగించుకోవడం:**

దురదృష్ట వశాత్తూ, సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొద్దీ, మహిళలు, బాలలపై హింసా విధానాలు కూడా బహుముఖం అవుతున్నాయి. ఎంతైనా చట్టాన్ని గౌరవించేవారికన్నా, చట్టాన్ని దుర్వినియోగపరిచేవారే ఎక్కువ కదా! దీనికి దీటుగా స్పందిస్తూ ప్రభుత్వం కూడా తగిన మార్పులకు శ్రీకారం చుట్టింది. విభిన్న సమాచార సాంకేతిక ప్రచార మాధ్యమాలకు విడివిడిగా నియంత్రణా కేంద్రాలను ఏర్పాటు చేయడం, ఈ మాధ్యమాలనుండి బాలల పోర్నోగ్రఫిని సమూలంగా తొలగించడం, మహిళలపై అత్యాచారాలను ప్రోత్సహించే విధంగా ఉన్న పోస్టులను తొలగించి, కారణమైన వారిని శిక్షించడం, సైబర్ నేరాలగురించి ప్రజలకు మరింత అవగాహనను కల్పించడం వంటి చర్యలెన్నిటినో చేపట్టింది. "ఖోయ-పాయ" అనే ఒక వెబ్‌సైట్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. తప్పిపోయిన పిల్లల గురించి ఇక్కడ సమాచారాన్ని పొందవచ్చు లేదా అందించవచ్చు. 2015 నుండి ఈ వెబ్ సైట్ సహాయంతో 10 వేలకు పైగా పిల్లలను వారి తల్లితండ్రుల వద్దకు చేర్చగలిగారు. ఈ వెబ్ సైట్ గురించిన సమాచారాన్ని ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాలలో లోపలి అట్టలపై ముద్రిస్తున్నారు.




**బాధితుల పునరావాసం:**

లైంగిక దాడుల బాధితులకు పునరావాసానికై అనేక చర్యలను ప్రారంభించారు. నిర్భయ నిధి కేంద్రం వాటా నుండి రాష్ట్రాలకు బాధిత మహిళలకు తగిన పరిహారాన్ని అందించడానికి కేటాయింపులు చేస్తున్నారు. ఇలాంటి దారుణాలకు గురైన మహిళల జీవితాలకు శాశ్వతంగా కలిగే నష్టాలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా ఆమ్ల (యాసిడ్) దాడులవంటి వాటిని దృష్టిలో ఉంచుకుని, కేంద్ర మహిళా–శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ వైకల్యం గల వ్యక్తుల హక్కుల చట్టం 2016 ను చేసింది. దీని ప్రకారం ఆమ్ల దాడుల బాధితులు కూడా ఈ చట్టం ద్వారా అన్నీ సౌకర్యాలను ప్రయోజనాలనూ పొందవచ్చు. వినూత్నంగా 60 ప్రధాన రైల్వే స్టేషన్లలో బాలల సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకూ 34 వేల మంది బాలలకు సహాయమందించారు.

**సమగ్ర చర్యలు:**

ప్రభుత్వ సహాయ చర్యలు గ్రామీణ మహిళలకు సైతం చేరడానికి మహిళా శక్తి కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాలు మహిళలకు తమ ఇళ్ల వద్దనే సహాయ మందించడానికి 115 గుర్తించిన బాగా వెనుకబడిన జిల్లాలలో మూడు లక్షల మంది విద్యార్థులను కార్యకర్తలుగా నియమించారు. ఈ కార్యకర్తలు మహిళలకు ప్రభుత్వం వివిధ విభాగలా ద్వారా ఏమేమి సహాయాలను అందచేస్తున్నదీ అవగాహన కల్పిస్తారు. మహిళలు సమాజంలో భద్రంగా ఉంటేనే, వారి మేధా శక్తి యుక్తులను సమాజాభివృద్ధికి వినియోగించగలుగుతారు. దీనికోసం హింసలేని సమాజం అవసరం. ప్రతి మహిళా, బాలుడు/బాలిక తమ ఇంట్లోనూ, బయట కూడా పూర్తి స్వేచ్ఛగా ఉండాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తున్నది. ■

## ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్




**గర్భవతులకు అన్ని పరీక్షలూ, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిగా ఉచితం ప్రతినెలా 9వ తేదిన.**

యుక్తచేతన

### జూన్ 21, అంతర్జాతీయ యోగ దినోత్సవం

# సిద్ధ యోగ

- డాక్టర్ ఆర్.ఎస్.రామస్వామి




**ఇతర వైద్య విధానాలతో పోలిస్తే సిద్ధ వైద్య విధానం శారీరక, మానసిక రుగ్మతలను నయం చేయడం మాత్రమేగాక ఆత్మను పరిశుద్ధం చేసి జన్మరాహిత్యానికి మార్గం చూపుతుంది. వ్యాయామం చేస్తే రక్తనాళాలు, నరాలు, కండరాలు బిగుతుగా మారుతాయి. కానీ, ఆసనాలు వేసే సమయంలో దీనికి భిన్నంగా అవి మెత్తగా, మృదువుగా తయారవుతాయి. పరిమితికి మించి ఇంద్రియ సుఖాలకు లోనుకావడ మన్నది జీవశక్తి అపరిమిత వినియోగానికి దారితీస్తుంది. అందుకే సిద్ధులు తమ పంచేంద్రియాలను నిగ్రహించడం ద్వారా తమ జీవశక్తిని దీర్ఘకాలం పరిరక్షించుకోగలరు.**

"యోగం" అంటే "ఐక్యత" అని అర్థం. పరమాత్మ (విశ్వ చైతన్యం)తో జీవాత్మ (వ్యక్తి చైతన్యం) ఏకం కావడంగానూ దీన్ని పేర్కొన వచ్చు- మానవ జన్మ అంతిమ లక్ష్యం ఇదేనన్న మాట! యోగమనే మాటకు మరొక అర్థం కూడా ఉంది. వ్యక్తి పంచేంద్రియాలను నియంత్రణలో ఉంచుకుంటూ మనస్సును విశ్వచైతన్యంపై లగ్నం చేసి అంతిమ లక్ష్యాన్ని సాధించడంగా కూడా దీన్ని పరిగణించవచ్చు. సిద్ధ వైద్య విధానం ప్రధానంగా తమిళనాడు నుండి మొగ్గ తొడిగింది. ఈ యోగం గురించి సిద్ధుడైన తిరుమూలర్ తన తిరుమంత్రందా్వరా విశదీకరించాడు. సిద్ధ వైద్యంలో భాగమైన యోగంపై తిరుమూలర్ వంటి సిద్ధులు వెలిబుచ్చిన అభిప్రాయాలలో కొన్ని ముఖ్యమైన వాటిని ఈ వ్యాసం ప్రముఖంగా ప్రస్తావిస్తుంది. సిద్ధ వైద్య విధానాన్ని సిద్ధ తిరుమూలర్ తన తిరుమంత్రంలో కిందివిధంగా నిర్వచించారు:

**శారీరక రుగ్మతను నయం చేసే వైద్యం**
**మానసిక రుగ్మతను నయం చేసే వైద్యం**
**రుగ్మతను నివారించే వైద్యం**
**అమరత్వాన్ని ప్రసాదించే వైద్యం**

ఇతర వైద్య విధానాలతో పోలిస్తే సిద్ధ వైద్య విధానం శారీరక, మానసిక రుగ్మతలను నయం చేయడం మాత్రమేగాక ఆత్మను పరిశుద్ధం చేసి జన్మరాహిత్యానికి మార్గం చూపుతుంది. ఈ విధంగా సిద్ధ వైద్యం ఆధ్యాత్మిక ఆరోగ్యానికీ దోహదం చేస్తుందని పైన ఉటంకించిన పద్యంలోని చివరి పాదం స్పష్టం చేస్తోంది. వ్యాధిరహిత జీవనానికి యోగాభ్యాస ప్రాముఖ్యాన్ని తిరుమూలర్ నొక్కిచెప్పారు. తిరుమూలర్ పేర్కొన్న ప్రకారం యోగంలో ఎనిమిది అంగాలున్నాయి. అందుకే దీన్ని 'అష్టాంగ యోగం' అని వ్యవహరిస్తారు.

**అష్టాంగ యోగం:**

''యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి".. వీటినే 'అష్టాంగ యోగం' అంటారు. సిద్ధ వైద్య విధానంలో 'కాయకల్ప (పునరుత్తేజ) చికిత్స' చాలా ముఖ్యమైనది. ఇది 'కల్ప అవిళతం', 'కల్ప యోగం'గా వర్గీకరించ బడింది. 'కల్ప అవిళతం' అంటే నివారణ, చికిత్సలకు వినియోగించే ఔషధాలకు సంబంధించినది కాగా... 'కల్ప యోగం'- శరీరం, మనస్సు, ఆత్మలను ఆరోగ్యంగా ఉంచే యోగా ప్రక్రియ. తిరుమూలర్ ప్రవచించిన ప్రకారం అష్టాంగ యోగంలో మొదటిది 'యమం' 'సమాధి' అంగం చివరిది. మానవ జన్మకు వాస్తవ సార్థకత ఇదేగనుక దీనికి అత్యంత ప్రాముఖ్యం ఉంది.

డైరెక్టర్ జనరల్, కేంద్రీయ సిద్ధ పరిశోధన మండలి (ఆయుష్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం), చెన్నై.
E-mail : dr.rsramaswamy@gmail.com

## యమం:

ఈ యోగాభ్యాసంతో మనసు అరిషడ్వర్గాలనే కల్మషాల నుండి విముక్తమై ఆరోగ్యంగా ఉంటుంది. మనసు ఇలా కల్మష రహితమైనప్పుడు సహజంగానే వ్యాధి రహితంగానూ ఉంటుంది.

## నియమం:

ఈ అభ్యాసం మానవుని దినచర్యను ఆరోగ్యకరంగా మారుస్తుంది. అంటే సూర్యోదయాన నిద్ర లేవటం దగ్గరనుంచి రాత్రి శయనించేదాకా సాగే దైనందిన కార్యకలాపాల్లో క్రమశిక్షణ అలవడుతుంది. వ్యక్తి దినచర్యలో పరిశుద్ధత నిర్వహణనే 'నియమం'గా నిర్వచించవచ్చు. వ్యక్తి దైనందిన కార్యకలాపాల్లో ఆరోగ్యకర వాతావరణాన్ని ఇది ఏర్పరుస్తుంది.

## ఆసనం:

నిర్దిష్ట వ్యవధిపాటు నిర్దేశిత భంగిమలో శరీరాన్ని స్థిరంగా, నిశ్చలంగా ఉంచడమే 'ఆసనం'. సరళంగా చెబితే ఆసనమంటే కేవలం నిర్దిష్ట 'ఆకృతి' లేదా 'భంగిమ'. తిరుమూలర్ పేర్కొన్న ప్రకారం ఇలాంటి భంగిమలు లేదా ఆసనాలు వేలకొలదిగా ఉన్నాయి. ఈ ఆసనాల అభ్యాసంతో అనేక వ్యాధులు నివారించబడి వ్యక్తి జీవనం ఆరోగ్యకరంగా సాగటమేగాక ఇది పునశ్శక్తినిస్తుంది. శక్తిని వెచ్చించే శారీరక వ్యాయామంతో పోలిస్తే ఆసనాభ్యాసంతో శక్తి... ప్రత్యేకించి జీవాకర్షక శక్తిని ప్రోదిచేస్తుంది. బాహ్య శరీర ఆకృతులను, స్వేచ్ఛా కండరాలను బలోపేతం చేయడమేగాక అంతర్గత అవయవాల (ప్రత్యేకించి గుండె, ఊపిరితిత్తులు, ఉదరం, కాలేయం, ప్లీహం, మూత్రపిండాలు, గర్భాశయం)ను కూడా ఉత్తేజపరచి వాటి విధులను నియంత్రిస్తుంది. వివిధ గ్రంథుల స్రావాలను క్రమమబద్ధం చేసి, ఆహారాన్ని జీర్ణం చేయడం, వ్యర్థ పదార్థాలను వెలికి పంపడం, రక్త ప్రసరణను క్రమబద్ధీకరించి, శరీర ఉష్ణోగ్రతను సమతూకంలో ఉంచటం వంటి విధులను నిర్వర్తిస్తుంది. వ్యక్తి జీవితాంతం పనిచేసే వినాళ గ్రంథుల విధులను క్రమబద్ధం



చేస్తుంది. వ్యాధుల నివారణలోనేగాక చికిత్సలోనూ ఆసనం ప్రధాన లేదా అనుబంధ చికిత్సగా ఉపయోగపడుతుందన్నది వాస్తవం. వ్యాయామం చేస్తే రక్తనాళాలు, నరాలు, కండరాలు బిగుతుగా మారుతాయి. కానీ, ఆసనాలు వేసే సమయంలో దీనికి భిన్నంగా అవి మెత్తగా, మృదువుగా తయారవుతాయి.


## ప్రాణాయామం:

వ్యక్తి శ్వాసను నియంత్రించగలిగే యోగాభ్యాసమే 'ప్రాణాయామం.' మన శరీరాన్ని... ప్రత్యేకించి నాడీ వ్యవస్థను శక్తిమంతం చేసే లెక్కలేనన్ని శ్వాస ఆధారిత కసరత్తులను ఇది సూచిస్తుంది. వ్యక్తి శ్వాసను అంచనా ద్వారా నియంత్రించే పద్ధతులే 'ప్రాణాయామం' అని తిరుమూలర్ వివరించారు. మరణానికి అధిదేవుడైన యముడిని ఈ ప్రాణాయామ అభ్యాసం దూరంగా ఉంచుతుంది. ప్రాణాయామ స్వభావరీత్యా నివారణ, చికిత్సాత్మకంగానే గాక పునరుత్తేజితమైనదిగానూ ఉంటుంది. ఇది ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించి శరీర కణాలకు తగినంత ప్రాణవాయువు సరఫరా అయ్యేందుకు దోహద పడుతుంది. దీన్ని 'వసి', 'వసి యోగం' గానూ పిలుస్తారు. ప్రాణాయామంలో పూరక, కుంభక, రేచకాల మధ్య వ్యవధిని 16, 64, 32 మాత్ర (రెప్పపాటు)ల కాలంగా తిరుమూలర్ వివరించారు. పూరక, కుంభక, రేచకాలంటే ఊపిరితిత్తులలోకి గాలి పీల్చడం, నిలిపి ఉంచడం, వదలడం అన్నమాట.

## ప్రత్యాహారం:

నాలుక, కన్ను, చర్మం, చెవి, ముక్కు పంచేంద్రియాలు కాగా, వీటికిగల 'రుచి, దృష్టి, స్పర్శ, వినికిడి, వాసన' జ్ఞానాల నియంత్రణ లేదా నిరోధం గురించి వివరించేదే 'ప్రత్యాహారం.' ఆయా జ్ఞానాలు, అవయవాల మధ్య అనుసంధానమే జ్ఞానేంద్రియాల పని. అంటే ఈ జ్ఞానేంద్రియాలే ఆయా జ్ఞానాలను పసిగట్టే ఉపకరణాలన్న మాట!

సిద్ధ విధానం ప్రకారం మానవుడితోపాటు పంచ (ఐదు) భూతాలు లేదా పంచ మూలకాలతో కూడినదే విశ్వం. అవేమిటంటే... 'భూమి, నీరు, నిప్పు, గాలి, శూన్యం.' ఇక 'చర్మం, నోరు లేదా నాలుక, కన్ను, ముక్కు, చెవి' పంచ జ్ఞానేంద్రియాలు. వీటికిగల జ్ఞానాలే 'రుచి, దృష్టి, స్పర్శ, వినికిడి, వాసన.' ఈ పంచభూతాలు, జ్ఞానాల మధ్య సంబంధం ఇలా ఉంటుంది: రుచి–నీరు; దృష్టి–నిప్పు; స్పర్శ–గాలి; వినికిడి–శూన్యం; వాసన–భూమి. అయితే, మానవుడికి ఆరోదైన 'అతీంద్రియ జ్ఞానం' కూడా ఉంది. తమిళ వ్యాకరణం, సాహిత్యంపై తొట్టతొలి గ్రంథం 'తోల్‌కాపియం'లో దీన్నిగురించి ఇలా రాసి ఉంది:"ఇతర జీవులలో లేని అతీంద్రియ జ్ఞానం కలిగి ఉన్నందున మానవుడు ఇతర ప్రాణికోటికన్నా భిన్నం." తార్కిక బుద్ధిగలిగి ఉన్నందువల్ల విచక్షణను ఉపయోగించుకుంటూ పాపాలకు ఒడిగట్టకుండా క్రమశిక్షణతో కూడిన జీవితం గడపగల శక్తిశీలుడన్న మాట! ఈ శక్తితోనే అతడు మానవ



జన్మకు సార్థక లక్ష్యమైన జన్మరాహిత్యాన్ని సాధించగలడు. ఇక 'తిరుక్కురళ్' పేరిట నీతిసంహిత రచించిన మహానుభావుడు తిరువళ్లువర్ ఏం చెప్పారంటే: "పంచ జ్ఞానాలైన రుచి, దృష్టి, స్పర్శ, వినికిడి, వాసనలను అర్థవంతంగా అన్వయించుకోగల వారివల్లనే ఈ ప్రపంచం నడుస్తోంది" అని పేర్కొన్నారు. ఈ పంచజ్ఞానాల నియంత్రణ, ఉపసంహరణ గురించి సిద్ధుడైన పదిరాక్రియర్ ఇలా చెప్పారు: "అహాన్ని జయించు.. పంచ జ్ఞానాలను దహించు... ఆత్మజ్ఞానం సిద్ధించేదాకా లోతుగా ధ్యానంలో లీనమైపో."!

ప్రత్యక్షానుభవం లేదా ఇంద్రియ జ్ఞానానుభవం అన్నది జీవశక్తి వినియోగం ద్వారానే సాధ్యంగనుక అది సాధారణ పరిమితులకు లోబడే ఉండాలి. పరిమితికి మించి ఇంద్రియ సుఖాలకు లోనుకావడమన్నది జీవశక్తి అపరిమిత వినియోగానికి దారితీస్తుంది. అందుకే సిద్ధులు తమ పంచేంద్రియాలను నిగ్రహించడంద్వారా తమ జీవశక్తిని దీర్ఘకాలం పరిరక్షించుకోగలరు. దీర్ఘాయుష్కులై పవిత్ర దైవిక జ్ఞానాన్ని సులభంగా సముపార్జించు కుని ఇతరులకు సేవ చేయగలరు. ఇంద్రియ నిగ్రహం గురించి తిరువళ్లువర్ ఇలా వివరిస్తారు: "తార్కిక జ్ఞానసహిత విశ్లేషణ ద్వారా పంచ జ్ఞానాలకు మూలమైన పంచేంద్రియాల విధులను నియంత్రించే సమర్థులు ముక్తికి సిద్ధమైన విత్తనం వంటివారు కాగలరు."

**ధారణ:**

మనస్సును స్థిరంగా ఉంచుకోవడం లేదా నిమగ్నం చేయడమే ఈ యోగాభ్యాసంలో ప్రధానం. మనస్సును కేంద్రీకరించడమన్నది ధ్యాన యోగానికి అవసరమైన అంశం.

**ధ్యానం:**

మనసుపై సంపూర్ణ ఆధిపత్యం సాధించే కళగా 'ధ్యాన' యోగాన్ని అభివర్ణించవచ్చు. ఒకే ఒక్కటి మినహా మిగిలిన ఆలోచనలన్నిటినీ వదిలించుకోవడంగానూ దీన్ని నిర్వచించవచ్చు. నిత్యం ఉదయం లేదా సాయంత్రం లేదా రాత్రి వేళలో యోగా నిపుణుల మార్గదర్శకత్వాన మెత్తని వస్త్రంపై లేదా నేలపై సుఖాసనంలో లేదా పద్మాసనంలో కూర్చుని 20 లేదా 30 నిమిషాల పాటు ధ్యానం చేయవచ్చు. ఈ యోగాభ్యాసంతో వివిధ రుగ్మతలను... ప్రత్యేకించి ఒత్తిడివల్ల కలిగే వ్యాధులను నిరోధించవచ్చు లేదా నయం చేయనూవచ్చు. ఉదయాన్నే ధ్యానం చేయడంవల్ల రోజంతా మనసు ఉల్లాసంగా ఉంటుంది... నిద్రలేమి లేదా తరచూ నిద్రాభంగం నుంచి విముక్తి లభించి సుఖనిద్ర వరిస్తుంది... ఎలాంటి సమస్యలనైనా సాహసంతో ఎదుర్కొని, సమర్థంగా పరిష్కరించుకోగల మానసిక ధైర్యం పెరుగుతుంది. **ధ్యానానికి అన్ని సమయాలూ అనువైనవే అయినా ప్రాత:కాలాన (బ్రహ్మ ముహూర్తం), సూర్యాస్తమయ సమయాన చేయడం అత్యుత్తమం, అనంత లబ్ధిదాయ కంగా యోగా నిపుణులు పేర్కొంటారు. అలాగే తూర్పు లేదా ఉత్తరాభిముఖంగా మెత్తని వస్త్రంపై కూర్చుని ధ్యానం చేయడం మంచిదని సూచిస్తున్నారు.**


**సమాధి:**

**యోగంలో చివరి దశ సమాధి. 'సమం + అధి' అంటే... దైవ సమానస్థితిని సాధించడమన్నమాట!** దీన్ని 'పతి, పశు, పాశ' సంబంధ తాత్త్వికతతో విశ్లేషిస్తే... 'పశు'- జీవాత్మ (వ్యక్తి చైతన్యం) భౌతిక బంధమైన 'పాశం' నుంచి స్వీయ విముక్తమై 'పతి'- పరమాత్మ (విశ్వ చైతన్యం)తో సంలీనమైపోవడంగా పేర్కొనవచ్చు. **'సమాధి' స్థితిని నిరామయ స్వీయ-ధ్యానం గానూ పరిగణించవచ్చు. అంటే పంచేంద్రియ, పంచ జ్ఞానసహిత శరీరంలోనే ఆత్మ తనదైన స్వతంత్ర, ఆకాంక్ష రహిత స్థితిలో ఉండటం గానూ చెప్పవచ్చు.** తనను, పరిసరాలను మరచి శూన్యస్థితిలో లీనమైన అత్యున్నత దశగా దీన్ని పేర్కొనవచ్చు. భావాలు, చైతన్యం నుంచి విముక్తి పొందిన ఇలాంటి స్థితే 'సమాధి'.

**రాజయోగం:**

రాజయోగం గురించి కూడా సిద్ధులు వివరించారు. మూలాధార చక్రం నుంచి కుండలినీ శక్తిని శిరస్సుదాకా ఉద్దీపింపజేసి శాశ్వత పరమానంద స్థితిని సాధించడాన్నే రాజయోగ అంతిమ లక్ష్యంగా వారు పేర్కొన్నారు.

**ఉపసంహారం:**



ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడంద్వారా తనదైన ఆధ్యాత్మిక విజ్ఞానమైన 'యోగ'ను ప్రపంచం ముంగిటకు చేర్చడం భారత దేశానికి ఎంతో గర్వకారణం. అంతర్గతంగా, బహిర్గతంగా శాంతి సామరస్యాలను కొనసాగించడానికి ఇదెంతగానో దోహదపడుతోందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు!

■

# నూతన సాంకేతిక పరిణామాలు - యువతకు ఉపాధి కల్పన

- జతిందర్ సింగ్



**యువతను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణిస్తోంది. వీరిని "నాట్ ఇన్ ఎంప్లాయ్‌మెంట్, ఎడ్యుకేషన్ ఆర్ ట్రెయినింగ్" (నీట్) పేరిట పేర్కొంటూ వీరందరిలో నైపుణ్యం కల్గించేలా పలు కార్యక్రమాలతో ముందుకు వచ్చింది. ఇప్పటికే దేశంలోని పట్టణ ప్రాంతాలలో ఐటీఐల ద్వారా పొందిన సర్టిఫికెట్లకు దేశీయంగానే డిమాండ్ ఉంది. కానీ ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా శిక్షణ పొందే యువతకు ప్రభుత్వం తరపున సర్టిఫికేట్లు ఇవ్వనున్నారు. ఈ సర్టిఫికేట్లు మన దేశ యువతకు ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉంటాయి.**

నూతన సాంకేతిక ఆవిష్కరణలు మానవ జీవితాన్ని ఎంతో సరళతరం చేస్తున్నాయి. ముఖ్యంగా డేటా ఎనలిటిక్స్, అలాగే నూతన అంకుర పరిశ్రమలు అటు పెద్ద ఎత్తున ఉపాధి కల్పనతో పాటు పలు కార్యకలాపాలను సైతం ప్రభావితం చేస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో ఈ నూతన సాంకేతిక పరిణామాన్ని అందిపుచ్చు కోవడానికి యువతను కార్యోన్ముఖులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా మనదేశంలోని యువ శక్తిని పూర్తిగా వినియోగించుకుంటేనే దేశ పురోభివృద్ధికి దోహదపడుతుంది. ప్రస్తుత మనదేశ జనాభా 134 కోట్లనుంచి 2030 నాటికి 150 కోట్లకు పెరిగే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక స్పష్టం చేసింది. స్వాతంత్ర్యం సాధించిన తొలి దశాబ్దాలలో ఆకలి దప్పులు లేని సమాజమే లక్ష్యంగా ఉండేది. దుస్తులు, వసతి సౌకర్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపట్టాల్సి వచ్చింది. హరిత విప్లవం నాందిగా అధిక ఆహారోత్పత్తి సాధించ గలిగాము. అయితే ప్రస్తుతం సాంకేతిక విప్లవం వినియోగించుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందింపచేసు కోవాలని మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో వుంది.

ప్రపంచంలో ఎక్కువ మంది యువత జనాభా గల దేశం మన భారత దేశం. మన దేశంలో ఉన్న యువకుల శాతం మరే ఇతర దేశంలోనూ లేదు. 2030 కల్లా భారతీయుల సగటు వయసు కేవలం 31 ఏళ్లుగా ఉంటుందని అంచనా. పనిచేయగల సామర్థ్యమున్న మానవ వనరులు భారీగా పెరగనున్న నేపథ్యంలో.. వారిలో నైపుణ్యాలు పెంచడం, అందరికీ ఉపాధి కల్పించడం మనదేశానికి సవాళ్లుగా మారనున్నాయి.

అత్యధిక జనాభా ఉన్నప్పటికీ దేశాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలలో నిరుద్యోగం ఒకటి. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండో దేశంగా పేరుగాంచిన భారత దేశ జనాభాలో సింహ భాగం యువతే. కాని సరైన ఉపాధి లేని కారణంగా దేశానికి వారిసేవలు నిరుపయోగంగా మారిపోయాయి. ఈ పరిస్థితి నుండి దేశ యువతను తప్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఇతోధికంగా తోడ్పడుతోంది. ప్రస్తుతం దేశంలోని జనాభా సగటు వయస్సు 29గా ఉంది. దేశంలోని దక్షిణాది రాష్ట్రాల్లో 29-31 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నటువంటి యువత అత్యధిక సంఖ్యలో ఉండగా, అదే అతి పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్‌లలో మాత్రం 20-22 వయస్సు మధ్యలో గల యువత జనాభాలో అధిక శాతంగా కలిగి

డైరెక్టర్, పంజాబ్ హర్యానా ఢిల్లీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ, న్యూఢిల్లీ.
E-mail : jatinder@phdcci.in

ఉంది. అయితే వీరిందరిని ఎంత మేర ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాము అనేది సవాలుగా పరిణమించనుంది.

2017లో నిర్వహించిన ఓఈసీడీ ఎకనామిక్ సర్వేలో పలు ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. **15-29 ఏళ్ల మధ్య వయస్కులు 30 శాతానికి పైగా ఇటు ఉద్యోగం లేదా అటు చదువు లేక ఖాళీగా ఉన్నారని ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) నివేదిక తెలిపింది.** పైన చెప్పిన వయస్సు మధ్య ఉన్న యువతలో ముప్పై శాతానికి పైగా ఉద్యోగం, చదువే కాదు.. ఏ శిక్షణలోను లేరని ఆ సర్వే తెలిపింది. వీరిని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణిస్తోంది. వీరిని "నాట్ ఇన్ ఎంప్లాయ్ మెంట్, ఎడ్యుకేషన్ ఆర్ ట్రెయినింగ్'' (నీట్) పేరిట పేర్కొంటూ వీరందరిలో నైపుణ్యం కల్గించేలా పలు కార్యక్రమాలతో ముందుకు వచ్చింది. వీటిలో ప్రధానంగా నేషనల్ పాలసీ ఫర్ స్కిల్ డెవలప్ మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్ వంటి కార్యక్రమాలతో ముందుకు వచ్చింది. అలాగే నేషనల్ అప్రెంటిస్ ప్రమోషన్ స్కీం, కనీస వేతన చట్టం, అలాగే ఇతర ఆర్థిక చేయూత పథకాలతో కేంద్రం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించనుంది.

## యువత నైపుణ్యతే అభివృద్ధికి తారకమంత్రం...

మానవ వనరులకు విశ్వ రాజధానిగా భారత దేశాన్ని నిలపాలని దృఢ సంకల్పంతో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. నైపుణ్య భారత్ (స్కిల్ ఇండియా) ద్వారా పేదరికం, నిరుద్యోగాలను దేశం నుండి పారదోలడమే లక్ష్యాలుగా కార్యాచరణను రూపొందించారు. ఈ కార్య క్రమం కింద 2022 నాటికి దేశంలోని 40 కోట్ల మందికి నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇంతకాలం దేశీయంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలైన ఐటీఐల ద్వార యువత నేర్చుకున్న నైపుణ్యాలకు ఈ కార్యక్రమం ద్వారా మరింత పదును పెట్టే అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటికే దేశంలోని పట్టణ ప్రాంతాలలో ఐటీఐల ద్వారా పొందిన సర్టిఫికెట్లకు దేశీయంగానే డిమాండ్ ఉంది. కానీ ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా శిక్షణ పొందే యువతకు ప్రభుత్వం తరపున సర్టిఫికేట్లు ఇవ్వనున్నారు. ఈ సర్టిఫికేట్లు మన దేశ యువతకు ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉంటాయి. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వనటి కార్యక్రమాల ద్వార దేశంలోకి పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపన జరగబోతోంది. పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి లభించే అవకాశం ఉంది. కాని పరిశ్రమల స్థాపనకు అవసరమైన సిబ్బందికి నైపుణ్యాల కొరత ప్రధానంగా వేధిస్తోంది. ఈ స్కిల్ ఇండియా కార్యక్రమం ద్వార దేశ ప్రజలకు నైపుణ్యాలు గనుక నేర్పించ గలిగితే దేశంలో పెట్టుబడులు పెట్టడానికి విదేశీ కంపెనీలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. దీంతో భారత్‌లో తయారీ కార్యక్రమం ద్వారా అందుతున్న సాయంతో దేశం అభివృద్ధిపథాన వెలుగొందే అవకాశం ఉంది.



## యువతకు ఉపాధి కల్పించేందుకు కేంద్రం అందిస్తున్న కొన్ని పథకాలు..

### ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన:

నైపుణ్య భారత్ స్థాపన లక్ష్యంగా ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పని చేస్తుంది దీని ద్వారా నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక, వృత్తివిద్యలో మెళకువలపై యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది క్షేత్ర స్థాయిలో నైపుణ్యం గల కార్మికశక్తి సృష్టి లక్ష్యంగా ఈ పథకం పని చేస్తుంది.

### దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన :

దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన (డీఏవై) పథకాన్నే ఎన్‌యూఎల్‌ఎంగా పిలుస్తున్నారు. పట్టణప్రాంతాల్లో పేదరికాన్ని తగ్గించేందుకు ఈ పథకం ప్రధానంగా ఉద్దేశించినది. ప్రస్తుతం ఈ పథకం 790 పట్టణాల్లో అమలవుతున్నది. పట్టణాల్లోని పేదలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధితో జీవించేలా ఈ పథకం కింద చర్యలు తీసుకొంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో నివాసాలు లేని పేదలకు ఇంటి వసతిని కల్పించటం, వీధులవెంట చిరు వ్యాపారాలు చేసే పేదలకు రుణ సదుపాయాలు కల్పించటం, మార్కెట్ అవకాశాలను కల్పించే చర్యలు చేపడుతున్నారు.

### డైరక్టర్ జనరల్ ఆఫ్ ట్రెయినింగ్ - మాడ్యులర్ ఎంప్లాయబుల్ స్కిల్స్ :

స్కూల్ డ్రాపౌట్లు, అలాగే నైపుణ్యం లేని అసంఘటిత రంగ కార్మికుల నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ఒకేషనల్ ట్రెయినింగ్ ఇవ్వడం ద్వారా పలు వృత్తి నైపుణ్య ఆధారిత పనుల్లో వీరు ఉపాధి పొందే అవకాశం ఉంది.

### దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన :

ఈ యోజన క్రింద, కేంద్ర గ్రామీణాభి వృద్ధి మంత్రిత్వ శాఖ గ్రామీణ భారతదేశంలో ముఖ్యంగా నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణాకేంద్రాలు ప్రారంభించనుంది. 10 లక్షల గ్రామీణ యువతకు ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వాలనేది ఈ యోజన లక్ష్యం. ఈ యోజనలో, ప్రవేశానికి ఉన్న18 సంవత్సరాల కనీస వయస్సును 15 సంవత్సరాలకు తగ్గించారు. గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరిం చేందుకు పలు నైపుణ్యాభివృద్ధి శిక్షణాకేంద్రాలు ఈ పథకం కింద ప్రారంభం కానున్నాయి.



**నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్:**

నైపుణ్య అభివృద్ధి మరియు పారిశ్రామిక మంత్రిత్వ శాఖ జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థను ప్రారంభించింది. నైపుణ్య శిక్షణ కార్యకలాపాల పరంగా వివిధ రంగాలను మరియు రాష్ట్రాలను కలపడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. నైపుణ్య ప్రయత్నాలను ఏకీకృతం మరియు సమన్వయం చేయటమే కాకుండా అన్ని రంగాల్లో ప్రమాణాలతో నైపుణ్యాలను వేగవంతం చేయటం దీని లక్ష్యం.

**నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ :**

2022 నాటికి యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం కేంద్ర మంత్రిత్వశాఖ అయిన స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంట్రప్రెన్యూర్‌షిప్ అలాగే పలు ప్రైవేటు సంస్థలు కలిసి ఈ ఏజెన్సీని ఏర్పాటు చేసింది. ముఖ్యంగా నైపుణ్యాభివృద్ధి కోసం యువతకు ఉపాధి శిక్షణా కేంద్రాలను పీపీపీ పద్ధతిన ఏర్పాటు చేస్తారు.

**ఆజీవిక – నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ (ఎన్ఆర్ఎల్ఎమ్) :**

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యం లో అజీవిక పథకాన్నీ ప్రవేశపెట్టారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించనున్నారు.

**అటల్ ఇన్నోవేషన్ మిషన్ :**

విద్యార్థుల్లో ఉన్న భయాన్ని దూరం చేసి పాఠశాల స్థాయిలోనే వారికి పరిశోధనల వైపు అడుగులు వేయించడానికి కేంద్ర ప్రభుత్వం నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం)రూపొందించింది. అలాగే ఈ పథకం కింద అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) పేరిట దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్స్ ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు




**స్టార్టప్ ఇండియా :**

దేశంలో స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ప్రధాని నరేంద్ర మోడీ స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతనతరం పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు. స్టార్టప్ ఇండియా కింద ప్రారంభమైన స్టార్టప్ కంపెనీలకు మూడేళ్ల పాటు పన్ను విరామం అలాగే రూ. 10,000 కోట్లతో మూలనిధి ఏర్పాటు చేశారు. తొమ్మిది రకాల కార్మిక, పర్యావరణ చట్టాల పరంగా వేధింపులు లేని రీతిలో స్వీయ ధ్రువీకరణ సరిపోయేలా సవరణలు సైతం చేశారు.

**నాలుగో పారిశ్రామిక విప్లవం – ఉపాధి అవకాశాలు**

యావత్ ప్రపంచం సరికొత్త టెక్నాలజీ యుగంలోకి ప్రవేశించింది. కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ల విప్లవం తర్వాత ఇప్పుడు కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతూ వినియోగంలోకి వస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా యంత్ర పరికరాల ఉత్పాదన తొలి పారిశ్రామిక విప్లవానికి నాంది కాగా.. విద్యుదుత్పత్తి, వినియోగం రెండో పారిశ్రామిక విప్లవానికి దారి తీసింది. ఆపై 20వ శతాబ్దం మధ్యకాలం నుంచి కంప్యూటర్లు, ఇంటర్నెట్, డిజిటల్ టెక్నాలజీలు మూడో విప్లవానికి కారణమయ్యాయి. ప్రస్తుతం సరికొత్త టెక్నాలజీలు నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని ఆవిష్కరించాయి. రోబోటిక్స్, బిగ్ డేటా అండ్ అనలిటిక్స్, కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) తదితర న్యూ టెక్నాలజీల అభివృద్ధి, వినియోగం ద్వారా ఆర్థికాభివృద్ధితో పాటు సామాజిక ప్రగతి సాధ్యమవుతోంది. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ రకమైన టెక్నాలజీలను అభివృద్ధి చేసి, వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ప్రపంచ జీడీపీలో తమ వాటాలను వేగంగా పెంచుకునేందుకు అవకాశముంది.

**అత్యాధునిక సాంకేతిక పరిణామాలకు మూల స్తంభాలుగా తొమ్మిదింటిని చెప్పవచ్చు:**

1. బిగ్ డేటా 2. అటానమస్ రోబోట్స్ 3. సిమ్యులేషన్ 4. యూనివర్సల్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ 5. ఇండస్ట్రియల్ ఐఓటీ 6. సైబర్ సెక్యూరిటీ 7. క్లౌడ్ కంప్యూటింగ్ 8. 3డీ ప్రింటింగ్ 9. ఆగ్‌మెంటెడ్ రియాలిటీ. ఫలితంగా వచ్చే విప్లవాత్మక మార్పుల్లో ఆటోమేటెడ్ ప్రొడక్షన్, ప్రిడెక్టివ్ మెయిన్‌టెనెన్స్, కనెక్టెడ్ మెషిన్స్, 3డీ ప్రింటింగ్, స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్, నెట్‌వర్క్‌డ్ సప్లై చైన్



మొదలైనవి ఉన్నాయి. వస్తువుల నాణ్యత పెంచి, ప్రపంచ వినియోగదారుల అవసరాలను తీర్చగలగడం ఇండస్ట్రీ 4.0 విశిష్ట ఉపయోగాల్లో ఒకటి. ఇంకా.. వేతన భారం తగ్గడం, ఉత్పాద కత పెంపు, వస్తూత్పత్తి సామర్థ్యం పెంపుదల, నెట్‌వర్క్ ద్వారా పరిశ్రమల కార్యకలాపాలను ఎక్కడినుంచైనా నియంత్రించడం మొదలైన ప్రయోజనాలూ ఉన్నాయి. రోబోటిక్స్ రంగంలో పెట్టుబడులు, మానవ వనరుల నైపుణ్యాలను పెంచడం ద్వారా కృత్రిమ మేధ, ఐవోటీ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అభివృద్ధితో భారత్ పూర్తిస్థాయి డిజిటల్ దేశంగా అవతరించేందుకు అవకాశముంది.

మెషినరీ, ప్రింటింగ్, ఎలక్ట్రానిక్స్, ఆప్టిక్స్, డేటా ప్రాసెసింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఆటోమోటివ్, రబ్బర్, ప్లాస్టిక్ పరిశ్రమలు, ఫర్నిచర్, పేపర్ ఇండస్ట్రీ, గ్లాస్, సెరామిక్స్, స్టోన్స్, బిల్డింగ్ మెటీరియల్స్, టెక్స్‌టైల్, ఫార్మా, కెమికల్ మొదలైన పరిశ్రమలన్నీ నాలుగో పారిశ్రామిక విప్లవం వల్ల ప్రభావితమవు తున్నాయి.

**ముగింపు :**

సాంకేతిక రంగంలో వస్తున్న పెను మార్పులను గుర్తించి భారత్ సైతం నూతన టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలి. అయితే దీనికోసం ఆయా రంగాల్లో నిపుణులైన మానవ వనరులను అభివృద్ధిలోకి తీసుకురావాలి. దేశంలోని ప్రాథమిక విద్యను సమూలంగా మారిస్తే తప్ప.. తక్కువ సమయంలో ఆయా రంగాల్లో అంతర్జాతీయ స్థాయి పోటీని తట్టుకొని..వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలను అందిపుచ్చుకోలేం! ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకురావాలి. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్‌ను మరింత వేగంగా విస్తరించాలి. స్త్రీలలో డిజిటల్ అక్షరాస్యతను పెంచే కార్య క్రమాలను రాష్ట్రస్థాయిలో అమలుచేయాలి. కేరళ ప్రభుత్వం అమలు చేసిన అక్షయ తరహా కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు సైతం అమలుచేయాలి. హైస్కూల్ విద్యలో రొబోటిక్స్‌ను ముఖ్యాంశంగా చేర్చాలి. కేవలం బోధనకే పరిమితం కాకుండా రొబోటిక్స్ యంత్రాల రూపకల్పనలో సాంకేతికత శిక్షణపై దృష్టిపెట్టాలి. ఈ దిశగా విద్యాభ్యాసంలో 3డీ, మల్టీమీడియా విధానాన్ని దేశవ్యాప్తంగా అమలుచేయాలి. ఒకేషనల్ విద్యలో మెకానికల్ విద్యతోపాటు రొబోటిక్ విద్యను పెంపొందించాలి.

రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు ఐటీ వంటి అంశాల్లో వేగవంతమైన ప్రగతికి.. పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించాలి. ఉన్నత విద్యను అభ్యసించేవారికి విదేశీ శిక్షణ అందించాలి. దేశీయ, విదేశీ పెట్టుబడులను ఈ రంగాల్లో ప్రోత్సహించాలి. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు ఇప్పుడిప్పుడే నూతన పారిశ్రామిక విప్లవం వైపు అడుగులేస్తున్నాయి. కాబట్టి మనదేశం కూడా మానవ, సాంకేతిక వనరులను త్వరితగతిన అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే భారత్ ఈ నూతన పారిశ్రామిక విప్లవ ఫలాలను అందుకోగలదు.

■


## గమనిక:

యోజన పత్రిక యాజమాన్యం వీలైనంతవరకు సంచికను సకాలంలో పాఠకులకు అందచేయాలని కృషిచేస్తుంది. అయితే, అనేక కారణాలవల్ల, చందా కట్టిన వెంటనే పాఠకులకు పత్రికను పంపటం వీలుకాదు. చందావివరాలు మాకు చేరాలి, ఆ సమయానికి సంచిక అందుబాటులో ఉండాలి. ఈ కారణాలవల్ల ఆన్‌లైన్ చందాదారులకు ఒక్కొక్కసారి చందా కట్టిన 15, 20 రోజుల తరువాతనే సంచికను పంపటం వీలవుతుంది. యోజన తెలుగు పత్రికకు 20వ తేదీ తరువాత అందిన చందాలకు, ఆ తరువాత నెలనుండే సంచికను పంపడం వీలవుతుంది. పత్రికను ఎప్పుడూ, సాధారణ పోస్టు ద్వారానే పంపుతాము. దీనికి రికార్డేమీ ఉండదు. ఒకవేళ ఎవరికైనా పత్రిక అందకపోతే, బదులుగా మరో సంచికను పంపడం లేదా చందాను సర్దుబాటు చేయడం వీలుకాదు. చందాదారులే తమ చిరునామా సరిచూసుకోవడం, స్థానిక పోస్టుమ్యాన్‌తో మాట్లాడటం చేయాలి. గమనించగలరు.

**– సీనియర్ సంపాదకుడు**

# భారత్‌లో పన్ను సంస్కరణలు-సంక్షిప్త చరిత్ర

- టి.ఎన్. అశోక్




**చాలా మంది పన్ను నిపుణులు జిఎస్‌టి, డిటిసిలను ప్రభుత్వం చేపట్టిన అతి పెద్ద పన్ను సంస్కరణలుగా వర్గీకరించారు. దేశీయ, విదేశీ మదుపరులు, ప్రజలు పన్ను చెల్లింపులకు కట్టుబడేలా చేయడం లక్ష్యంగా పన్ను వ్యవస్థను సరళీకృతం చేయడానికి ఈ మార్పులు భరోసాగా నిలిచాయి. అయితే దేశంలోని పన్నుల వ్యవస్థను సరళీకృతం చేయడం, పన్ను చెల్లింపుదారుల పరిధిని విస్తరించడం, పన్ను చెల్లింపులకు ప్రజలు అధికంగా కట్టుబడేలా చేయడం ద్వారా ద్రవ్యలోటు తగ్గింపుపై దీర్ఘకాలిక ప్రభావం ఉండేలా చేసేందుకు డిటిసి, జిఎస్‌టిలు చాలా దూరం ప్రయాణించాల్సి ఉన్నదని పన్ను నిపుణులు చెబుతున్నారు.**

అభివృద్ధి పథంలో పురోగమిస్తున్న ఏ ఆర్థిక వ్యవస్థకైనా దేశ, విదేశీ పెట్టుబడిదారుల నుంచి భారీ పరిమాణంలో పెట్టుబడులు అవసరం. న్యాయబద్ధమైన, సరళమైన, పారదర్శకమైన, వివక్షారహిత పన్ను విధానాలుంటేనే తప్పితే పెట్టుబడులు రావడం సాధ్యం కాదు. ఇలాంటి విధానాలే దేశవిదేశీ ఇన్వెస్టర్లు తమ వద్ద ఉన్న సొమ్ము ఉత్పాదక కార్యకలాపాల్లో పెట్టుబడులు పెట్టేందుకు స్ఫూర్తిని కలిగిస్తాయి. ప్రపంచంలోని దేశాలన్నీ ఈ అవసరాన్ని గుర్తించాయి. పలు అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు ప్రత్యేకించి అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు ఎంతో ప్రగతిశీలకమైన పన్ను విధానాలు రూపొందించాయి. ఇందుకు భారత్ ఏ విధంగానూ అతీతం కాదు. అధికారంలోకి వస్తున్న ప్రతీ ఒక్క ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి పన్ను వ్యవస్థలను హేతుబద్ధం చేసి, పన్ను చెల్లింపుదారుల పరిధిని పెంచే సంస్కరణలు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి.

ఒకప్పుడు ఎంతో సంకుచితంగాను, సంక్లిష్టంగాను, జప్తులకే ప్రాధాన్యం గలవిగాను ఉన్న భారత పన్ను విధానాలు కాలం గడుస్తున్న కొద్ది అత్యంత సమర్థవంతమైన విధానాలుగా రూపాంతరం చెందాయని భారత పన్ను వ్యవస్థపై అధ్యయనం చేసి రూపొందించిన పలు పరిశోధన పత్రాలు సూచిస్తున్నాయి. పన్ను సంస్కరణల దిశ, వాటి రూపకల్పనలో ఇస్తున్న ప్రాధాన్యతాంశాల కారణంగా సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ వ్యాపారాలపై ఆర్జిస్తున్న సొమ్ము దారి మళ్లింపులు తగ్గి ప్రభుత్వానికి పన్ను రాబడులు పెరుగుతున్నాయి.

దేశీయ పన్ను వ్యవస్థలో తొలి ప్రధాన సంస్కరణ రాష్ట్రాల స్థాయిలో అమ్మకపు పన్ను స్థానంలో వ్యాట్ అమలు. ఈ మార్పు పన్ను వ్యవస్థకు ఎన్నో ప్రయోజనాలు సమకూర్చింది. ఈ వ్యాసంలో మేం ప్రధానంగా ప్రస్తుతం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గోవింద మరపల్లి రావు వంటి నిపుణులు అధ్యయనం చేసి రూపొందించిన పత్రాల్లోని అంశాలను ప్రధానంగా, విస్తృతంగా ఉదహరిస్తున్నాం. పబ్లిక్ ఫైనాన్స్, పబ్లిక్ ఎకనామిక్స్, మాక్రో ఎకనామిక్స్‌పై ఆయన ఎంతో పరిశోధన చేశారు. భారత ప్రభుత్వ ఆర్థిక వనరులపై ఆయన ప్రస్తుతం "బుక్ ఆన్ ఇండియన్ పబ్లిక్ ఫైనాన్స్" పేరిట ఒక పుస్తకం రాస్తున్నారు.

దేశంలో చిత్తశుద్ధితో సరైన దిశలోనే పన్ను సంస్కరణలకు రూపకల్పన జరుగుతున్నప్పటికీ పన్ను వ్యవస్థను మరింత విస్తృతం, ఉత్పాదకం, సమర్థవంతం చేసేందుకు

కార్యనిర్వాహక నిర్దేశకుడు, "కార్పొరేట్ టైకూన్స్" మరియు "ఫ్లాగ్‌పోస్ట్" న్యూఢిల్లీ
E-mail : feedback@ashoktnex@gmail.com

చేయాల్సింది ఎంతో ఉన్నదని పన్ను రంగానికి చెందిన విశ్లేషకులు చెబుతున్నారు. కార్పొరేట్ పన్ను, ఎక్సైజు, కస్టమ్స్, అమ్మకం పన్నులతో పోల్చితే డీజిల్, పెట్రోల్‌పై రాబడులు అధికంగా ఉంటున్నాయి. వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిధి ఇప్పటికీ సంకుచితంగానే ఉంది. అమ్మకపు పన్ను వ్యవస్థలో సంస్కరణలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. గమ్యం ఆధారిత రిటైల్ వ్యాట్ వ్యవస్థ రూపొందడానికి చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఇప్పటికే అమలులోకి తెచ్చిన పన్ను సంస్కరణలు అందిస్తున్న ప్రోత్సాహకమైన రాబడులు భవిష్యత్ సంస్కరణల రూపకల్పనకు అవసరమైన స్వేచ్ఛను అందుబాటులోకి తెచ్చాయి. కాని 1990 దశకం ప్రారంభంలో భారత ప్రభుత్వం దేశీయ, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలే ఈ మార్పులన్నింటికీ నాంది పలికాయంటే అతిశయోక్తి కాదు.

### 1991 ఆర్థిక సంస్కరణల దశ నుంచి పన్ను విధానాలు


కేంద్రప్రభుత్వ పన్నుల వ్యవస్థలో 1991 సంవత్సరం ముందు నాటి పరిస్థితితో ప్రస్తుత పన్ను విధానాలను సరిపోల్చినట్టయితే అంతర్జాతీయ ధోరణులకు అనుగుణంగా ఆదాయపు పన్ను, ఎక్సైజు, వాణిజ్య సుంకాలను ప్రభుత్వం గణనీయంగా తగ్గించినట్టు అవగత మవుతుంది. అదే సమయంలో రాష్ట్రాలు కూడా తమ అమ్మకపు పన్ను రేట్లను హేతుబద్ధం చేయడానికి కృషి చేశాయి. 2005 ఏప్రిల్ 1 నుంచి విలువ ఆధారిత పన్ను (వ్యాట్) అమలులోకి తెచ్చాయి. 1950లో భారత రిపబ్లిక్ ఏర్పాటైన నాటి నుంచి రాష్ట్రాల స్థాయిలో అమలు జరిపిన అత్యంత ప్రధానమైన పన్ను సంస్కరణ ఇదే.

1991 సంవత్సరానికి ముందు భారతదేశంలో స్థూల పన్ను వ్యవస్థ అత్యంత అసమర్థంగాను, అసమానంగాను ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చితే దేశంలో ఆదాయపు పన్ను రేట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. 1980 దశకం మధ్య కాలం నుంచి ఎంపిక ప్రాతిపదికన తప్పితే కేంద్ర స్థాయిలో వ్యాట్ లేదు. వినియోగ పన్ను వ్యవస్థ అత్యంత

| | 1990-91 | 1992-93 | 1995-96 | 1997-98 | 2001-02 | 2004-05 |
|---|---|---|---|---|---|---|
| దేశీయ కంపెనీ | 50 | 45 | 40 | 35 | 35 | 35 |
| విదేశీ కంపెనీ | 65 | 65 | 55 | 48 | 45 | 40 |

(మూలం : కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ)

సంకుచితంగా ఉంది. సేవలన్నింటికీ పన్ను పరిధి నుంచి పూర్తి మినహాయింపు ఉంది. కస్టమ్స్ సుంకాలు కూడా సంక్లిష్టమైన మినహాయింపులతో అత్యంత అధికంగా ఉన్నాయి. ఎంపిక ప్రాతిపదికన ఎగుమతి సుంకాలు అమలులో ఉన్నందు వల్ల సాంప్రదాయిక ఎగుమతులు అంతర్జాతీయంగా పోటీ పడలేని స్థితిలో ఉన్నాయి. రాష్ట్రాల స్థాయిలో కూడా అమ్మకపు పన్ను అత్యంత భారంగా ఉంది. ఇన్ పుట్ పన్నులన్నీ వస్తువుల




ఎక్కడైనా, ఎప్పుడైనా పన్ను రిటర్నులు ఈ-ఫైలింగ్ చేసే విధానం

తుది ధరల్లో కలిసిపోయి ఉండడం వల్ల పన్నుల పైనే పన్నులు చెల్లించే స్థితి ఉంది. ఈ వాతావరణం అంతటినీ పరిగణనలోకి తీసుకుంటే భారత్‌లో పన్ను వ్యవస్థలో చేసిన మార్పులు సమర్థత, సమానతల్లో ఎంతో మెరుగుపడినట్టు పన్ను నిపుణులు చెబుతున్నారు.

పన్ను సంస్కరణల కారణంగా పన్నుల రూపంలో ఖజానాకు తగ్గిన ఆదాయాలను భర్తీ చేసుకోవడంలో ప్రభుత్వ అసమర్థత, పన్ను చెల్లింపుదారుల పరిధి విస్తరించకపోవడం వంటి కారణాల వల్ల ఖజానాకు ఏర్పడిన నష్టం చాలా ఎక్కువగానే ఉంది. 1994 నుంచి కేంద్రప్రభుత్వ పన్ను ఆదాయాలు అంతకుముందు వసూళ్లతో పోల్చితే జిడిపిలో ఒక శాతం మేరకు తగ్గాయి. కస్టమ్స్, ఎక్సైజు సుంకాల తగ్గింపు వల్ల ఏర్పడిన నష్టం ఆదాయపు పన్ను రాబడుల ద్వారా భర్తీ కాలేని పరిస్థితి ఉంది. కేంద్ర పన్నులు తగ్గినప్పటికీ కొన్ని సన్‌సెట్ పన్ను మినహాయింపుల నిబంధనలు విస్తరించడం, కొత్త ప్రోత్సాహకాలు అమలులోకి తేవడం వల్ల ఆశించిన ప్రయోజనం సమకూరలేదని కూడా నిపుణుల పరిశోధన పత్రాలు తెలుపుతున్నాయి.

కొన్ని సంవత్సరాలుగా దేశ, విదేశీ కంపెనీల పన్నుల భారం ఎంత ప్రగతిశీలకంగా తగ్గాయో ఒకసారి పరిశీలిద్దాం.

### కేంద్ర పన్ను విధానాల్లో విప్లవాత్మక మార్పులు

### ఆదాయపు పన్ను

1990 దశకం మధ్యలో భారతదేశం ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన సమయానికే పలు వర్ధమాన దేశాలు సంస్కరణలు ప్రారంభించి అతి తక్కువ ఆదాయపు పన్ను రేట్లు అమలుపరుస్తున్నాయి. ఆ రేట్లు 15, 25, 35 శాతం స్థాయిలో ఉన్నాయి. 1997-98లో భారత ప్రభుత్వం కూడా వాటికి దీటుగా 10, 20, 30 శాతం పన్నురేట్లతో చట్టాలు రూపొందించింది. సమర్థత

ఆధారంగా ఆ రేట్ల తగ్గింపు, విస్తరణకు కూడా కట్టుబాటు ప్రకటించింది. పలు వర్ధమాన దేశాలు ప్రత్యేకించి తూర్పు ఆసియా, లాటిన్ అమెరికా దేశాలు కార్పొరేట్ ఆదాయపు పన్ను రేట్లను తగ్గించాయి. పాలనాపరమైన సౌలభ్యత, పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెంచుకోవడమే ఈ రేట్ల తగ్గింపు లక్ష్యం. దీనికి తోడు పెట్టుబడులు ఒక దేశం నుంచి మరో దేశానికి స్వేచ్ఛగా ప్రవహించేందుకు వీలు కల్పించడం కోసం ప్రపంచీకరణ శక్తులు కూడా రేట్ల తగ్గింపునకు స్ఫూర్తినిచ్చాయి. భారత్‌లో కూడా అందుకు దీటుగానే కార్పొరేట్ ఆదాయపు పన్ను దేశీయ కంపెనీలకు 35 శాతానికి, విదేశీ కంపెనీలకు 40 శాతానికి తగ్గించారు.

### సెంట్రల్ ఎక్సైజు, కస్టమ్స్ సుంకాలు

వ్యాట్ పేరుతో అమలుపరిచే సెంట్రల్ ఎక్సైజు విధానం రెండు దశాబ్దాల కాలంలో పరివర్తన చెందింది. 1986–87 సంవత్సరంలో కొన్ని రకాల వస్తువుల తయారీలో ఉపయోగించే ఎంపిక చేసిన ముడిసరకుకు వ్యాట్ నమూనాలో భాగం అయిన క్రెడిట్ విధానం అమలులోకి తెచ్చారు. 1994–95 సంవత్సరంలో యంత్ర పరికరాల ధరలు కూడా క్రెడిట్‌కు అర్హమైనవిగా ప్రకటించారు. ఇలా అభివృద్ధి చెందుతున్న పాక్షిక వ్యాట్ విధానాన్ని ఆధునీకరించిన వ్యాట్ లేదా మోద్వాట్‌గా వ్యవహరించారు. వాటిని కేవలం రెండు రేట్లుగా 8 శాతం, 16 శాతం స్థాయికి కుదించడం లక్ష్యంగా 2001లో దానికి సెంట్రల్ వ్యాట్ లేదా సెన్వాట్‌గా నామకరణం చేశారు.

### పన్నుల వ్యవస్థ నిర్వహణ

పన్ను విధానానికి సంబంధించిన ఏ సంస్కరణ విజయవంతం కావాలన్నా మూడు అంశాలు కీలకం.

అవి పన్ను చెల్లింపుదారుల పరిధి విస్తరణ, కంప్యూటరీకరణ, రాష్ట్ర స్థాయి వ్యాట్ అమలు. ఆదాయపు పన్నుచెల్లింపుదారుల పరిధి విస్తరణ కేంద్ర పన్నుల వ్యవస్థ సాధించిన అతి పెద్ద విజయాల్లో ఒకటి. 1990 దశకం మధ్య సమయంలో 14 మిలియన్ ప్రజలు పన్ను చెల్లింపుదారుల జాబితాలో చేరారు. వారిలో 10 నుంచి 11 మిలియన్ అప్పటికి క్రియాశీలంగా ఉన్న వారే. ఒక అంచనా ప్రకారం అప్పటికి 1 బిలియన్ జనాభాలో పన్ను విధింపునకు అర్హులైన జనాభా 300 మిలియన్ ఉన్నారు. ఒక్కో ఇంటిలో ఐదుగురు సభ్యులుంటారని లెక్క వేసుకున్నా పన్ను చెల్లింపు సామర్థ్యం గల వారు 60 మిలియన్ ఉంటారు. వారిలో వ్యవసాయ దాయాధారిత కుటుంబాలు 10 మిలియన్ తీసివేసినా నికరంగా 50 మిలియన్ పన్ను చెల్లింపు సామర్థ్యం గల గృహస్థులున్నారు. అంటే పన్ను చెల్లించగల సామర్థ్యం ఉన్నట్టుగా భావిస్తున్న వారిలో కేవలం 20 శాతం మందే పన్ను చెల్లింపుదారులుగా ఉన్నారు.

1990 దశకం ద్వితీయార్ధంలో ఒక స్వచ్ఛంద వెల్లడి కార్యక్రమం ప్రవేశపెట్టారు. దాని కింద ఆస్తులు, టెలిఫోన్లు కలిగి ఉన్నా, విదేశీ పర్యటనలు చేసినా వారికి ఆదాయం పన్ను చెల్లించదగిన స్థాయిలో ఆదాయం లేకపోయినా పేర్లు నమోదు చేయించడం తప్పనిసరి అయింది. తదుపరి ఆ ప్రమాణాలను విస్తరించుకుంటూ వెళ్లారు. దాని వల్ల మరింత అధిక సంఖ్యలో ప్రజలు ఆదాయపు పన్ను శాఖ జాబితాలోకి చేరడం తప్పనిసరి అయింది. 2000 సంవత్సరం నాటికి అలాంటి వారి సంఖ్య 20 మిలియన్ దాటింది. అతి తక్కువ సమయంలోనే పన్ను చెల్లించగల సామర్థ్యం ఉన్న వారి సంఖ్య రెండు రెట్లు పెరిగింది. కొన్ని దశాబ్దాలుగా సాధించలేనిది అతి తక్కువ కాలంలో సాధించారని పరిశోధన నివేదికలు తెలుపుతున్నాయి. 2005 సంవత్సరం నాటికి ఆ జాబితాలో 30 మిలియన్ ప్రజలుండగా వారిలో 25 మిలియన్ మంది అప్పటికి క్రియాశీలంగా ఉన్న వారే.

వాస్తవానికి 1985 సంవత్సరంలో ప్రభుత్వం దీర్ఘకాలిక ఆర్థిక విధానం ప్రకటించిన నాటి నుంచి అంటే 1980 దశకం మధ్యలోనే పన్ను సంస్కరణల దిశగా తొలి అడుగు పడింది. దేశ ఆర్థిక పరిస్థితి నానాటికీ తీసికట్టుగా ఉన్నదని ఆ విధానంలో గుర్తించారు. పన్ను వ్యవస్థలో మార్పులు తప్పనిసరి అని కూడా తేల్చారు. అదే దశాబ్దిలో దేశంలో ఎక్సైజు సుంకాల సమీక్ష, హేతుబద్ధీకరణకు ఒక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేశారు. 1986 సంవత్సరంలో మోద్వాట్ ప్రవేశపెట్టడానికి అదే బీజం వేసింది. అలాగే కస్టమ్స్ సుంకాల హేతుబద్ధీకరణకు వస్తువుల వర్గీకరణను ప్రవేశపెట్టినట్టు ఆ పరిశోధన పత్రాలు తెలుపుతున్నాయి.

ఆ తర్వాత దేశీయ పన్ను విధానాలను అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా రూపొందించేందుకు అవసరమైన చర్యలతో ఒక ప్రణాళిక రూపొందించేందుకు ప్రభుత్వం ఇద్దరు సీనియర్ బ్యూరోక్రాట్లతో రెండు కమిటీలు నియమించింది. అలా రాజా చెల్లయ్య కమిటీ, విజయ్ కేల్కర్ కమిటీ తెర పైకి వచ్చాయి. ఆ కమిటీలు చారిత్రకమైన సిఫారసులు చేశాయి.

### రాజా చెల్లయ్య కమిటీ

దేశంలో పన్నుల వ్యవస్థను సంస్కరించడం కోసం అవసరమైన అజెండా రూపొందించేందుకు ప్రభుత్వం ప్రొఫెసర్ రాజా చెల్లయ్య సారథ్యంలో పన్ను సంస్కరణల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1991, 1992, 1993 సంవత్సరాల్లో పలు చర్యలతో కూడిన మూడు నివేదికలు ప్రభుత్వానికి సమర్పించింది. అవి ఏమిటంటే....

1. మార్జినల్ పన్ను రేట్లను తగ్గిస్తూ వ్యక్తిగత పన్ను వ్యవస్థను సంస్కరించడం
2. కార్పొరేట్ పన్ను రేట్ల తగ్గింపు
3. వస్తూత్పత్తిలో ఉపయోగించే దిగుమతి వస్తువులపై పన్నుల తగ్గింపు
4. కస్టమ్స్ సుంకాల తగ్గింపు
5. కస్టమ్స్ సుంకాల రేట్ల తగ్గింపు, హేతుబద్ధీకరణ
6. ఎక్సైజు సుంకాల సరళీకరణ, వ్యాట్ వ్యవస్థతో వాటి అనుసంధానం
7. వ్యాట్ వ్యవస్థలో భాగంగా సేవల రంగాన్ని కూడా పన్ను పరిధిలోకి తీసుకురావడం
8. పన్ను చెల్లింపు పరిధి విస్తరణ

9. పన్ను సమాచార, కంప్యూటరీకరణ వ్యవస్థ నిర్మాణం

10. పన్ను వ్యవస్థలో నాణ్యత మెరుగుపరచడం

ఈ రకంగా చెల్లయ్య కమిటీ సిఫారసులతో ప్రారంభమైన పన్ను సంస్కరణలు ఈ నాటికీ కొనసాగుతున్నాయి. ఆ తర్వాత పన్ను వ్యవస్థకు తదుపరి దిశ కల్పించేందుకు అవసరమైన సిఫారసులు చేయడం లక్ష్యంగా 2002 సంవత్సరంలో ప్రభుత్వం విజయ్ కేల్కర్ కమిటీని నియమించింది.

**విజయ్ కేల్కర్ కమిటీ**

2002 సంవత్సరంలో విజయ్ కేల్కర్ నాయకత్వంలో ఏర్పాటైన ప్రత్యక్ష, పరోక్ష పన్నుల టాస్క్‌ఫోర్స్ సిఫారసులతో దేశంలో ప్రత్యక్ష పన్నుల వ్యవస్థకు కొత్త ఉత్తేజం వచ్చింది. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితుల పెంపు, మినహాయింపుల హేతుబద్ధీకరణ, దీర్ఘకాలిక పెట్టుబడి లాభాల పన్ను రద్దు, సంపద పన్ను రద్దు వంటి కీలక ప్రత్యక్ష పన్ను సిఫారసులు ఆ కమిటీ చేసింది.

**ఆ కమిటీ కీలక సిఫారసులు ఇలా ఉన్నాయి...**

**ప్రత్యక్ష పన్నుల వ్యవస్థ**

- నాణ్యతపరంగాను, పరిమాణంపరంగాను కూడా పన్ను చెల్లింపుదారుల సేవలను విస్తరించాలి, పన్ను చెల్లింపుదారులకు ఇంటర్నెట్, ఇ మెయిల్ అనుసంధానం కల్పించాలి.
- పాన్ (శాశ్వత అకౌంట్ నంబర్) పరిధిని విస్తరించాలి, పౌరులందరికీ అది అందుబాటులో ఉండేలా చూడాలి.
- తనిఖీ, జప్తు కేసుల బ్లాక్ అసెస్‌మెంట్ విధానం రద్దు చేయాలి.
- పెండింగులో ఉన్నకేసులను తగ్గించేందుకు డేటా ఎంట్రీ పనులను ఔటర్స్ చేయాలి.
- అన్ని రిటర్న్లు, రిఫండ్లను నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలి, రిఫండ్ల డిస్పాచ్ ఔట్‌సోర్స్ చేయాలి.
- పన్ను వసూళ్లు ఆధునికీకరించి, సరళీకరించి, హేతుబద్ధం చేయడంకోసం ప్రత్యేకించి టిడిఎస్, టిసిఎస్ వ్యవస్థలను మెరుగుపరచడం లక్ష్యంగా పన్ను సమాచార నెట్వర్క్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.
- పన్ను చెల్లింపులన్నీ జరిగినట్టు దేశం వదిలి వెళ్లే సమయంలో పొందాల్సిన ధృవీకరణ సర్టిఫికెట్ విధానం రద్దు చేయాలి.
- అవసరమైన పాలనాపరమైన, ఆర్థిక అధికారాలు కల్పిస్తూ సిబిడిటిని సాధికారం చేయాలి.

**వ్యక్తిగత ఆదాయపు పన్ను**

- సాధారణ పన్ను చెల్లింపుదారులకు పన్ను మినహాయింపు ఆదాయ పరిమితిని లక్ష రూపాయలకు పెంచాలి. వయోవృద్ధులు, వితంతువులకు మరింత అధిక మినహాయింపు ఇవ్వాలి.
- ఆదాయపు పన్ను శ్లాబ్‌లు హేతుబద్ధీకరించి వ్యక్తిగత ఆదాయపు పన్నుపై సర్‌చార్జి తొలగించాలి.
- ఇంటి రుణాలపై రెండు శాతం వడ్డీ సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలి.
- పెన్షన్ ఫండ్లలోకి పెట్టే పెట్టుబడిపై 80సిసిసి సెక్షన్ కింద మినహాయింపు పరిమితిని పెంచాలి.

కార్పొరేషన్ టాక్స్

- కార్పొరేట్ పన్ను దేశీయ కంపెనీలపై 30 శాతానికి, విదేశీ కంపెనీలపై 35 శాతానికి తగ్గించాలి.
- లిస్టెడ్ కంపెనీలకు డివిడెండ్లు, పెట్టుబడి లాభాల పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలి.
- ప్లాంట్లు లేదా యంత్రపరికరాలపై తరుగుదల రేటును పెంచాలి.
- కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్) రద్దు చేయాలి.

**సంపద పన్ను**

- సంపద పన్ను రద్దు చేయాలి.

13 సంవత్సరాల క్రితం చేసిన ఈ




సిఫారసులన్నీ ఈ రోజు అమలు జరగడాన్ని మనం చూస్తున్నాం. ప్రత్యక్ష, పరోక్ష పన్ను విభాగాల్లో ఇప్పటివరకు దేశంలో జరిగిన అతి పెద్ద సంస్కరణలు డిటిసి, జిఎస్‌టి. అయితే డిటిసిలో పొందుపరిచిన పలు అంశాలు ఇప్పటికే ఆదాయపు పన్ను చట్టంలో చేర్చినందువల్ల ఇంక డిటిసి అమలు గురించి ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ చూపించడంలేదు. 2017 జూలై ఒకటో తేదీ నుంచి జిఎస్‌టి అమలులోకి వచ్చింది.

**కీలక ప్రత్యక్ష పన్ను సంస్కరణలు**

**పన్ను సమాచార నెట్వర్క్ (టిఐఎన్)**

ఆదాయపుపన్ను శాఖ తరఫున నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్) పన్ను సమాచార నెట్‌వర్క్‌ను (టిఐఎన్) ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా పన్నుల సంబంధిత గణాంకాలు ఇందులో నిక్షిప్తం అయి ఉంటాయి. పన్ను వసూళ్లు, ప్రాసెసింగ్, పర్యవేక్షణ, పరోక్ష పన్నులకు సంబంధించిన అకౌంటింగ్ అన్నింటినీ సమాచార సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఆధునీకరించడం ఈ ఆలోచన వెనుక గల ప్రధాన లక్ష్యం. టిన్ లో ఇరాక్స్, ఓల్టాస్, సిపిఎల్‌జిఎస్ పేరిట మూడు ఉపవిభాగాలుంటాయి.

**ఎలక్ట్రానిక్స్ రిటర్న్ యాక్సెప్టెన్స్ అండ్ కన్సాలిడేషన్ సిస్టమ్ (ఇరాక్స్) :**

పన్ను చెల్లింపుదారులతో సంబంధిత శాఖ అధికారులు ఇంటర్నెట్ మాధ్యమంగా అనుసంధానం కలిగి ఉండేందుకు దోహదపడే వ్యవస్థే ఇరాక్స్. మూల స్థానంలోనే పన్ను మినహాయింపు (టిడిఎస్), మూల స్థానంలోనే

పన్ను వసూళ్లు (టిసిఎస్), వార్షిక సమాచార నివేదికలన్నీ టిన్ సహాయంతో కేంద్రీయ వ్యవస్థకు అప్‌లోడ్ చేసే సదుపాయం అందుబాటులో ఉంటుంది.

**ఆన్‌లైన్ టాక్స్ అకౌంటింగ్ సిస్టమ్ (ఓల్టాస్) :**

దేశంలోని భిన్న ప్రాంతాల్లోని పన్ను వసూలు చేసే శాఖలు ఎప్పటికప్పుడు పన్ను జమలకు సంబంధించిన సమాచారం అప్లోడ్ చేసేందుకు ఉపయోగపడే వ్యవస్థ ఓల్టాస్.

**సెంట్రల్ పాన్ లెడ్జర్ జనరేషన్ వ్యవస్థ (సిపిఎల్జిఎస్) :**

టిడిఎస్, టిసిఎస్, అడ్వాన్స్ టాక్స్ చెల్లింపుల వివరాలన్నింటినీ కేంద్రీయ వ్యవస్థతో విలీనం చేసే విభాగం ఇది.

**ఇ-టిడిఎస్, ఇ-టిసిఎస్**

మూలస్థానంలోనే పన్ను మినహాయింపునే టిడిఎస్‌గా వ్యవహరిస్తారు. అంటే ఎక్కడెక్కడ వేతనాలు, బిల్లులు, ఇతర చెల్లింపులు జరుగుతాయో అదే స్థానంలో చెల్లింపులు చేసే సంస్థలు తమకు అందించిన వస్తువు లేదా సేవకు మూల్యంగా సొమ్ము అందుకునే వ్యక్తి లేదా సంస్థ నుంచి తాము ఇచ్చే సొమ్ములో వారు పన్నుగా చెల్లించాల్సిన మొత్తాన్ని మినహాయించి అలా వసూలైన సొమ్మును ముందుగానే నిర్ణయించిన బ్యాంకు ఖాతాలో జమ చేస్తాయి. ప్రభుత్వ విభాగాలు, శాఖలు, కార్పొరేట్ సంస్థలు అన్నీ టిడిఎస్ రిటర్న్‌లు దాఖలు చేయడం 2004-05 నుంచి తప్పనిసరి చేశారు. అలాగే వస్తువు కొనుగోలుదారుని నుంచి విక్రేతలు చెల్లింపు సమయంలో పన్నుమినహాయించే విధానాన్నే టిసిఎస్‌గా ఆదాయపు పన్ను చట్టం నిర్వచించింది. ఇక మూలస్థానంలో పన్ను వసూలు రిటర్న్‌ల ఎలక్ట్రానిక్ ఫైలింగ్ స్కీమ్, 2005 కింద అలా వసూలు చేస్తున్న ప్రభుత్వ సంస్థలు లేదా కార్పొరేట్లు ఆ సొమ్మును ఎలక్ట్రానిక్ విధానంలో లేదా నేరుగా ఎన్ ఎస్ డి ఎల్‌లో జమ చేయాలి.

**ప్రత్యక్ష పన్నుల్లో ఇతర చొరవలు**

**ఇ సహయోగ్ :**

కాగిత రహిత అసెస్‌మెంట్ సమాచార సాంకేతిక పరిజ్ఞానం పన్ను చెల్లింపుదారుల జీవితాన్ని సరళం చేసింది. వారు చలాన్లు డిపాజిట్ చేయడానికి బ్యాంకుల చుట్టూ గాని, పత్రాలు సమర్పించడానికి అసెసింగ్ అధికారుల చుట్టూ గాని స్వయంగా తిరగాల్సిన అవసరం లేదు. ఆ విధానాన్ని మరింత సరళం చేస్తూ సిబిడిటి ఇటీవల ఇ-మెయిల్ ద్వారా పేపర్ రహిత ఆదాయపు పన్ను అసెస్‌మెంట్ విధానంతో ముందుకు వచ్చింది. చిన్న చిన్న మొత్తాలకు కూడా పన్ను చెల్లింపుదారులు ఐటి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన ఇబ్బంది దీనితో తొలగిపోయింది. ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌లో ఇందుకు సంబంధించిన ప్రయోగాత్మక ప్రాజెక్టులు ప్రవేశపెట్టారు.

**సేవోత్తమ్ (సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) :**

పన్ను విభాగానికి చెందిన ఫిర్యాదుల పరిష్కారంపై అమలులో ఉన్న ఫిర్యాదుల పరిష్కార విధానానికి కొత్త జీవం అందించడం కోసం సేవోత్తమ్‌ను ఆదాయపు పన్ను శాఖ ప్రవేశపెట్టింది. ఇది దేశంలోని ఆదాయపు పన్ను కార్యాలయాలన్నింటినీ అనుసంధానం చేసే వ్యవస్థ. పన్ను చెల్లింపుదారులకు వచ్చే అనుమానాలు లేదా ఫిర్యాదులు ఏవైనా ఉంటే వాటిని ఎప్పటికప్పుడు ఎలాంటి జాప్యం లేకుండా నివృత్తి చేయడం లేదా పరిష్కరించడం ఈ వ్యవస్థ ఏర్పాటు ప్రధాన లక్ష్యం.

**త్వరిత రిఫండ్లు :**

కేవలం 10 పనిదినాల్లో పన్ను రిటర్న్‌లను ప్రాసెసింగ్ చేసి రిఫండ్లు అందించే వ్యవస్థను ఆవిష్కరించేందుకు ఆదాయపు పన్ను శాఖ కృషి చేస్తోంది. ఆధార్ లేదా బ్యాంకు డేటాబేస్ నుంచి ఐటి రిటర్న్‌లను తనిఖీ చేసే విధానం ఇది.

**ముందస్తుగానే ముద్రించిన భౌతిక ఐటీఆర్ ఫారంలు :**

ఆన్లైన్ చెల్లింపు విధానాలు ప్రవేశపెట్టి నప్పటికీ చాలా మంది ఇప్పటికీ పన్ను సమాచారాన్ని అందించేందుకు భౌతికంగా ముద్రించి అప్‌లోడ్ చేసిన ఫారంలు డౌన్‌లోడ్ చేసి నింపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. వారి పని మరింత సౌకర్యవంతం చేయడం కోసం ఆదాయపు పన్ను శాఖ పన్ను చెల్లింపుదారుల వివరాలన్నింటినీ ఆటోమేటిక్‌గా నింపి ఉన్న ఫారంలు అందించే ఏర్పాటు చేస్తోంది. దీని వల్ల వారికి సంబంధించిన అత్యధిక సమాచారం ముద్రించి సిద్ధంగా ఉంటుంది. అందులో ఐటి అధికారులు కోరిన సమాచారం ఎలా నింపాలో అన్న సందేహాలకు తావుండదు.

**పాన్ కాంప్‌లు :**

పాన్ దేశ పౌరులందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు, జనాభాలో అధిక శాతం మంది పాన్ పొందడం కోసం ఐటి శాఖ దేశవ్యాప్తంగా పాన్ శిబిరాలు నిర్వహిస్తోంది. ఎవరైనా ఆన్‌లైన్‌లోనే పాన్ కోసం దరఖాస్తు చేసి 48 గంటల్లోగా పాన్ కార్డు పొందడం కోసం ఇన్ కమ్ టాక్స్ బిజినెస్ అప్లికేషన్ - పర్మనెంట్ అకౌంట్ నంబర్ (ఐటిబిఏ-పాన్) పోర్టల్ ఒకటి కూడా ఏర్పాటు చేసే యోచన ఉంది.

**పరోక్ష పన్ను సంస్కరణలు**

ఎంపిక చేసిన కొన్ని వస్తువులకు 1986లో మోడిఫైడ్ విలువ ఆధారిత పన్ను విధానం (మోడ్వాట్) ప్రవేశపెట్టడంతో దేశంలో పరోక్ష పన్ను సంస్కరణలకు బీజం పడింది. కేంద్ర ఎక్సైజు సుంకం స్థానంలో దీన్ని ప్రవేశపెట్టారు. సెంట్రల్ విలువ ఆధారిత పన్ను విధానం (సెన్వాట్) ద్వారా దాన్ని తదుపరి అన్ని వస్తువులకు విస్తరించారు. ఆ తర్వాత అమ్మకం పన్ను స్థానంలో విలువ ఆధారిత పన్ను విధానం (వ్యాట్) ప్రవేశపెట్టేందుకు తదుపరి దశలో రాష్ట్రాలు కూడా చొరవ ప్రదర్శించి వ్యాట్ చట్టాలు చేశాయి.

**పరోక్ష పన్నుల విభాగంలో చోటు చేసుకున్న పలు సంస్కరణలు...**

**కస్టమ్స్ సుంకాల తగ్గింపు :**

1990 సంవత్సరం నాటికి వ్యవసాయేతర ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాలు 128 శాతం వరకు ఉండేవి. వాటిని క్రమక్రమంగా తగ్గిస్తూ వచ్చారు. ప్రస్తుతం దేశంలో కస్టమ్స్ సుంకాలు 11 నుంచి 12 శాతం మధ్యన ఉన్నాయి. కాని

వాటి పరిధి జీరో నుంచి 150 శాతం మధ్యన ఉంది.

**సెంట్రల్ ఎక్సైజు :**

కేంద్ర ఎక్సైజు సుంకాల స్థానంలో తొలుత మోడ్వాట్ ప్రవేశపెట్టి తదుపరి సెన్వాట్ ను అమలులోకి తెచ్చారు. పలు రకాల పన్నుల సంఖ్యను కూడా తగ్గించారు.

**సర్వీస్ టాక్స్ :**

1994–95 సంవత్సరంలో కొన్ని ఎంపిక చేసిన సేవలపై 7 శాతం స్థాయిలో సర్వీస్ టాక్స్ తొలిసారిగా ప్రవేశపెట్టారు. తదుపరి క్రమంలో సేవల పరిధిలోకి వచ్చే వస్తువుల సంఖ్యతో పాటు పన్ను రేట్లను కూడా పెంచుకుంటూ పోయారు. ప్రస్తుతం సుమారు 100 సేవలపై 14 శాతం పన్ను అమలులో ఉంది.

**వస్తు సేవల పన్ను (జీఎస్టీ)**

దేశంలో స్వాతంత్ర్యం అనంతరం చోటు చేసుకున్న అతి పెద్ద పన్ను సంస్కరణ జీఎస్టీ. దానికి తొలుత పలు బాలారిష్టాలు ఏర్పడినా కేంద్ర ప్రభుత్వం దాన్ని హేతుబద్ధం చేసి పన్ను చెల్లింపుదారులకు సరళతరంగా ఉండేలా మార్పులు చేసింది.

చాలా మంది పన్ను నిపుణులు జీఎస్టీ, డిటిసిలను ప్రభుత్వం చేపట్టిన అతి పెద్ద పన్ను సంస్కరణలుగా వర్గీకరించారు. దేశీయ, విదేశీ మదుపరులు, ప్రజలు పన్ను చెల్లింపులకు కట్టుబడేలా చేయడం లక్ష్యంగా పన్ను వ్యవస్థను సరళీకృతం చేయడానికి ఈ మార్పులు భరోసాగా నిలిచాయి. అయితే దేశంలోని పన్నుల వ్యవస్థను సరళీకృతం చేయడం, పన్ను చెల్లింపుదారుల పరిధిని విస్తరించడం, పన్ను చెల్లింపులకు ప్రజలు అధికంగా కట్టుబడేలా చేయడం ద్వారా ద్రవ్యలోటు తగ్గింపుపై దీర్ఘకాలిక ప్రభావం ఉండేలా చేసేందుకు డిటిసి, జీఎస్టీలు చాలా దూరం ప్రయాణించాల్సి ఉన్నదని పన్ను నిపుణులు చెబుతున్నారు. పన్ను చట్టాలు మరింత సరళంగా ఉండి, వాటి పరిష్కారానికి అందుబాటులో ఉండే ఆర్బిట్రేషన్ వ్యవస్థ కూడా సరళంగా ఉన్నట్టయితే తమ సొమ్ము ఇన్వెస్ట్ చేయడానికి ఆకర్షణీయ గమ్యంగా భారత్ మారుతుందని విదేశీ ఇన్వెస్టర్లు చెబుతున్నారు. ఇవి భారత్‌లో జిడిపి మరింతగా పెరిగేందుకు, ప్రజల చేతిలో మరింతగా ఆదాయం సమకూరేందుకు దోహదపడతాయి.


# FINANCIAL PLANNING !!!

SBI Life INSURANCE With Us, You're Sure



**LIFELONG PENSION**

Do you want Rs. 20,000 to 1 Lakh monthly Pension?
Do you want to Retire at 40 yrs / 50 yrs / 60 yrs of your age?
**Start Early Savings & Have Peaceful Retirement life.**



**CHILD PLANS**

Do you need Rs. 30,000 to 3 Lakhs yearly For your Children's Education From1st Class to P.G. and 25 Lacs for Marriage?
**Ensure Global Satandrad Education and Build Their Future**



**FAMILY PROTECTION**

Do You Want to Give Financial Security to Your Family Members?




**SAVINGS UPTO Rs. 1,50,000**

Avail Tax Benefits U/S 80C Of Income Tax Act
Avail Tax Free Matuirty U/S 10 (10D) Of Income Tax Act

* You can have loan protection, Family Income Protection and Increasing Term Insurance @ 5%.
* You can have Critical illness Rider, Total & Permanent Disability Benefit Rider and Accidental Death Benefit Rider.

**SIP - Systematic Investment Plan**

| Monthly Investment | 5 yrs | 10 yrs | 15 yrs | 20 yrs | 25 yrs | 30 yrs |
|---|---|---|---|---|---|---|
| 3,000 | 2.42 Lacs | 7.30 Lacs | 17.12 Lacs | 36.87 Lacs | 76.60 Lacs | 1.56 Crore |
| 5,000 | 4.04 Lacs | 12.18 Lacs | 28.54 Lacs | 61.46 Lacs | 1.27 Crore | 2.60 Crore |
| 10,000 | 8.09 Lacs | 24.36 Lacs | 57.09 Lacs | 1.22 Crore | 2.55 Crore | 5.21 Crore |

1. Systematic Investment Plan helps you achieve your bigger financial goals in the long term.
2. Get Advance of power of compounding.
3. Rupee cost averaging when the Market is down side.
4. A Convenient way to invest regularly.
5. 2 Types of Tax Benefits - 80C and No LTCG.

**More Details : K. SAILATHA : 9866221674**

# రైతు బంధు పథకం

దేశంలో ఎంత సంపద వున్నా ఆ దేశ వాసులందరికీ అన్నాన్ని పెట్టవలసింది రైతు మాత్రమే. అందుకే దేశానికి వెన్నెముక రైతు అంటుంటాం. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా అన్నదాతను ఆదుకోలేక పోతున్నాం. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత దేశంలో కూడా 70 శాతం ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఏ కుటుంబంలో నయినా కుటుంబ పెద్ద ఆరోగ్యంగా వున్నంత కాలం ఆ కుటుంబం ఆనందంగా వుంటుంది. సంపాదించే వ్యక్తి చతికిలబడితే మొత్తం కుటుంబం ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. ఈ విషయాన్ని మనదేశం గుర్తించడం లేదు. నేల స్వభావాన్ని పరీక్షించడం మొదలుకొని ధాన్యం నిలువ మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, పంట ఋణాలను అందించడం, ఎరువులు, విత్తనాలను రాయితీపై అందించడం. రైతు మరీ ఎక్కువగా ఋణాలను తీసుకుంటే, వాటిని మాఫీ చేయడం జరుగుతున్నది.ఇది కాదు రైతుకు అందించ వలసిన సహాయం.

రైతును మరింత బలోపేతం చేయాలని, రైతు బలపడితే దేశం బలపడుతుంది అని చేసిన ఆలోచనలకు ప్రతిరూపమే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 'రైతు బంధు' పథకం. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజక వర్గంలోని శాలపల్లి-ఇందిరానగర్‌లో మే 10వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆ రోజు నుండే రాష్ట్రమంతటా పాస్ పుస్తకాలు, చెక్కుల పంపిణీ కూడ ప్రారంభమైంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చేది అప్పు కాదు కనుక తిరిగి చెల్లించవలసిన అవసరం ఉండదు. ఇది ఈ ఒక్కసారితో ఆగేది కాదు. ప్రతి పంటకు ప్రభుత్వం 'ఎకరానికి నాలుగువేల' పెట్టుబడి మద్దతు ఇస్తూనే ఉంటుందనే భరోసా రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. విత్తనాలు చల్లక ముందే రైతు చేతికి డబ్బులు అందితే, ఆ రైతు ఆనందం అంతా ఇంతా కాదు. పెట్టుబడికి మద్దతు అందివ్వాలని ఏ రైతూ అడగలేదు. అసలు ఇలా అందించే అవకాశం వుంటుందని ఎవరూ కూడా ఊహించలేదు. అయితే రైతును ఏ దశలో ఎట్లా ఆదుకోవాలో ఏ ఏ అంశాలు వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తాయో రైతుగా వ్యవసాయం చేసిన తెలంగాణ ముఖ్యమంత్రికి తెలుసు కనుకనే ఈ 'రైతు బంధు' పథకం అమలు సాధ్యమయ్యింది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా లేనివిధంగా వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించాలనే ఈ సాహసోపేత కార్యక్రమాన్నిచేపట్టడం జరిగింది. దేశవ్యాప్తంగా ప్రముఖ ఆర్థిక వేత్తలు ఈ ఆలోచనపై ప్రశంసలు కురిపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అను సంధానం చేయాలనే ఆలోచన కూడా వున్నది. దీనివల్ల రైతులకు కూలీల భారం తగ్గుతుంది. ఎరువులు విత్తనాలు సకాలంలో సజావుగా సరఫరా చేయడం మొదలుకొని ఐదు లక్షల రూపాయల మేర ప్రమాద బీమా సదుపాయం కల్పించడం వరకు ఈ రాష్ట్రం చేపట్టిన చర్యలు ఆశ్చర్యాన్ని కూడా కలిగిస్తున్నాయి.

నేల స్వభావాన్ని పరీక్షించడం మొదలుకొని ధాన్యం నిలువ మార్కెటింగ్ వరకు అన్ని హంగులు సమకూరుస్తున్నారు. రైతన్నలు తమ బాగోగులు చర్చించుకోవడానికి వేదికలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఒక్కటీ ఒక వినూత్న ప్రయోగమే. వీటికి తోడు వ్యవసాయరంగంలో ఆధునిక పోకడలను ప్రవేశపెట్టడానికి యాంత్రీకరణకు మైక్రో ఇరిగేషన్‌కు పాలీహౌజ్ గ్రీన్‌హౌజ్‌ల కోసం వందల కోట్ల రూపాయలను కేటాయించారు.


## యోజన చందా ఆన్‌లైన్‌లో

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Division వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

**– సీనియర్ ఎడిటర్**


తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సౌజన్యంతో....



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

**1) అరేబియా సముద్రంలో ఉన్న 'సోకోట్రా' దీవి ఏ దేశానికీ చెందినది ?**
ఎ) యెమెన్ బి) సౌదీ అరేబియా
సి) కువైట్ డి) ఇరాన్

**2) 'e-గవర్నెన్స్' లో ఏ అంశాలు వస్తాయి ?**
ఎ) ప్రజలకు ఎలక్ట్రానిక్, పారదర్శకమైన సమర్ధవంతమైన సేవలు అందించటం.
బి) దీనిలో PAN, ఆధార్, NPS వంటి సేవలు వస్తాయి.
సి) NSDL e-గవర్నెన్స్ ద్వారా విద్యా ఋణాల మంజూరు ప్రక్రియ చాలా వేగవంతం అయ్యింది. డి) పైవన్నీ

**3) 'స్పాట్ గోల్డ్ ఎక్స్ఛేంజి వివరాలేవీ ?**
ఎ) దీన్ని SEBI నియంత్రిస్తుంది.
బి) గుడ్ డెలివరీ & ధరల పారదర్శకత తెలుస్తుంది.
సి) భారతదేశంలో బుల్లియన్ బ్యాంకులు లేవు. కనుక బంగారం ఎగుమతి, దిగుమతులన్నీ ఓవర్ ది కౌంటర్ పద్ధతి ద్వారా జరుగుతుంటాయి.
డి) పైవన్నీ

**4) డై నైట్రోజన్ టెట్రాక్సైడ్ ($N_2O_2$) దేనిలో వాడతారు? వివరాలేవీ?**
ఎ) అంతరిక్ష రాకెట్లలో ఆక్సిడైజర్‌గా వాడతారు.
బి) ఎరువుల కర్మాగారాలలో దీన్ని తయారు చేయవచ్చును.
సి) రంగులేని ద్రవం / వాయువుగా మారితే కాషాయ (ఆరంజ్) రంగులోకి మారుతుంది.
డి) పైవన్నీ

**5) ఏ పంట పండించటానికి అత్యధికంగా నీరు కావాలి?**
ఎ) వరి & చెరకు బి) కంది
సి) పత్తి డి) వేరుశెనగ

**6) గ్రావిటీ RAT (రిమోట్ యాక్సెస్ ట్రోజాన్) అనే మాల్‌వేర్ దేని ద్వారా వ్యాపిస్తోంది? వివరాలేవీ?**
ఎ) e-మెయిల్ అటాచ్మెంట్ లాగా వస్తుంది.
బి) ఇది MS వర్డ్, MS ఎక్సెల్ వంటి ఫార్మాట్‌లో అయినా ఉండవచ్చును.
సి) ఆడియో / వీడియో ఫైల్స్ లాగా రావచ్చును
డి) పైవన్నీ.

**7) Cry2Ab అనే జన్యువు దేన్నించి తీసి Bt కాటన్ మొక్కల సృష్టిలో వాడతారు ?**
ఎ) బాసిల్లస్ థురిన్ జీన్ సిస్ బి) TB
సి) పోలియో డి) ఇవేవి కావు

**8) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) కొరియన్ ఆర్మీస్టేస్ అగ్రిమెంట్ : జూలై 27, 1953.
బి) NNRC : న్యూట్రల్ నేషన్స్ రిపాట్రియేషన్ కమిషన్
సి) UNSC: యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్
డి) పైవన్నీ

**9) 'యాంగ్లి' పండుగ జరుపుకునే 'తైవా' గిరిజనులు ఏ రాష్ట్రంలో నివసిస్తున్నారు ?**
ఎ) అస్సాం బి) కర్ణాటక
సి) కేరళ డి) తమిళనాడు

**10) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) FTTH : ఫైబర్ టు ది హోం
బి) IPTV : ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్
సి) MBPS : మెగా బిట్స్ పర్ సెకండ్
డి) పైవన్నీ

**11) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) 'ఫాక్ట్ ఫుల్ నెస్' : హాన్స్ రోస్లింగ్
బి) 'ఎలెవన్ గాడ్స్ & ఏ బిలియన్ ఇండియన్స్' : బోరియా మజుందార్
సి) 'సెవెన్ డికేడ్స్ అఫ్ ఇండిపెండెంట్ ఇండియా : ఐడియాస్ & రిఫ్లెక్షన్స్' : వినోద్ రాయ్ & అమితెందు పాలిట్ (ఎడిటెడ్)
డి) పైవన్నీ

**12) AFSPA, 1958 చట్టం ఏ రాష్ట్రంలో పూర్తిగా తొలగించారు?**
ఎ) నాగాలాండ్ బి) J & K
సి) అరుణాచల్ ప్రదేశ్ డి) మేఘాలయ

**13) ఏప్రిల్ 28, 2018 నాటకి భారతదేశంలో ఉన్న ఎన్ని గ్రామాలకు విద్యుదీకరణ పూర్తి అయ్యింది (ఒక అంచనా ప్రకారం)?**
ఎ) 5,97,464 బి) 18,452
సి) 50,000 డి) ఇవేవి కావు

**14) ఉత్తర అరేబియా సముద్రంలో పెరుగుతున్న 'నాక్టి కా ఆల్గే (సీ టింకిల్) (సీ స్పార్కిల్) సముద్రంలో దొరికే డై ఆటమ్స్ / ప్లాన్ కే టోనిక్ ఆర్గానిజమ్స్ (జీవులను) తిని దేన్ని విసర్జిస్తాయి?**
ఎ) అమోనియా బి) యురేనియం
సి) నికెల్ డి) కాపర్

**15) సముద్రం ఉపరితల నీటిలో జీవించే 'డై అటమ్స్' కి ఏవి కావాలి? (డై అటమ్స్‌ను తిని చేపలు జీవిస్తాయి)**
ఎ) సూర్య కాంతి & సిలికేట్ బి) ఇనుము
సి) క్లోరిన్ డి) ఫ్లోరిన్

**16) రెయిన్‌బో పర్వతం (హరివిల్లు పర్వతం) ఎక్కడ ఏ దేశంలో ఉంది?**
ఎ) వీటు మార్కా, పెరూ దేశం (ఆండీస్ పర్వతాలలో ఉంది)
బి) సముద్ర మట్టానికి 5000 మీటర్ల ఎత్తులో ఉన్న రెయిన్‌బో పర్వతం, సప్త వర్ణాలను వెదజల్లుతూ ఉంటుంది.
సి) ఇక్కడ 'అప్లకా' పశు పోషకులు నివసిస్తూంటారు. 'పంపాచిరి' అనే లోకల్ ప్రజలు కూడా నివసిస్తున్నారు ఇక్కడ.
డి) పైవన్నీ (ఆసన్ గేట్ హిమ పర్వతం కూడా దీనికి దగ్గరలో ఉంది)

**17) 'అంటానానారివో ' ఏ దేశ రాజధాని?**
ఎ) మెడగాస్కర్ బి) మాలే
సి) నైజీరియా డి) కెన్యా

**18) కేంద్ర ప్రభుత్వం ఒక క్వింటాల్ చెరకు పంటకు ఎంత రాయితీ పకటించింది?**
ఎ) రూ.10 బి) రూ. 5.5
సి) రూ.20 డి) రూ. 25

**19) PMVVY ఇన్వెస్ట్‌మెంట్ లిమిట్ ఎంతకి పెంచారు?**
ఎ) రూ. 15 లక్షలు బి) రూ. 25 లక్షలు
సి) రూ.30 లక్షలు డి) ఇవేవి కావు

**20) ఇటీవల 'వూహాన్ సమ్మిట్' ఎవరి మధ్య చర్చల కోసం నిర్వహించారు?**
ఎ) భారత ప్రధాని & చైనా దేశ అధ్యక్షుడు
బి) శ్రీలంక అధ్యక్షుడు & రష్యా అధ్యక్షుడు
సి) జపాన్ ప్రధాని & ఇండోనేషియా అధ్యక్షుడు
డి) ఇవేవి కావు

**21) 'పీస్ హౌస్' & 'ఫ్రీడమ్ హౌస్' ఎక్కడున్నాయి?**
ఎ) పాన్ మున్ జోం (ఉత్తర & దక్షిణ కొరియా దేశాల సరిహద్దులో)
బి) USA సి) మాస్కో డి) పారిస్

**22) విక్టోరియా సరస్సు ఏ దేశాలలోకి వ్యాపించి ఉంది?**
ఎ) కెన్యా బి) టాంజానియా
సి) ఉగాండా డి) పై మూడు దేశాలలో

**23) గ్రామ స్వరాజ్ అభియాన్ ఎప్పుడు ప్రారంభించారు?**
ఎ) ఏప్రిల్ 14, 2018
బి) జనవరి 24, 2018
సి) అక్టోబర్ 02, 2017 డి) ఇవేవికావు.

**24) 'మోగా నైట్' అనే పదార్థంలో ఏమి ఉంటుంది?**
ఎ) హైడ్రోజన్ బి) సిలికాన్ డయాక్సైడ్
సి) కార్బన్ డి) పొటాషియం

**25) 'బిలి గుండ్లు' అనే ఊరు ఏ రాష్ట్రాల సరిహద్దులో ఉంది, కావేరి జలాల విడుదల సందర్భంగా వార్తల్లో ఉంటున్నది?**

ఎ) కర్ణాటక & తమిళనాడు
బి) కేరళ & తమిళనాడు
సి) కేరళ & కర్ణాటక
డి) కర్ణాటక & మహారాష్ట్ర

**26) 'దాలియాన్', చైనాలో ఇటీవల ఎవరు సమావేశం అయ్యారు ?**
ఎ) చైనా అధ్యక్షుడు & ఉత్తర కొరియా అధ్యక్షుడు
బి) చైనా ప్రధాన మంత్రి & భారత ప్రధాన మంత్రి
సి) జపాన్ ప్రధాన మంత్రి & రష్యా అధ్యక్షుడు
డి) ఇవేవి కావు

**27) ఏ దేశంతో చేసుకున్న అణు ఒప్పందం నుండి USA అధ్యక్షుడు విరమించుకున్నామని, ఇటీవల ప్రకటించారు ?**
ఎ) ఇరాక్ బి) ఇరాన్ సి) టర్కీ డి) సౌత్ఆఫ్రికా

**28) 2018లో బంగారం ధరలు పెరగటానికి ఏవి కారణం కావచ్చును ?**
ఎ) డోనాల్డ్ ట్రంప్ చేసే అనిశ్చిత రాజకీయ నిర్ణయాలు
బి) మిడిల్ ఈస్ట్ దేశాలలో ఉన్న ఉద్రిక్తతలు
సి) బ్రెక్సిట్ సంప్రదింపుల అనిశ్చితి
డి) పైవన్నీ

**29) తెలంగాణాలో 'రైతు బంధు' వ్యవసాయ పెట్టుబడుల మద్దతు పథకం ద్వారా ఎంత మంది లబ్ధి పొందుతారు? వివరాలేవీ?**
ఎ) తెలంగాణా రాష్ట్రంలోని సుమారు 72.09 లక్షల మంది రైతులు.
బి) 58.06 లక్షల చెక్కుల ద్వారా రూ. 5,608.09 కోట్లు పంపిణీ చేస్తారు.
సి) ప్రతి రైతుకి ప్రతి సీజన్‌లో రూ.4,000 చెక్కు ద్వారా ఇస్తారు.
డి) పైవన్నీ

**30) 'రణ బీర్ పీనల్ కోడ్' (శిక్షాస్మృతి) ఏ రాష్ట్రానికి సంబంధించినది?**
ఎ) ఢిల్లీ బి) జమ్మూ & కశ్మీర్
సి) పంజాబ్ డి) రాజస్థాన్

**31) నేపాల్‌ని 'ల్యాండ్ లాక్డ్' దేశం అని ఎందుకంటారు?**
ఎ) నేపాల్ దేశానికీ అన్ని వైపులా కొండలు / నేలా ఉన్నాయి. సముద్రం ఏ ప్రక్కనా లేదు. సముద్ర యానానికి నేరుగా వీలుపడదు కనక
బి) నీళ్ళు ఎక్కువగా ఉండటం చేత
సి) అక్కడ చలి ఎక్కువగా ఉండటం చేత
డి) ఇవేవి కావు

**32) అయోధ్య (ఉత్తరప్రదేశ్) – జనకపూర్‌ను కలుపుతూ డిస్ట్రిక్ట్ బస్ సర్వీస్ భారత ప్రధాని ఏ దేశం వారితో కలిసి ప్రారంభించారు, ఇటీవల?**
ఎ) నేపాల్ బి) భూటాన్
సి) పాకిస్తాన్ డి) ఆఫ్ఘనిస్తాన్

**33) 4,240 మిలియన్ సంవత్సరాల వయస్సు గల అతి పురాతన 'సింగ్ భూమ్ రాయి' (జిర్కాన్ ఉన్న రాయి) ని ఎక్కడ కనుగొన్నారు ?**
ఎ) చాంపువా, కెందు ఝూర్ జిల్లా, ఒడిశా
బి) జాక్ హిల్ సి) కిలిమంజారో డి) పెరూ

**34) ట్రాన్సిట్ హాల్ట్ ఆఫ్ ఇండియన్ సోల్జర్స్ ఎన్ రూట్ (థౌఇస్) మిలిటరీ ఎయిర్ ఫీల్డ్ ఎక్కడ ఉంది? (సియాచిన్ వెళ్ళేందుకు వాడతారు)?**
ఎ) హుద్దూర్‌కి 16 కి.మీ. దూరంలో (J& K)
బి) బెంగళూరు సి) ఢిల్లీ డి) హౌరా

**35) మలేసియా ప్రధాన మంత్రి పదవికి, ఇటీవల ఎవరు ఎన్నికైనారు?**
ఎ) మహతీర్ మొహమ్మద్
బి) సుల్తాన్ ముహమ్మద్ V
సి) నజీబ్ రజాక్
డి) టుంకు అబ్దుల్ రహమాన్

**36) గతంలో USA–ఇరాన్ చేసుకున్న జాయింట్ కాంప్రెహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో గల అంశాలు ఏవి?**
ఎ) ఇంధన శుద్ధి ; IAEA ఇన్‌స్పెక్షన్‌లు
బి) ప్లుటోనియం ఉత్పత్తి ; బ్రేక్ – అవుట్ టైం
సి) రిలీఫ్ శాంక్షన్లు డి) పైవన్నీ

**37) ఇండియన్ మ్యూజియం, కోల్‌కతలో గల గ్యాలరీలు ఏవి?**
ఎ) మూడు జూలాజికల్ స్పెసిమెన్‌లు గలవి
బి) ఒక గ్యాలరీలో బోటానికల్ స్పెసిమెన్‌లు ఉన్నాయి
సి) క్షీరదాల గ్యాలరీలో 314 ఎగ్జిబిట్‌లు ఉన్నాయి
డి) పైవన్నీ (ఇటీవల సందర్శకులు / ప్రేక్షకుల కోసం ప్రారంభించారు)

**38) 224 అసెంబ్లీ సీట్లున్న కర్ణాటక రాష్ట్రంలో, 222 సీట్లకే ఎన్నికలు జరిపారు. ఎక్కడి ఎన్నికలు వాయిదా వేశారు?**
ఎ) జయనగర్ సెగ్మెంట్ & రాజ రాజేశ్వరి నగర్
బి) రామ దేవర బెట్ట
సి) మంగళూరు సిటీ డి) ఇవేవి కావు

**39) Kilaueva అగ్ని పర్వతం నుండి వచ్చిన లావా ఏ దీవిలోని రోడ్లపై పొంగి పొర్లింది?**
ఎ) ఫిలిప్పీన్స్ బి) హవాయి
సి) ఇండోనేషియా డి) బ్రూని

**40) పాంబన్ రైలు బ్రిడ్జి దేనితో కలుపుతుంది?**
ఎ) రామేశ్వరం
బి) అండమాన్ & నికోబార్
సి) మాహే డి) యానాం

**41) స్టీఫెన్ హాకింగ్ ఎవరితో కల్సి, 'కాస్మోలజీ'కి సంబంధించిన 'మల్టీ వర్స్' సిద్ధాంతంపై పరిశోధన చేశాడు?**
ఎ) థామస్ హెర్టోగ్ బి) చార్లెస్ డార్విన్
సి) ఐన్ స్టీన్ డి) వీరెవరు కారు

**42) 'త్సొంగో సరస్సు' ఎక్కడ ఉంది ?**
ఎ) నేపాల్ బి) తూర్పు సిక్కిం
సి) బంగ్లాదేశ్ డి) పాకిస్తాన్

**43) 'అడాప్ట్ ఏ హెరిటేజ్ : అప్నీ ధరోహర్, అప్నీ పెహచాన్ స్కీం 'ద్వారా ఈ కింది వాటిల్లో వేటిని దత్తత తీసుకోటానికి సంస్థలు సంపూర్తిగా ముందుకొచ్చాయి?**
ఎ) రెడ్ ఫోర్ట్ (ఢిల్లీ) & గండికోట (ఆంధ్రప్రదేశ్)
బి) కొండపల్లి సి) అరకు లోయ
డి) వెయ్యిస్తంభాల గుడి, వరంగల్

**44) భారతదేశ MDP (మల్టీ డైమన్షనల్ పావర్టీ) 2005–06 కి 2015–16కి మధ్య కాలంలో 55 శాతం నుండి 21 శాతంకి తగ్గింది. MDP ని దేని ఆధారంగా లెక్కిస్తారు?**
ఎ) ఆరోగ్యం బి) విద్య
సి) జీవన ప్రమాణాలు ( లివింగ్ స్టాండర్డ్స్)
డి) పై మూడు

**45) MDP లో తెల్పిన లివింగ్ స్టాండర్డ్స్‌లో ఏవేవి ఉంటాయి ?**
ఎ) వంట ఇంధనం ; పారిశుధ్యం
బి) శుభ్రమైన నీరు ; విద్యుచ్ఛక్తి
సి) ఫ్లోరింగ్ ఆస్థులు
డి) పైవన్నీ

**46) MDP లెక్కింపులో ఏ దక్షిణాది రాష్ట్రాలు ముందున్నాయి ?**
ఎ) కేరళ ; తమిళనాడు
బి) కర్ణాటక ; తెలంగాణా
సి) ఆంధ్రప్రదేశ్ డి) పైవన్నీ

**47) మెయిన్టెనెన్స్ & వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ & సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007 ప్రకారం, వృద్ధులైన తల్లి తండ్రుల్ని సరిగా చూడని పిల్లలకు ఎంత కాలం జైలు శిక్ష విధించవచ్చును?**
ఎ) 3 నెలలు బి) 12 నెలలు
సి) 24 నెలలు డి) 36 నెలలు

**48) భారత హిమాలయలను రెండు బయోగ్రాఫిక్ జోన్‌లుగా విభజించారు. (అవి (i) ట్రాన్స్ హిమాలయా; (ii) హిమాలయా). దీనిలో గల రాష్ట్రాలు ఏవి?**
ఎ) J&K ; HP; ఉత్తరా ఖండ్
బి) సిక్కిం ; పశ్చిమ బెంగాల్‌లోని డార్జీలింగ్
సి) అరుణాచల్‌ప్రదేశ్
డి) పై 6 రాష్ట్రాలు

**49) ఇటీవల నరేంద్ర మోదీ ఏ దేశానికి వెళ్లి 900 MW అరుణ్ – III హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు?**
ఎ) ఆఫ్ఘనిస్తాన్ బి) నేపాల్
సి) తుర్క్‌మేనిస్తాన్ డి) కజకిస్తాన్

**50) ప్రస్తుతం భారతదేశంలో ప్రతి 1000 మందికి ఎంత మంది నర్సులు ఉన్నారు?**
ఎ) 1.7 బి) 2.5 సి) 3.5 డి) 4.5

**51) ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులు ప్రతి ఏటా మే 12 నాడు ఎవరికిస్తారు?**
ఎ) నర్సులకు బి) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌కు
సి) మెకానికల్ ఇంజనీర్స్
డి) IAS ఆఫీసర్స్ కు

**52) కొటుంసార్ గుహ, కాంగర్ వాలీ నేషనల్ పార్క్ ఏ రాష్ట్రంలో ఉంది?**
ఎ) రాజస్థాన్ బి) ఛత్తీస్‌గఢ్
సి) హిమాచల్ ప్రదేశ్ డి ) జమ్మూ & కశ్మీర్

**53) 'పాన్ మున్ జోం డిక్లరేషన్' లో గల అంశాలు ఏవి?**
ఎ) దశల వారీగా ఆయుధాల తగ్గింపు
బి) ప్రతీకార చర్యలు మానుకోవటం
సి) ఫోర్టిఫైడ్ సరిహద్దు ను 'శాంతి జోన్' గా మార్చటం ; US తో సహా ఇతర దేశాలతో పలు అంశాలు చర్చించటం
డి) పైవన్నీ

**54) క్రీస్తు పూర్వం 2వ శతాబ్దం చరిత్ర ప్రాముఖ్యత గల 'ధూళి కట్ట ' గ్రామం / బౌద్ధ క్షేత్రం ఎక్కడ ఉంది?**
ఎ) పెద్దపల్లి జిల్లా, తెలంగాణా
బి) శ్రీకాకుళం జిల్లా సి) ఖమ్మం జిల్లా
డి) నల్గొండ జిల్లా

**55) పశ్చిమ కనుమలలో పుట్టిన మలప్రభ నది, ఎక్కడ కృష్ణా నదిలో కలుస్తోంది ?**
ఎ) కూడల సంగమ , బాగల్ కోట్ జిల్లా, కర్ణాటక
బి) జరా సంగం
సి) హంసల దీవి డి) అంతర్వేది

**56) కౌంటరింగ్ అమెరికాస్ అడ్వర్సరీస్ త్రూ శాంక్షన్స్ యాక్ట్ (CAATSA) వల్ల ఏ దేశాలకు ఇబ్బంది కలగవచ్చును?**
ఎ) ఇండియా బి) వియత్నాం సి) టర్కీ డి) పైవన్నీ

**57) 'విలేజ్ రాక్‌స్టార్' అనే అస్సాం సినిమాకి దర్శకత్వం వహించినది ఎవరు?**
ఎ) రీమా దాస్
బి) జ్యోతి ప్రసాద్ అగర్వాలా
సి) జాహ్ను బారువా డి) ప్రమతేష్ బారువా

**58) మొగల్ పాదుషా జహంగీర్ కుమారుడు ఖుస్రూ (క్రీస్తు శకం 1587 - 1622) సమాధి ఎక్కడుంది ?**
ఎ) ఢిల్లీ బి) అలహాబాద్, UP
సి) లాహోర్ డి) ఔరంగాబాద్

**59) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) 'ది ప్రైస్ ఆఫ్ ఎయిడ్ : ది ఎకనామిక్ కోల్డ్ వార్ ఇన్ ఇండియా' : డేవిడ్ C యంగర్ మాన్
బి) 'విజిల్ బ్లోయర్ ఎట్ ది CIA' : మెల్విన్ A గుడ్ మాన్
సి) 'ది లాస్ట్ వైట్ హంటర్' : డోనాల్డ్ ఆండర్సన్ విత్ జాషువా మాథ్యూ
డి) పైవన్నీ

**60) రూ.25 లక్షల నగదు బహుమతి గల కల్నల్ C K నాయుడు లైఫ్ టైం ఎచీవ్ మెంట్ అవార్డు కోసం ఇటీవల ఎవర్ని ఎంపిక చేశారు ?**
ఎ) పంకజ్ రాయ్ & అంశుమన్ గైక్వాడ్
బి) దయానా ఎదుల్ జీ
సి) సుధా షా డి) పై అందరూ

**61) రెన్యూవబుల్ ఎనర్జీ గురించి, ఏది కరెక్ట్?**
ఎ) భారతదేశంలో మొత్తం పవర్‌లో 1/5 వంతు రెన్యూ వబుల్స్ నుండి వస్తోంది
బి) ఫిబ్రవరి 28, 2018 నాటికి ఇన్ స్టాల్డ్ కెపాసిటీ 65 GW
సి) రాబోయే 5 ఏళ్లలో 15 నుండి 20 GWh గ్రిడ్ కనెక్టెడ్ స్టోరేజ్ కెపాసిటీ లక్ష్యంగా పెట్టుకున్నారు డి) పైవన్నీ

**62) ISRO రాకెట్‌లలో వాడే హైడ్రోజెన్ ఇంధనానికి బదులుగా దేన్ని వాడటానికి పరిశోధనలు చేస్తోంది?**
ఎ) హైడ్రాక్సిల్ అమ్మోనియం నైట్రైట్ (HAN)
బి) నైట్రోజన్ సి) క్లోరిన్ డి) ఫ్రియాన్

**63) 'ఈస్టర్న్ NATO' అనే ముద్దు పేరు దేనికి కలదు?**
ఎ) షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ (SCO)
బి) ASEAN సి) BRICS
డి) అరబ్ లీగ్

**64) జూన్, 2018లో 'షాంగ్రిలా డైలాగ్' ఎక్కడ నిర్వహించనున్నారు?**
ఎ) సింగపూర్ బి) జకార్తా
సి) మనిలా డి) టోక్యో

**65) 'టైప్ 001 A' ఏమిటి ?**
ఎ) విమానం
బి) చైనా దేశం స్వంతంగా తయారు చేసుకున్న ఎయిర్ క్రాఫ్ట్ కారియర్ (విమాన వాహక నౌక)
సి) జలాంతర్గామి డి) రాకెట్

**66) ముంబై - అహ్మదాబాద్ మధ్య రానున్న హై స్పీడ్ రైల్ ప్రాజెక్ట్‌కి ఎక్కడెక్కడి భూమి సేకరించదల్చారు?**
ఎ) గుజరాత్ (612.17 హెక్టర్లు)
బి) మహారాష్ట్ర (246 .42 హెక్టర్లు)
సి) దాద్రా నాగర్ హవేలీ (7.52 హెక్టర్లు)
డి) పైవన్నీ (ఈ నగరాల మధ్య రైలు మార్గ దూరం : సుమారు 508.9 కి.మీ.)

**67) 'ఉన్నత్ భారత్ అభియాన్' (UBA) వివరాలేవీ?**
ఎ) ఉన్నత విద్యా సంస్థలు, గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలకు పరిష్కారాలు వెదకటం
బి) UBA 2.0 త్వరలో ప్రారంభం కానున్నది
సి) గ్రామీణాభివృద్ధి – (100 శాతం స్కూలు విద్యా ఫలితాలు, కనీసం 25 ఉద్యోగాల కల్పన, గ్రామీణ ఆదాయం పెరుగుదల, తాగు నీరు సరఫరా, పరిశుభ్రత, చెత్త పారబొయ్యటం మొదలైనవి ) డి) పైవన్నీ

**68) 2018 - 19 లో భారతదేశం ఎన్ని మిలియన్ టన్నుల వ్యవసాయ పంటలు పండించ దల్చింది?**
ఎ) 283. 7 బి) 277.5
సి) 232 డి) 210

**69) భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (J) ప్రకారం స్పెషల్ స్టేటస్ అనుభవిస్తున్న హైదరాబాద్ - కర్ణాటక వివరాలేవీ?**
ఎ) ఉత్తరాన కృష్ణా నది, దక్షిణాన తుంగభద్రా నది ఉన్న ప్రాంతం ఇది
బి) స్వాతంత్ర్యానికి ముందు కాలంలో నిజాం పాలించాడు (బళ్ళారి మినహాయించి)
సి) ఆర్థిక – సాంఘిక వెనుక బాటు తనం ఎక్కువ
డి) పైవన్నీ

**70) ఉత్తర కొరియా దేశానికి సరిహద్దుగా గల దేశాలు ఏవి?**
ఎ) రష్యా బి) చైనా
సి) దక్షిణ కొరియా డి) పైవన్నీ

**71) ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (EPF) విడుదల చేసిన డేటా ప్రకారం ఫిబ్రవరి, 2018లో ఎంత మందికి వ్యవసాయేతర రంగాల్లో ఉద్యోగాలు లభించాయి?**
ఎ) 4,72,075 బి) 6,04,557
సి) 3.11 మిలియన్‌లు డి) ఇవేవి కావు

**72) IITM, పూణే నిర్వహిస్తున్న SAFAR (సిస్టం ఆఫ్ ఎయిర్ క్వాలిటీ & వెదర్ ఫోర్‌కాస్టింగ్ & రీసెర్చ్) ద్వారా ఏ నగరాలలో కాలుష్య స్థాయిని ముందుగా తెల్సుకుంటున్నారు?**
ఎ) ఢిల్లీ బి) ముంబై
సి) పూణే & అహ్మదాబాద్ డి) పైవన్నీ

**73) GSAT - 11 ను ఎక్కడ నుండి ప్రయోగించ దలిచారు?**
ఎ) కేప్ కెన్నెడీ
బి) కౌరు, ఫ్రెంచ్ గయానా
సి) బైకనూర్ డి) శ్రీహరి కోట

**74) న్యాయ మూర్తుల అభిశంసకు సంబంధించిన చట్టం ఏది?**
ఎ) జడ్జెస్ (ఎంక్వైరీ) యాక్ట్, 1968
బి) POTA సి) TADA
డి) MCOCA

**75) 2018లో కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో, ఏ పార్టీకి ఎన్ని సీట్లు లభించాయి?**
ఎ) BJP : 104 బి) కాంగ్రెస్ (ఐ) : 78
సి) JD (S) : 38 ; ఇతరులు : 2
డి) పైవన్నీ (ఎన్నిక ప్రక్రియ పూర్తి అయిన 222 సీట్లలో)

## జవాబులు (జూన్ - 2018)

| | | | |
|---|---|---|---|
| 1-ఎ | 20-ఎ | 39-బి | 58-బి |
| 2-డి | 21-ఎ | 40-ఎ | 59-డి |
| 3-డి | 22-డి | 41-ఎ | 60-డి |
| 4-డి | 23-ఎ | 42-బి | 61-డి |
| 5-ఎ | 24-బి | 43-ఎ | 62-ఎ |
| 6-డి | 25-ఎ | 44-డి | 63-ఎ |
| 7-ఎ | 26-ఎ | 45-డి | 64-ఎ |
| 8-డి | 27-బి | 46-డి | 65-బి |
| 9-ఎ | 28-డి | 47-ఎ | 66-డి |
| 10-డి | 29-డి | 48-డి | 67-డి |
| 11-డి | 30-బి | 49-బి | 68-ఎ |
| 12-డి | 31-ఎ | 50-ఎ | 69-డి |
| 13-ఎ | 32-ఎ | 51-ఎ | 70-డి |
| 14-ఎ | 33-ఎ | 52-బి | 71-ఎ |
| 15-ఎ | 34-ఎ | 53-డి | 72-డి |
| 16-డి | 35-ఎ | 54-ఎ | 73-బి |
| 17-ఎ | 36-డి | 55-ఎ | 74-ఎ |
| 18-బి | 37-డి | 56-డి | 75-డి |
| 19-ఎ | 38-ఎ | 57-ఎ | |

# దర్పణం

### రోడ్డుప్రమాద పరిహారం పెంపు:



రోడ్డుప్రమాదాలలో మరణించేవారి కుటుంబసభ్యులకిచ్చే పరిహారాన్ని, కేంద్రం త్వరలో పదిరెట్లు పెంచనున్నది. ఇప్పటివరకు రోడ్డు ప్రమాద మృతులకు రూ. 50,000/- ల చొప్పున, గాయపడిన వారికి రూ. 25,000/- ల చొప్పున పరిహారం ఇస్తున్నారు. త్వరలో నోటిఫై చేసే నూతన సవరణల ప్రకారం, మరణించినవారి వయసు, ఆదాయంతో సంబంధంలేకుండా కుటుంబ సభ్యులకు పది లక్షలవరకు పరిహారం అందిస్తారు. ఇదికూడ తక్కువని వారు భావిస్తే, మోటారు ప్రమాదాల క్లైముల ట్రిబ్యునల్ ఉండనే ఉన్నది.

### చైనా ఆధారహో!:




మనదేశంలో ప్రజలకు గుర్తింపు కార్డులుగా జారీచేసిన, చేస్తున్న ఆధార్ కార్డులతో పాటుగా వెల్లువెత్తుతున్న వివాదాల గురించి మనందరకూ తెలిసిందే. ఇదే ప్రపంచంలోని అత్యధిక జనాభాఉన్న చైనాలో అయితే, ప్రజలపై ఒక నియంత్రణా సాధనంగా కుడ వాడుతున్నారు. అక్కడి 'సోషల్ క్రెడిట్' విధానం ప్రకారం, నేరస్తులుగా శిక్షలు పడేవారు, రుణాలు ఎగవేసేవారు, క్రమశిక్షణ తప్పి ప్రవర్తించే వారికి నెగెటివ్ పాయింట్లు ఇస్తారు. అంతేకాదు, అక్కడి సోషల్ మీడియా వేదికలైన వుయ్ ఛాట్ (మన వాట్సాప్), అలీబాబా, సినవైబో (చైనీస్ ట్విట్టర్) రెన్రెన్ డాట్ కాం (చైనీస్ ఫేస్‌బుక్) లలో ప్రజల పోస్టింగుల ద్వారాకూడ వారికి నెగెటివ్ పాయింట్లు ఇస్తారు. ఇలాంటి రేటింగ్ అధికంగా ఉన్న వారి పిల్లలకు మంచి పాఠశాలల్లో ప్రవేశం ఉండదు. వారికి విమాన, రైలు టికెట్లను కూడ ఇవ్వరు. పద్ధతి బాగుంది కదా!



### పౌష్టికాహారానికి ప్రపంచ బ్యాంకు రుణం?


ప్రపంచ బ్యాంకు మనదేశానికి పౌష్టికాహార లోప సవరణకు రూ. 200 మిలియన్ల అమెరికన్ డాలర్ల రుణాన్ని ఇవ్వడానికి అంగీకరించింది. ఈ మొత్తంతో మొదటిదశలో 315 అత్యంత పేద జిల్లాలలో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందచేస్తారు. పోషణ్ అభియాన్ పేరుతో అమలుచేసే ఈ కార్యక్రమంలో పెరుగుదల లోపించిన ఆరు సంవత్సరములలోపు వయసు పిల్లల శాతాన్ని 2022 నాటికి 38.4 శాతం నుండి, 25 శాతానికి తగ్గించడానికి కృషిచేస్తారు. మార్చి 8న ప్రధాని మోదీ ఈ పథకాన్ని రాజస్థాన్‌లోని ఝున్ ఝును జిల్లాలో ప్రారంభించారు.

### అలుపెరుగని వీరుడు:




న్యాయస్థానాలలో కోట్లకొద్దీ వివాదాలు పేరుకుపోయి ప్రజలకు కోర్టులకు వెళ్ళాలంటేనే భయం కలుగుతున్న విషయం మనందరకూ తెలుసు. బొంబాయి హైకోర్టులో ఒక న్యాయమూర్తి ఒకరోజు తెల్లవారు ఝామున 3.30 గంటలవరకూ, అంటే ఏకబికిన 16 గంటలు పనిచేసి, 122 కేసులను పరిష్కరించారు. జస్టిస్ షారుఖ్ జె. ఖత్తావాలా ఈ రికార్డును సృష్టించారు.

### కనీసవేతనాల చట్టానికి ఢిల్లీ ప్రభుత్వ సవరణ:




కనీసవేతనాల చట్టాన్ని అతిక్రమించిన వారికి రూ. 50,000/- ల వరకు జరిమానా, మూడు సంవత్సరాల జైలుశిక్షను విధిస్తూ ఢిల్లీ ప్రభుత్వం చేసిన చట్ట సవరణకు రాష్ట్రపతి ఆమోదముద్ర లభించింది. 1948 నాటి కనీసవేతనాల చట్టాన్ని ఢిల్లీ ప్రభుత్వం మొదటిసారిగా డిసెంబరు 03, 2015 న సవరించింది. మొదటి చట్టంలో ఈ జరిమానా రూ. 500/- లు గాను, జైలుశిక్ష ఆరునెలలుగాను ఉండేది. ఈ కనీస వేతనాలను జూలై 1, 2017న రూ. 160/- నుండి, రూ. 176/- కు పెంచారు.

### గౌహతి - పూర్తి సౌరవిద్యుత్ స్టేషన్:



ఈశాన్య భారతదేశంలో పూర్తిగా సౌరశక్తితో నడిచే రైల్వే స్టేషన్ గా గౌహతి

రికార్డులకెక్కింది. భారతీయ రైల్వే విభాగం కేవలం రైల్వే స్టేషన్ల అవసరాలకే కాదు, రైళ్ళను నడపడానికి సైతం సౌరవిద్యుత్ ను అధికంగా వినియోగిస్తున్నది. 700 కిలోవాట్ల స్థాపక సామర్థ్యంతో ప్రారంభమైన ఈ సౌర విద్యుత్ ప్లాంటుకు రూ. 6.7 కోట్లు వ్యయమైంది. దీనివల్ల రైల్వే స్టేషన్ ప్రాంగణానికి మొత్తం నెలకు రూ. 67 లక్షల విద్యుత్ బిల్లు ఆదా అవుతున్నది.

**ప్లాస్టిక్ వ్యర్థాలపై మహారాష్ట్ర యుద్ధం:**




ప్లాస్టిక్ వ్యర్థాలవల్ల పర్యావరణ హాని జరగకుండా మహారాష్ట్ర ప్రభుత్వం రోడ్లనిర్మాణానికి వినియోగిస్తున్నది. దీనివల్ల ప్రతి వెయ్యి కిలోమీటర్ల రోడ్డునిర్మాణానికీ, రూ. రెండు లక్షల రూపాయలు ఆదా అవడమే కాక, దాదాపు 50,000 ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వినియోగపడుతున్నాయి. అంతేకాదు, రోడ్ల నాణ్యతకూడ ఉన్నతంగా ఉంటున్నది. క్షేత్రస్థాయి సిబ్బంది సహాయంతో తాగేసిన టీ కప్పులు, క్యారీ బ్యాగులతో సహా, అన్ని రకాల ప్లాస్టిక్ వ్యర్థాలనూ ఇందుకోసం సేకరిస్తున్నారు. ఇప్పటికే షోలాపూర్, సంగ్లీ, అక్లుజ్, మాలేగావ్, సతారా, ధూలే, కొల్హాపూర్ వంటి ప్రాంతాలలో వెయ్యికిలో మీటర్ల రోడ్డును వేశారు.

స్వచ్ఛ భారత్

వందకోట్లకు పైగా ప్రజలతోనున్న ఈదేశంలో వందకోట్లమేధావులున్నట్లేకదా! వీరందరూ నిజాయితీగా స్వచ్ఛభారత్ గురించి ఆలోచిస్తే మన లక్ష్యం కష్టమేమీ కాదు. స్వచ్ఛ – స్వాస్థ్య – సర్వత్రా!

**ఎస్.బి.ఐ. యూత్ ఫర్ ఇండియా:**



మన దేశంలో యువత అనేక అంశాలలో అనేక స్థాయిలలో విద్యార్హతలను సాధించి, తమ తెలివితేటలను నిరూపించు కుంటున్నారు. కానీ వారి అర్హతలకు తగిన ఉపాధి అవకాశాలను కల్పించడం అసలైన సవాలుగా ఉన్నది. దీనికితోడు నైపుణ్య సాధన మరో అంశం. ఈ సమస్యను పరిష్కరించడానికి భారతీయ స్టేట్‌బ్యాంక్ వారు యువతకు వైవిధ్యమైన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 13 నెలల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని, ప్రధానంగా దేశవ్యాప్తంగా ఆగాఖాన్ రూరల్ సపోర్ట్ ప్రోగ్రాం, బేర్ ఫుట్ కాలేజి, ధన్ ఫౌండేషన్, గ్రామ వికాస్ మరియు సేవ మందిర్ అనే నాలుగు ప్రధాన స్వచ్ఛంధ సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నారు.

**రైల్వే వారి నూతన బోగీలు:**



రైల్వే విభాగం దీన దయాళు బోగీల పేరుతో నూతన బోగీలను ప్రవేశపెడుతున్నది. బయో టాయిలెట్లు, మొబైల్ చార్జింగ్ పాయింట్లు, ఆక్వాగార్డ్ త్రాగునీరు, సామాను పెట్టుకునే చోటు కూడ కుషన్ల ఏర్పాటు వంటి ఆధునిక సౌకర్యాలతో 700 బోగీలను జనరల్ బోగీలుగా ప్రవేశపెడుతున్నది. ఏప్రిల్ 2016లో ప్రయోగత్మకంగా ప్రవేశపెట్టి 23 రైళ్లలో వీటిని ఉపయోగిస్తున్నారు. దీనితో పాటుగా అంత్యోదయ రైళ్లను కూడ మూడు మార్గాలలో ప్రవేశపెట్టారు. ఈ మొత్తం ప్రక్రియ ఈ సంవత్సరాంతానికి పూర్తవు తుంది.

## యోజన చందాదారులకు సూచన:


పోస్టులో పంపిన యోజన మాసపత్రిక అందడంలేదని పలువురు చందా దారులు ఫిర్యాదు చేస్తున్నారు. వీరందరికీ మనవి ఏమంటే, ప్రతినెలా రెండు, మూడు తారీకులలో ఠంచనుగా కాపీలను పోస్టు చేస్తాము. అయితే, ప్రతులు ఆర్డినరీ పోస్టులో వెళతాయి కనుక, ఒక్కొక్క సారి అందకపోయే అవకాశముంది. దీనికి యోజన బాధ్యతవహించదు. నెలకు ఒక ప్రతి అందకపోతే మరొకటి, మరొకటి పంపడానికి పాలనాపరమైన ఆటంకాలున్నాయి. ఒకవేళ రిజిష్టర్ పోస్టులో కావాలంటే, మామూలు ప్రతి ఒక్కింటికి రూ. 52/– లు, ప్రత్యేక సంచికకు రూ. 57/– లు చందాదారులు అదనంగా ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. గమనించగలరు.

– సీనియర్ ఎడిటర్

హేతుబద్ధీకరణ

# భారతలో పన్ను సంస్కరణలు- నిరంతర ఎజెండా

- ప్రొఫెసర్ వి. ఉషా కిరణ్




**ప్రారంభదశలో పన్నులను ముఖ్యమైన మూడు ఉద్దేశ్యాలతో విధించేవారు. అవి ప్రభుత్వాల రాబడిని మెరుగుపరచడము, మరిన్ని సంక్షేమ చర్యలు తీసుకోవడములో ప్రభుత్వాలకు సహాయపడడము మరియు ప్రజల మధ్య రాబడి అసమానతలను తొలగించడము. భారతదేశంలో పన్ను సంస్కరణలను ముఖ్యంగా నాలుగు దశలలో వివరించవచ్చును. అవి; 1) స్వాతంత్ర్యం వచ్చినప్పుడి నుండి 1990-91 వరకు 2) 1990-91 నుండి 2000 - 01 వరకు 3) 2000-01 నుండి 2016 - 2017 వరకు 4) 2017-2018 తర్వాత.**

ఈ వ్యాసం ద్వారా స్వాతంత్రం నుండి భారతదేశంలో అమలుచేసిన పన్ను సంస్కరణలను విశ్లేషించే ఒక ప్రయత్నం చేశాము. పన్నుల ద్వారా రాబడి పొందడం స్వతంత్రానికి ముందు కూడా భారతదేశంలో అమలులో ఉన్నదే, వివిధ చట్టాలు ప్రభుత్వానికి పన్నులు వసూలు చేసే అధికారన్ని ఇచ్చాయి. భారత రాజ్యాంగం షెడ్యూలు 7 ద్వారా జాబితా I, జాబితా II లో కల అంశాలకు సంబందించి రాబడి పొందే మరియు సేకరించేందుకు అధికారాలను వరుసగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు స్థానిక సంస్థలకు కలిగించింది. ప్రారంభదశలో పన్నులను ముఖ్యమైన మూడు ఉద్దేశ్యాలతో విధించేవారు. అవి ప్రభుత్వాల రాబడిని మెరుగుపరచడము, మరియు మరిన్ని సంక్షేమ చర్యలు తీసు కోవడములో ప్రభుత్వాలకు సహాయపడడము మరియు ప్రజల మధ్య రాబడి అసమానతలను తొలగించడము. పన్ను విధించే మరియు సేకరించే ప్రక్రియ పన్ను సూత్రాలను అనుసరించినప్పటికీ, పలు విధాలైన లోపాలతో అసమర్ధముగా ఉండేది. ప్రపంచ దేశాల మధ్య కూడా పన్నుల ప్రక్రియలో చాలా భేదాలు ఉండేవి. 1965 - 1990 మధ్య కాలములో ప్రపంచ దేశాలన్నీ కూడా పన్ను విధానములో పలు సంస్కరణలను చేపట్టాయి.

మన దేశముపై కూడా ఈ ప్రభావము స్పష్టంగా కనిపించింది. 1980 సంవత్సరం వరకు ప్రపంచ దేశాలతో సరిపోలే ఒక జాతీయ పన్ను విధానాన్ని భారత దేశం కూడా తయారు చేసుకున్నది. వ్యక్తిగత ఆదాయాల పై పన్నులు, కంపెనీల ఆదాయాలపై పన్నులు, సెంట్రల్ మరియు స్టేట్ ఎక్సైజ్ సుంకాలు మొదలైన వాటిని ప్రపంచ దేశాలతో సమంగా చేసే ప్రయత్నాలు చేపట్టింది. తర్వాతి సంవత్సరాలలో కూడా పన్ను విధి విధానాలలో మరియు పన్ను నిర్మాణములో అనేక మార్పులు వచ్చాయి.

భారత దేశంలో పన్ను సంస్కరణలను ముఖ్యంగా నాలుగు దశలలో వివరించ వచ్చును. అవిబీ 1) స్వతంత్రము వచ్చినప్పడి నుండి 1990-91 వరకు 2) 1990-91 నుండి 2000 - 01 వరకు 3) 2000-01 నుండి 2016 - 2017 వరకు 4) 2017-2018 తర్వాత.

**మొదటి దశ:**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి1 990-91 వరకు పన్ను సంస్కరణలకై, ప్రభుత్వాలు ఎన్నో కమిటీలను వేశాయి. వాటిలో ముఖ్యమైనవి; పన్ను సంస్కరణల కమిటీ 1953 (పంచ

డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్.
E-mail : usha_ou@yahoo.co.in

వర్ష ప్రణాళికలకు వనరులను చేకూర్చడం కోసం), కాల్డోర్ కమిటీ 1957–1958 (వ్యయాలపై పన్ను విధింపుకై), ప్రత్యక్ష పన్నుల విచారణ సంఘం 1971 (టాక్స్ రేట్ల తగ్గింపు కై), పరోక్ష పన్నుల విచారణ సంఘం 1972 (పరోక్ష పన్నుల సరళీకరణ కై) మరియు ఝా కమిటీ 1978 (పరోక్ష పన్నులో మార్పులు). ఈ కమిటీలన్ని కూడా పన్నుల ద్వారా రాబడిని ఎలా పెంచాలి, ఎలా ప్రజా సంక్షేమ పథకాలకు వనరులు చేకూర్చాలి అన్నఉద్దేశ్యముతో ఏర్పరచినవే. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలే కాక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పన్ను విధానాలను సరళీకరించడానికి ఎన్నో కమిటీలను ఏర్పరచుకున్నాయి. ఈ కమిటీల వలన పన్ను వ్యవస్థలో కొంత మార్పులు వచ్చినా, వాటి ప్రభావము చాలా స్వల్పమే. వ్యయాలపై పన్ను విధింపు పెద్దగా రాబడిని ఇవ్వలేకపోయింది కనుక ఆ పన్నును 1961 లోనే తొలిగించారు. ప్రత్యక్ష పన్నుల విచారణ సంఘం ద్వారా ఆదాయపన్నుల రేట్లు కొంత మేరకు క్రమబద్ధీకరించారు. రేట్లు 93.5 శాతం (1970) నుండి 66 శాతం (1976) వరకు తగ్గినాయి.. కేంద్ర విత్త మంత్రి వి పి సింగ్ మొట్టమొదటిసారిగా 1985లో ఒక దీర్ఘ కాలిక ఆర్థిక విధానాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టారు. దీనినే పన్ను సంస్కరణల వ్యూహంగా అభివర్ణించవచ్చును. దీని ద్వారా ప్రభుత్వము ఎక్సైజ్ డ్యూటీలను సంస్కరిస్తూ వాల్యు ఆడెడ్ టాక్స్ సూత్రాల ఆధారముగా, సవరించిన విలువ ఆధారిత పన్నులను (MODVAT) కొన్ని తయారి వస్తువులపై విధించారు. పలు రేట్లతో ఉన్న కస్టమ్స్ డ్యూటీని సవరిస్తూ మూడు అంచెలలో విధించారు. 1986 సంవత్సరము వరకు అదాయ పన్నును 8 నుండి 4 స్లాబ్స్‌లోకి మారుస్తూ అత్యధిక రేటును కూడా 50 శాతం వరకు తగ్గించారు. సంపదపై పన్ను రేటు కూడా 5 శాతం నుండి 2 శాతానికి తగ్గింది. కంపెనీలపై ఆదాయ పన్నును కూడా 50 శాతం వరకు widely held companies కు మరియు 55 శాతం closely held companies కు విధించారు. 1985 నుండి 87 వరకు జరిగిన పన్ను సంస్కరణలలో కొంత వరకు ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులను సంకలనం చేయ గలిగారు. ఈ రెండు సంవత్సరాలలో జరిగిన టాక్స్ సంస్కరణలు తర్వాతి సంవత్సరాలకు పునాదిగా నిలిచినాయి. పన్నుల నిర్వహణ విధానములో కూడా పలు మార్పులను సూచిస్తూ నల్లధనాన్ని అరికట్టడానికి పన్నులను ఎగవేయ కుండా చూడడానికి ప్రయత్నాలు సాగినాయి.

**రెండో దశ :**

1990–91 నుండి 2000 – 01 ఆర్థిక సంస్కరణలలో భాగముగా 1991లో ప్రధాని పి.వి.నరసింహారావు మరియు అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో సమగ్రమైన పన్ను సంస్కరణలను చేపట్టడము జరిగినది. డా. J. రాజ చెల్లయ్య టాక్స్ రిఫార్మ్స్ కమిటీని 1991లో ఏర్పరిచారు. ఆ కమిటీ సిఫార్సుల (interim report, December 1991 మరియు final report, August 1992, January 1993) ఆధారముగా పన్ను విధానాలలో పలు నిర్ణయాలు తీసుకొన్నారు.

పన్ను వ్యవస్థలో సుదూర మార్పులే లక్ష్యంగా డా. J. రాజా చెల్లయ్య కమిటీ రెండు విషయాలను సూచించింది. పన్ను విధానములో ప్రస్తుత లోపాలను తొలగిస్తూ, మరింత ఉత్పాదకతను (అనగా, రాబడిని పెంపొందించే దృష్టిలో మరింత ప్రభావవంతం చేయడానికి) బలమైన అమలుతో కూడిన ఒక ప్రగతిశీల పన్ను నిర్మాణం హేతుబద్ధతతో స్థిరత్వంతో నిర్ధారించడానికి మరియు స్వచ్ఛంద పన్ను సమ్మతిని ప్రోత్సహించే ఉత్తమ మార్గం సూచించడము ఈ కమిటీ లక్ష్యాలు. కమిటీ సూచనలు దాదాపుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నించినది. అందులో ముఖ్యమైనవి; i) టాక్స్ ఎగవేతను నిరోధించడము, టాక్స్ రేట్లను తగ్గించడము మరియు టాక్స్ స్లాబ్స్ తగ్గించడం ii) వ్యక్తిగత ఆదాయాలు మరియు కంపనీ ఆదాయాలపై పన్నుల్లో తేడాను తగ్గించడము, iii) ద్వంద్వ పన్నును అరికట్టడము iv) జాతీయ మరియు అంతర్జాతీయ కంపెనీల మధ్య కార్పొరేట్ పన్ను తేడాను తగ్గించడము, v) మూలధన లాభాల పై పన్నును, సంపద పన్నును మరియు ఎక్సైజ్ డ్యూటీనిని హేతుబద్ధీకరించడము vi) టారిఫ్ రేట్లు తగ్గించడము మొదలగునవి.

కమిటీ సూచనల అమలు ఫలితంగా, వ్యక్తిగత ఆదాయ పన్ను యొక్క గరిష్ట రేటు 1985–86 లో 50 శాతం ఉండగా 1991–92 లో 40 శాతానికి పడిపోయింది. చిన్న వర్తకులు, చిల్లర మరియు చిన్న రోడ్డుపై వర్తక నిర్వాహకులకు ప్రవర్తనాత్మక పన్ను (Presumptive tax) ప్రవేశపెట్టబడింది. 1994–95 బడ్జెట్లో పన్ను వలయాన్ని విస్తరించడానికి సేవా పన్ను చట్టాన్ని ప్రవేశపెట్టారు., టెలిఫోన్ బిల్లులు, జీవిత భీమా కాని భీమా కోసం ప్రీమియం చెల్లింపులు మరియు స్టాక్ బ్రోకర్ల ద్వారా వసూలు చేయబడిన కమిషన్ / బ్రోకరేజ్లో 5 శాతం సేవా పన్ను ప్రవేశపెట్టబడింది. 1994–95లో 3 సేవలపై పన్ను ఉండగా రానురాను పన్నును చాలా రకాల సేవలకు విస్తరింపు చేశారు మరియు పన్ను శాతాన్ని 12 శాతానికి పెంచారు. కార్పొరేట్ పన్ను రేట్లు సరళీకృతం చేశారు. దేశీయ సంస్థలకు కార్పొరేట్ పన్ను రేటు 30 శాతం మరియు విదేశీ కంపెనీలకు 40 శాతంగా నిర్ణయించినారు. గణనీయమైన బుక్ లాభాలు నికర లాభం కలిగిన కూడా సున్నా పన్నుకట్టే సంస్థలను నిరోధించడానికి, 1996–97 బడ్జెట్‌లో ఒక 'కనీస ప్రత్యామ్నాయ పన్ను' (MAT) ప్రవేశపెట్టబడింది. పన్ను విధించే స్లాబ్స్ సంఖ్యను తగ్గించడం, మినహాయింపులను తొలగించడం మరియు విలువ సాపేక్షిత ఆధారితముగా ఎక్సైజ్ రేట్లు మార్చడము ద్వారా పరోక్ష పన్నును సంస్కరించేందుకు ప్రభుత్వం 1991–92 నుండి పలు చర్యలను చేపట్టింది. 150 కంటే ఎక్కువ శాతానికి పెరిగిన దిగుమతి డ్యూటీలను ప్రతి సంవత్సరం 10 శాతం తగ్గింపు ద్వారా హేతుబద్ధీకరించారు. 1997–98 బడ్జెట్ వరకు ఆదాయ

పన్నును 10 శాతం, 20 శాతం మరియు 30 శాతం స్లాబులలోకి మార్చారు. కార్పొరేట్ పన్నును 35 శాతానికి తగ్గించారు. కంపెనీలు చెల్లించే డివిడెండ్‌పై పన్నును గ్రహీత కట్టాల్సిన పని లేకుండా కంపెనీయే చెల్లించేలా చేశారు. పన్ను వలయాన్ని విస్తరించేందుకు, ఎక్కువ మంది పన్ను అస్సెస్స్ దారులుగా ఉండేందుకు 1-by-6 ప్రమాణాన్ని ప్రవేశ పెట్టారు. పట్టణ ప్రాంతంలో నివసిస్తున్న ఏ వ్యక్తి అయినా ఇల్లు, కారు, టెలిఫోన్, క్రెడిట్ కార్డు మరియు క్లబ్ సభ్యత్వాన్ని కలిగి ఉన్నట్లయితే, విదేశాలలో ప్రయాణించినట్లైతే పన్ను పరిధిలో ఆదాయము లేకున్నా కూడా తప్పనిసరిగా టాక్స్ అస్సెస్మెంట్ రిటర్న్ దాఖలు చేయాలి. దీని వల్ల మరియు తగ్గిన పన్ను రేట్ల వలన పన్ను పరిధి మరియు పన్ను చెల్లించే వారి సంఖ్య పెరిగింది. ఈ రెండో దశలో ప్రభుత్వాలు మారినా పన్ను సంస్కరణలకు ఎలాంటి అవరోధము ఏర్పడ లేదు. కమిటీ చేసిన సూచనలన్నీ చాలా సమర్థవంతముగా వరుసగా ప్రభుత్వాలు చేపట్టాయి. తద్వారా సమర్థమైన పన్ను వ్యవస్థను స్థాపించగలిగారు.

**మూడో దశ :**

2000 - 01నుండి 2016 - 2017 వరకు మూడో దశలో పన్ను సంస్కరణలను మరియు సంస్కరణల ఫలితాలను విశ్లేషించ డానికి మరి కొన్ని కమిటీలను నియమించారు. శోమ్ అధ్వర్యములో 2001లో ఒక రిపోర్ట్ ఇవ్వడము జరిగినది. ఈ కమిటీని అడ్వైసరీ గ్రూప్ ఆన్ టాక్స్ పాలసీ మరియు టాక్స్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ ద టెన్త్ ప్లాన్‌గా వ్యవహరించి నారు. 2002లో కేల్కర్ అధ్వర్యములో ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. వారి రిపోర్ట్ కూడా 2002 లో ఇవ్వడము జరిగినది. ఈ టాస్క్ ఫోర్స్ ముఖ్య ఉద్దేశ్యము ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులపై సంస్కరణలను సూచించడమే. కేంద్ర ప్రభుత్వము రెండో దశ లోని సంస్కరణలను కొనసాగించినది. ఈ దశలో పన్ను విధానములో స్థిరత్వము లోపించినది. డివిడెండ్‌పై టాక్స్ ను 10 శాతం నుండి 20 శాతానికి పెంచారు. దానిని తిరిగి 10 శాతానికి తగ్గించగా తర్వాతి బడ్జెట్‌లో 12.5 శాతానికి పెంచారు. 2004-05 లో ఒక కొత్త టాక్స్ 'సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ టాక్స్' ను ప్రవేశ పెట్టారు. దీర్ఘ కాల మూలధన లాభాలపై టాక్స్ ఎత్తివేస్తూ, స్వల్ప కాల మూలధన లాభాలపై 10 శాతం పన్నును ఖరారు చేశారు. అల్లాగే కాష్ విత్ డ్రాల్ పన్నును కూడా ప్రవేశ పెట్టారు. ఫ్రింజ్ బెనిఫిట్ టాక్స్ ను కూడా కొత్తగా ప్రవేశ పెట్టారు. ఎక్సైజ్ డ్యూటీలలో ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ ప్రవేశపెట్టారు. సేవా పన్నును సుమారు 100 సేవలకు విస్తరించారు. పన్ను 5 శాతం నుండి 8 శాతం, 10 శాతం మరియు 12.5 శాతానికి పెరిగింది. పన్ను విధించే సేవలను గుర్తించకుండా పన్ను లేని సేవలను చట్టములో గుర్తించడము మొదలు పెట్టారు. కస్టమ్స్ డ్యూటీ కూడా 1991 లో ని 200 శాతం టారిఫ్ పాయింట్ల నుండి 2005లో 15 శాతం వరకు తగ్గినది.

ఈ దశలోనే రాష్ట్ర ప్రభుత్వాల పన్ను విధానములో కూడా గొప్ప మార్పు సంభవించి నది. 2005 లో సుమారు 21 రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మకాలపన్ను నుండి వాల్యూ ఆడెడ్ టాక్స్ (వాట్) విధానములోనికి వచ్చాయి. ఈ వాట్ విధానము ద్వారా ఇండైరెక్ట్ టాక్స్ పద్ధతులలో మార్పులు వచ్చినవి. పన్నుపై పన్ను పద్ధతి లేకుండా, ఇన్పుట్ క్రెడిట్ కలిగి ఈ పద్ధతి ఎన్నో లాభాలను సమకూర్చింది. కానీ బహుళ రేటు విధానము, రకరకాల షెడ్యూల్స్, రాష్ట్రానికి ఇంకో రాష్ట్రానికి మధ్యలో పన్నుల తేడాలు, కొన్ని రాష్ట్రాలు ఈ పద్ధతిని అనుసరించక పోవడము ఈ పద్ధతిని అసమర్థముగా మరియు అయోమయంగా చేశాయి. అయినప్పటికీ పాత అమ్మకాల పన్ను విధానముపై ఇది ఎన్నో రెట్లు మెరుగు. ఈ కొత్త విధానము ద్వారా రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల అమ్మకాల పన్నులను ఏకీకృతం చేయాలన్న ఆలోచన అసమగ్రము గానే ఉన్నది.

సాంకేతికపరమైన మార్పులను అంది పుచ్చుకుంటూ, కేంద్ర ప్రభుత్వము డైరెక్ట్ టాక్స్ నిర్వహణలో ఎన్నో సంస్కరణలు చేపట్టింది. నేషనల్ సెక్యూరిటీ డిపాజిటరి (NSDL) సహాయముతో, అస్సేస్సీస్ రిటర్న్ దాఖలు చేయడము, వారికి PAN నంబర్ ఇవ్వడము, టాక్స్ రిటర్న్ ఈ-వెరిఫై చేయడము, TDS (Tax deducted at source) ఎంత కట్టారు, కట్టినదానికి ఎంత సరిపోలింది అన్నది చూడడానికి టాక్స్ ఇన్ఫర్మేషన్ నెట్ వర్క్ ద్వారా వీలు కల్పించింది. ఆధునిక ఆడిట్ విధానము, దాఖలు చేసిన రిటర్న్‌ను పరిశీలనకై ఉప యోగించే శాంపుల్ పద్ధతులు మొదులగునవి సాంకేతికత వలననే సాధ్యమైనవి. అదే విధంగా ఇండైరెక్ట్ టాక్స్ నిర్వహణలో కూడా సాంకేతికత ఎన్నో ప్రయోజనాలను కల్పించింది.

**నాలుగో దశ**

2017-18 తర్వాత నాలుగవ దశ ఇన్ డైరెక్ట్ టాక్స్ విధానములో ఒక పెద్ద సంస్కరణకు నాంది పలికింది. 'ఒకే దేశము, ఒకే పన్ను' నినాదము నరేంద్ర మోదీ మరియు అరుణ్ జైట్లీ నేతృత్వములో NDA ప్రభుత్వము వస్తు సేవా పన్ను (GST) విధింపు కొరకై 2016లో పార్లమెంటు ఆమోదాన్ని పొందింది. ఈ చట్టము అమలు చేసేందుకు రాజ్యాంగ సవరణ జరిగినది. రాష్ట్ర ప్రభుత్వాల పన్ను విధింపు అధికారాలను కేంద్ర ప్రభుత్వం కొంత మేర వినియోగించదలిచినందుకై ఈ సవరణ అవసరమైనది. ఈ సవరణ ప్రకారము వస్తు మరియు సేవా పన్ను విధింపు మరియు సేకరణ అధికారాలు కేంద్రము మరియు రాష్ట్రాలు ఏకరీతిగా అమలు చేయవచ్చును. GST జూలై 1, 2017 నుండి అమలులోనికి వచ్చింది. ఇంతవరకు రాష్ట్రాలు విధిస్తున్న పన్నుల విధానము మూలాధారితము. ఎక్కడైతే వస్తు లేదా సేవ సరఫరా మొదలవుతుందో అదే ప్రదేశములో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ GST దీనికి విరుద్ధంగా ఉన్నది. GST గమ్యస్థాన పన్నుగా అభివర్ణించవచ్చును. అనగా కొనుగోలు, అమ్మకాలతో సంబంధము లేకుండా, ఎక్కడైతే వస్తువు లేదా సేవ వినియోగింపబడుతుందో పన్ను విధింపు మరియు చెల్లింపు అక్కడే జరుగుతుంది.

GST లో గల పన్నుల భాగాలు మూడు రకాలు. అవి స్టేట్ GST, సెంట్రల్ GST మరియు ఇంటిగ్రేటెడ్ GST. సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, సెంట్రల్ ఎక్సైజ్ టాక్స్, సేవా పన్ను, అదనపు ఎక్సైజ్ సుంకాలు, ఎక్సైజ్ డ్యూటీ, స్పెషల్ డ్యూటీ ఆఫ్ కస్టమ్స్ (ఎస్ఏడీ), అదనపు కస్టమ్స్ డ్యూటీ, కౌంటర్వేలింగ్ డ్యూటీ (సీవీడీ) సర్ చార్జి మరియు సెస్ CGST భాగం కింద కలిసిన పరోక్ష పన్నులు. CGST విధింపు మరియు సేకరణ కేంద్ర ప్రభుత్వ పరిధి. CGST ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ ను రాష్ట్రాలలోని డీలర్లు CGST కి సర్దుబాటు చేసుకోవచ్చును. స్టేట్ సేల్స్ టాక్స్, వాట్, లగ్జరీ టాక్స్, ఎంటర్టైన్మెంట్ టాక్స్, లాటరీ, బెట్టింగ్, జూదం, ఎంట్రీ ట్యాక్స్, స్టేట్ సెసెస్ మరియు సర్ఛార్జీలపై పన్నులు అన్నీ SGST క్రింద కలిపివేసినారు. SGST విధింపు మరియు సేకరణ రాష్ట్ర ప్రభుత్వ పరిధి. అంతర రాష్ట్ర లావాదేవీల విషయంలో, ఇంటిగ్రేటెడ్ GSTని అన్ని వస్తువులపై మరియు సేవలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్నది. IGST నుండి సేకరించిన ఆదాయం రాష్ట్రం మరియు కేంద్ర ప్రభుత్వం మధ్య భాగస్వామ్యం చేయబడుతుంది.




### GST పాలక సమితి మరియు GST నెట్‌వర్క్

GST విధింపు, వసూళ్ళ నిబంధనల రూపకల్పనకు GST పాలక సమితి ఏర్పడినది. కేంద్ర విత్త మంత్రి ఆధ్వర్యంలో రాష్ట్ర విత్త మంత్రులు సభ్యులుగా ఈ పాలక సమితి GST రేట్లు, మినహాయింపులను నిర్ణయిస్తుంది. రేట్లు అందరి సభ్యుల ఆమోదము తర్వాతనే చట్టబద్దీకరించబడతాయి. అలాగే మినహాయింపులు కూడా అందరి ఆమోదము తోనే నిర్ణయించబడుతాయి. పాలక సమితి 25వ సమావేశములో GST నాలుగు స్లాబ్స్‌లో 5 శాతం, 12 శాతం, 18 శాతం మరియు 28 శాతం రేట్లతో వర్గీకరించారు.

పన్ను మదుపుదారులను రాష్ట్ర ప్రభుత్వాలను మరియు కేంద్ర ప్రభుత్వాలను అనుసంధానము చేయడానికై సాంకేతికను ఉపయోగిస్తూ ఒక GST నెట్ వర్క్ ఏర్పరిచినారు. దీని ద్వారా పన్నుమదింపుదారులు, రెజిస్ట్రేషన్, రిటర్న్ సమర్పించడము పన్ను చెల్లింపులు చేసుకొనవచ్చును. GSTN రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా సేవలను అందిస్తుంది. ఒక డీలరుకు క్రెడిట్ ఎంత ఉంది, దానిని పన్నులో ఎలా సర్దుబాటు చేయవచ్చును మొదలగు అంశాలన్ని GSTN దానంతటదే సవరిస్తుంది. అలాగే IGST రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్యలో పంపకము చేయడం కూడా GSTN ద్వారా జరుగుతుంది. ఈ పన్ను సంస్కరణ వలన కొంత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అయోమయం ఏర్పడినా పాలక సమితి సమావేశాలలో ఒక్కో విషయాన్ని చర్చించుకుంటున్నారు. ఎన్నో రకాల పన్నుల నుండి విముక్తి కలిగినప్పటికీ, బహుళ రేట్లు, మినహాయింపులు, రాబడి పంపిణీ, రాష్ట్రాలకు వాటిల్లే నష్టము, డీలర్లకు కలిగే ప్రాథమిక ఇబ్బందులు, వినియోగదారులను ప్రక్క త్రోవ పట్టించి GST పేరుపై ఎక్కువ డబ్బులను వసూలు చేసే వర్తకుల వలన కలిగే నష్టాలు GSTయొక్క ప్రయోజనాలను తగ్గిస్తాయి. ఈ సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రంగా ఎదురుకొని పరిష్కరించ కొన్నట్లైతే GST ఒక గొప్ప సంస్కరణగా మిగిలిపోతుంది.

ఒక్క ఏప్రిల్ నెలలోనే జి.ఎస్.టి. వసూళ్ళు లక్ష కోట్లు దాటాయంటే, మన ఆర్థిక వ్యవస్థ వేగంగా ముందడుగు వేస్తున్నదనడానికి ఇంకేం సాక్ష్య కావాలి?

### ముగింపు

నాలుగు దశలుగా వివరించిన భారత దేశము లోని పన్ను సంస్కరణలు చూసినట్లైతే, భారత దేశము మిగిలిన ప్రపంచ దేశాలతో సమానముగా, సమాంతరముగా ప్రయనించ డానికి తగిన విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినదని చెప్పవచ్చును. పన్ను విధానాలలో, పన్నుల సరళీకరణలో మరియు పన్నుల నిర్వహణలో సంస్కరణల ద్వారా సామర్థ్యాన్ని, స్థిరత్వాన్ని మరియు సమగ్రతను సాధించుకోగలిగాము. టెక్నాలజీ వాడడము ద్వారా కూడా పన్నులను కట్టేవారికి, సేకరించే వారికి గొప్ప ప్రయోజనాలు చేకూరినాయి. పన్ను విధానములో పారదర్శకతను ప్రదర్శిస్తూ పన్ను పరిధిని పెంచుకునే ప్రయత్నాలు ఈ సంస్కరణలలో భాగాలు. ఆదాయాలు,పన్నులు, వనరులు మొదలగునవి ఎల్లప్పుడు మార్పులు చెందే ప్రక్రియలు. ఎన్ని సంస్కరణలు చేపట్టినా, ఈ విషయాలలో ఎప్పుడికప్పుడే క్రొత్త సంస్కరణలకు పునాదులు వేయవల్సినదే. ప్రతి సంస్కరణా ఒక ఆరంభము మాత్రమే. దాని ద్వారా సంభవించే సమస్యలను పరిష్కరించుకోవడానికి తిరిగి సంస్కరణలు చేపట్టాల్సినదే. అందుకే సంస్కరణలు ఎప్పుడు అసంపూర్ణ ఎజెండాగా ఉంటాయి. ■


## యోజన చందాదారులకు సూచన:

యోజన తెలుగు మాస పత్రిక డిజిటలైజ్ అయింది. దీనితో ఒక సంవత్సర చందాదారునికి సాలుకు 12 సంచికలు పంపటానికి మాత్రమే వీలవుతుంది. అనగా ఇప్పటి వరకు జరుగుతున్నట్లుగా సంచిక అందలేదని తెలిపితే మరో కాపీని పంపటానికి ఇకపై వీలవదు. కనుక చందాదారులు తమ చిరునామాకు సంబంధించిన పోస్టల్ విభాగంతో తమ ఏర్పాట్లు తామే గట్టిగా చేసుకోవాలి, గమనించగలరు.

**– సీనియర్ ఎడిటర్**

# కృత్రిమ మేధో యుగం దిశగా భారత్

**– పరిమళ్ తంబోలి**




**మానవులకు ప్రత్యామ్నాయంగా వారి స్థానాన్ని భర్తీ చేసేందుకే కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అనే సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించారంటూ జనంలో ఒక అపార్థం నెలకొన్నదని, అయితే, ఈ సాంకేతిక పరిజ్ఞానం మన జీవితాలకు సహాయ పడేందుకేనని, మననైపుణ్యాలు, సామర్థ్యాలు ఇనుమడింప జేయడానికేనని ఇండో కెనేడియన్ రచయిత, కంప్యూటర్ శాస్త్రవేత్త అయిన తన్మయి బక్షి చెబుతున్నారు. 2035 వ సంవత్సరం నాటికి 957 బిలియన్ల అమెరికన్ దాలర్ల సంపదను భారతీయ ఆర్థిక రంగానికి చేకూర్చ గలిగే సత్తా కృత్రిమ మేధస్సు రంగానికి ఉందని.**


అది నేషనల్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ వారి సమావేశం. ఒక మహిళ హుందాగా తన సందేశం ఇవ్వడానికి పోడియం వద్దకు వస్తున్నది. ఇంతలో ఒక వ్యక్తి అడిగాడు, “మేడమ్, మీరు కట్టుకున్న చీర ఏరంగో తెలుసా?” అని. ఆవిడ తెల్లమొహం వేసింది. వెంటనే తన స్మార్ట్ ఫోన్ బయటకు తీసి వేలితో టచ్ చేసింది. అంతే! ఆవిడ కట్టుకున్న చీర రంగు, నేత వివరాలు మొత్తం స్పీకర్‌లో వినబడ సాగింది. ఇదీ కృత్రిమ మేధస్సు అంటే. అంధులకు పూర్తి చూపును అందివ్వగలది. దృష్టి అనే ఒక స్వచ్ఛంద సంస్థ ఈ రంగంలో చురుకుగా ఉన్నది. అల్జీమీర్స్ వ్యాధిగురించి చాలామందికి తెలిసే ఉంటుంది. మెదడుపై తీవ్ర ప్రభావాన్ని చూపే ఈ వ్యాధితో నేడు దేశంలో 04 మిలియన్లకు పైగా బాధపడుతున్నారు. National Brain Research Centre (NBRC), and Neuro-imaging and Neuro-spectroscopy Laboratory (NINS) లు ఈ కృత్రిమ మేధస్సును వినియోగిస్తూ వ్యాధి నివారణకు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. అంతెందుకు, ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ వినియోగించిన కుర్చీని ఆ సమయంలోనే కృత్రిమ మేధస్సుతో రూపొందించారు. ఇది కృత్రిమ మేధస్సు యుగం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ.ఐ.) గా ఆంగ్లభాషలో వ్యవహ రించే కృత్రిమమేధస్సురంగం, ప్రయోగాత్మక స్థాయి నుంచి ఎంతో దూరం ప్రయాణించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రగతిని సాధించింది. ప్రైవేటు రంగంలో సాగే వివిధ వ్యవహారాల నుంచి, ప్రభుత్వాల కార్య కలాపాల వరకూ కృత్రిమ మేధస్సు వైపు ఎంతో భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. 2035 వ సంవత్సరం నాటికి 957 బిలియన్ల అమెరికన్ డాలర్ల సంపదను భారతీయ ఆర్థిక రంగానికి చేకూర్చ గలిగే సత్తా కృత్రిమ మేధస్సు రంగానికి ఉందని, ఇది ప్రస్తుతం ఆర్థికరంగం లో ఉత్పత్తి అయ్యే సరుకుల, సేవలకు సంబంధించిన మొత్తం విలువలో 15 శాతానికి సమానమని అక్సెంచర్ అనే సంస్థ నిర్వహించిన అధ్యయనం పేర్కొంది. ఈ నేపథ్యంలో విధాన నిర్ణయ కర్తలు, వాణిజ్య రంగంలో ప్రముఖ నేతలు ఈ అవకాశాన్ని జార విడుచు కోకుండా ఉండేందుకు, కృత్రిమ మేధస్సు విప్లవం కోసం తప్పని సరిగా సంసిద్ధం కావాలని, అందు కోసమే కృషి చేయాలని అధ్యయనం సూచిస్తోంది. మనం చేసే ఉద్యోగం, దైనందిన కార్యకలాపాలు, ఇతర కార్యకలాపాలు చేసేందుకు మానవులకు ప్రత్యామ్నాయంగా వారి స్థానాన్ని భర్తీ చేసేందుకే కృత్రిమ మేధస్సు

సీనియర్ ఎనలిస్ట్, నాలెడ్జి మేనేజిమెంట్, డెలాయిట్ సంస్థ, హైదరాబాద్.
E-mail : parimaltamboli12@gmail.com

(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అనే సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించారంటూ జనంలో ఒక అపార్థం నెలకొన్నదని, అయితే, ఈ సాంకేతిక పరిజ్ఞానం మన జీవితాలకు సహాయం పడేందుకేనని, మననైపుణ్యాలు, సామర్థ్యాలు ఇనుమడింప జేయడానికేనని ఇండో కెనెడియన్ రచయిత, కంప్యూటర్ శాస్త్రవేత్త అయిన తన్మయి బక్షి చెబుతున్నారు.

''ఆదిమ మానవుడి జీవితంలో సమూలమైన మార్పును తీసుకువచ్చిన ఆవిష్కరణ లాగా, రవాణా సదుపాయాలను మానవాళికి సముపార్జించి పెట్టిన చక్రం ఆవిష్కరణ లాగా ఇది మరో ఆవిష్కరణ కాదా?, మానవ సామర్థ్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు, మన జీవితంలో సౌకర్యాలను మరింతగా పెంచేందుకు కృత్రిమ మేధస్సు తగిన భరోసా నిస్తుంది. కృత్రిమ మేధస్సును ప్రజలు రక రకాలుగా అర్థం చేసుకుంటున్నారు. అసలు కృత్రిమ మేధస్సును అర్థం చేసుకునే ఉత్తమ మార్గాన్ని నేను వివరిస్తాను. జ్ఞానాన్ని సముపార్జించి, అర్థం చేసుకుని, దాన్ని జీవితానికి వర్తింప జేసుకునే ప్రక్రియగా కృత్రిమ మేధస్సును నేను అభివర్ణిస్తాను. ప్రాథమికంగా మనం ఇక్కడో విషయం అర్థం చేసుకోవాలి. మానవ మేధస్సులో చోటుచేసుకునే ప్రక్రియ లాంటిదే యంత్రంలో అంతర్లీనంగా జరుగుతుందని తెలుసుకోవాలి అని ఆయన అన్నారు. తామే అగ్రరాజ్యంగా, సూపర్ పవర్‌గా రూపొందాలంటూ ప్రపంచంలోని అన్నిదేశాలూ పోటీ పడుతున్నాయి. అయితే, అగ్ర రాజ్యంగా ఎదగడం అంటే సైనిక పాటవం పెంచుకోవడం మాత్రమే కాదు. అంతకు మించిన సామర్థ్యాలెన్నో సొంతం చేసుకోవలసి ఉంటుంది. అయితే ఇప్పటికే ప్రపంచంలో చైనా కృత్రిమ మేధస్సుతో రక్షణ రంగాన్ని తీర్చిదిద్దటంలో ఎంతో ముందు ఉన్నది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, ఐరోపాలు కూడ ఈ కృత్రిమ మేధస్సును వినియోగించడంలో ముందున్నాయి. మన దేశం కూడ ఇటీవల రక్షణరంగంలో కృత్రిమ మేధస్సుతో మానవ రహిత యుద్ధ టాంకులను, విమానాలనూ నడపడానికి కసరత్తు చేస్తున్నది. భవితను తీర్చిదిద్దే సాంకేతిక పరిజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి వంటివి సూపర్ పవర్ హోదా సాధనకు అత్యంత ఆవశ్యకమైన అంశాలుగా మారిపోయాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా, కాబోయే సూపర్ పవర్‌గా ఎదిగేసత్తా, సామర్థ్యం భారత దేశానికి ఉంది. దక్షిణాసియాలో మంచి పోటీ తత్వంతో దూసుకెళ్లే దేశాల్లో ఒకటిగా భారతదేశానికి పేరున్నా, మనం ఇంకా మరెంతో ప్రగతిని సాధించవలసి ఉంది. మన పొరుగు దేశమైన చైనా కంటే బాగా వెనుకబడి ఉన్నాం. ఉదాహరణకు... పరిశోధన, అభివృద్ధి రంగాన్ని తీసుకుంటే,... చైనా తన స్థూల స్వదేశీ ఉత్పాదనలో 2 శాతాన్ని పరిశోధన రంగంపై ఖర్చు పెడుతుండగా, భారతదేశం కేవలం 0.6 శాతం మాత్రమే ఖర్చు పెడుతోంది. మన దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణంతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ. కృత్రిమ మేధస్సు సత్తాను, సామర్థ్యాన్ని తెలుసు కునేందుకు దేశంలోని విధాన నిర్ణయకర్తలు, విశ్వ విద్యాలయాలు, కార్పొరేషన్లు, ఔత్సాహిక వాణిజ్యవేత్తలు, కార్మికులు ఇలా అన్ని వర్గాల వారూ ముందుకు రావలసిన అవసరం ఉంది. అభివృద్ధి కోణంలో పరిశీలించి నపుడు **ఆర్థిక పెరుగుదలకు, అభివృద్ధికి సమానమైన ఉత్ప్రేరకంగా పనిచేసే సామర్థ్యం కృత్రిమ మేధస్సు రంగానికి ఉంది. వృద్ధిని, లాభదాయకతను ఇనుమడింపజేసి, లోపభూయిష్టమైన యంత్రాలను, యాంత్రిక లోపాలను తొలగించడంతో పాటు సామర్థ్యాన్ని పెంచి వాణిజ్యంలో గుణాత్మ మార్పును తెచ్చే శక్తి కూడా కృత్రిమ మేధస్సుకు ఉంది.** దాదాపు దశాబ్దం కిందట ప్రారంభించిన ఫ్లిప్ కార్ట్ వంటి భారతీయ కంపెనీలు తమ సామర్థ్యాన్ని పెంచు కోవడానికి, వినియోగదారులకు అందించే ఉత్పాదనల ధరలను తగ్గించడానికి అమెజాన్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలతో పోటీపడి, నిలదొక్కు కోవడానికి కృత్రిమ మేధస్సే వీలు కలిగించింది. కృత్రిమ మేధస్సు ప్రజా భద్రతను మెరుగు పరచడంతో పాటుగా, మన జీవితాలను కాపాడగలదు కూడ. రైళ్లలో ప్రయాణాన్ని మరింత సురక్షితం చేసేందుకు కావలసిన భద్రతా వ్యవస్థను రూపొందించేందుకు భారతీయ రైల్వే శాఖ, రైల్ టెల్ సంస్థ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)తో కలిసి పనిచేస్తున్నాయి. ఇందుకోసం కృత్రిమ మేధస్సును, కంప్యూటర్ గణాంకాలనూ వినియోగిస్తున్నారు. డాక్టర్లు, ఆరోగ్య రక్షణ సంస్థలు కూడా కృత్రిమ మేధస్సును ఆశ్రయిస్తున్నారు. రోగ నిర్ధారణ ప్రక్రియలో మెరుగైన ఫలితాలను అందించ గలిగే కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యతను, దీనితో రూపొందించిన చికిత్సా పద్ధతుల ప్రత్యేకతను దేశంలోని డాక్టర్లు ఇప్పటికే గుర్తించారు. ఉదాహరణకు బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో కేన్సర్ నిరోధం, వ్యాధినిర్ధారణ, చికిత్స ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఐ.బి.ఎం. వారి వాట్సన్ అనే కంప్యూటర్ వ్యవస్థను వినియోగిస్తున్నారు. అలాగే, బెంగళూరు నగరంలోని కొలంబియా–ఆసియా ఆసుపత్రిలో పలు రకాల గుండె జబ్బుల నిర్ధారణ, చికిత్సా పద్ధతుల్లో కృత్రిమ మేధస్సు ఆధారంగా రూపొందిన కార్డియోట్రాక్ అనే కంప్యూటర్ వ్యవస్థను వినియోగిస్తున్నారు. కృత్రిమ మేధస్సును వినియోగించడం ద్వారా మరింత వేగవంతమైన, విస్తృతమైన అభివృద్ధిని సాధించాలంటే,.. కృత్రిమ మేధస్సు అనే భావనను మనదేశం సంపూర్ణ స్థాయిలో, సమతుల్యమైన పద్ధతిలో అనుసరించ వలసి ఉంది. కృత్రిమ మేధస్సుతో కూడిన వ్యవస్థలకు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు ప్రయోగ క్షేత్రాల వంటివి. ప్రముఖ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు తమ సృజనాత్మక ఆలోచనలను, భావనలను కొత్త నైపుణ్యాలుగా తీర్చిదిద్దు కునేందుకు ఒక సానుకూలమైన వేదికను విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు కల్పిస్తాయి. 2016లో దేశం 26 లక్షల మంది నిపుణులైన గ్రాడ్యుయేట్లను తయారు చేసింది. విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం,

ఇంజినీరింగ్, గణితశాస్త్ర నైపుణ్యాలకు సంబంధించిన ఈ గ్రాడ్యుయేట్లే కృత్రిమ మేధస్సు నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. పలు రంగాల నిపుణులతో కూడిన ఈ కొత్త ప్రతిభా విభాగమే దేశంలో సృజనాత్మక ఆవిష్కరణలకు ఒకగొప్ప వనరుగా ఉపయోగ పడింది.




**అంకుర కంపెనీలు:**

2016 లెక్కల ప్రకారం కృత్రిమ మేధస్సు ఆధారంగా రూపొందిన అంకుర కంపెనీల రీత్యా చూస్తే, అభివృద్ధి చెందిన 20 దేశాల బృందంలో భారత్ మూడవ స్థానం ఆక్రమించింది. దేశంలో కృత్రిమ మేధస్సు ఆధారిత అంకుర కంపెనీలు 2011 నుంచి పెరుగుతూవస్తున్నాయి. సంవత్సరానికి ఏకంగా 86 శాతం వృద్ధి రేటుతో ఈ కంపెనీలు పెరిగాయి. ప్రపంచ సగటు వృద్ధి రేటు కంటే ఇది చాలా ఎక్కువ. అయితే, అమెరికా, చైనా దేశాలతో పోల్చుకుంటే, కృత్రిమ మేధస్సు ఆధారిత కంపెనీలకు మనదేశంలో అందించే ఆర్థిక సహాయం చాలా తక్కువగా ఉంది. కృత్రిమ మేధస్సుకు సంబంధించిన పరిశోధన, అభివృద్ధి రంగాల్లో పెట్టుబడి పెట్టేందుకు, కావలసిన ఆర్థిక పరిపుష్టి, వాణిజ్య అనుభవం పెద్ద కంపెనీలకు ఉంటుంది. అందు వల్లనే అవి సృజనాత్మక ఆవిష్కరణల్లో ముందుండే అవకాశం ఉంది. ఈ కోణంలో ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పరిణామాలకు అనుగుణంగా దేశంలోని డిజిటల్ పరిజ్ఞాన సంస్థలు కూడా మరింత వేగంగా కృత్రిమ మేధస్సు భావనను అనుసరిస్తున్నాయి. ఇక, ట్రాఫిక్ కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు ఓలా కంపెనీ ప్రత్యేక నైపుణ్యాన్ని వినియోగిస్తోంది. అధునాతన ఫ్యాషన్లకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు, పూర్తిగా యాంత్రీకరించిన వస్త్ర ధారణను ఆవిష్కరించేందుకు మింత్రా (Myntra) సంస్థ కృత్రిమ మేధస్సునే వినియోగిస్తోంది. మానవ ప్రమేయం కలిగిన డిజైనర్ జోక్యం అవసరం లేకుండానే మింత్రా సంస్థ కృత్రిమ మేధస్సు పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. లావా దేవీల్లో అక్రమాలను పసిగట్టి, వాటిని నిరోధించేందుకు PayTM కృత్రిమ మేధస్సు ఆధారిత కంప్యూటర్లనే వినియోగిస్తోంది. కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంలోని తాజా పరిణామాల ఆధారంగా వినియోగదారులకు తగిన సూచనలు అందిస్తోంది.

**విధాన రూపకల్పన - ప్రభుత్వ పాలన:**

ప్రభుత్వం ఓ వైపు కృత్రిమ మేధస్సు వంటి ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూనే, సమాజంపై కృత్రిమ మేధస్సు ప్రభావాన్ని నియంత్రించడ మనే బాధ్యతను కూడా భరించవలసి వస్తోంది. 2018 ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రిబడ్జెట్ ప్రసంగం చేస్తూ, కృత్రిమ మేధస్సు రంగానికి ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహంపై వివరించారు. కృత్రిమ మేధస్సుపై పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే జాతీయ స్థాయి కార్యక్రమానికి ప్రభుత్వ యంత్రాంగంలోని మేధావి వర్గం, నీతి ఆయోగ్ కూడ నేతృత్వం వహించనున్నట్టు చెప్పారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపులు కూడా ఇదే ఉద్దేశాన్ని ప్రతి ఫలించాయి. కృత్రిమ మేధస్సు, కంప్యూటరైజ్డ్, త్రీ-డి ప్రింటింగ్, తదితర సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు డిజిటటల్ ఇండియా కార్యక్రమానికి బడ్జెట్లో కేటాయింపును ఈ ఏడాది దాదాపు రెట్టింపు చేస్తూ, రూ. 3,073 కోట్లు (47.7 కోట్ల డాలర్లు) కేటాయించారు. దేశ వ్యాప్తంగా చేపట్టే వివిధ రకాల డిజిటల్ కార్యక్రమాలపై ప్రచారానికి ముఖ్య కార్య నిర్వహణాధికారి అమితాబ్ కాంత్ నేతృత్వంలో నీతి ఆయోగ్ పనిచేస్తోంది. భారీ ఎత్తున చేపట్టిన బయోమెట్రిక్ కార్యక్రమం, ఆధార్, ఇండియా-చైనా ప్రాజెక్టులు ఈ

కోవలోకే వస్తాయి. దేశ జనాభా వివరాల సమాచారాన్ని డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంలోకి మార్చే ఇండియా స్టాక్ కార్యక్రమానికి మౌలిక వేదికగా ఇండియా చైన్ పథకాన్ని చేపట్టారు. అందువల్ల, కృత్రిమ మేధస్సు వినియోగంతో సాంకేతిక పరిజ్ఞాన సంస్థలన్నీ మరింత బలోపేతంగా తయార య్యాయి. కృత్రిమ మేధస్సు పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ప్రతిభా కేంద్రాల (సెంటర్స్ఆఫ్ఎక్సలెన్స్-సి.ఒ.ఇ.ఎస్.) ఏర్పాటుకు ప్రభుత్వ అధీనంలోని విజ్ఞాన శాస్త్ర విభాగం సంసిద్ధమైంది. అలాగే,... పరిశోధన, శిక్షణ, డిజిటల్ పరిజ్ఞానం తయారీలో నైపుణ్యం, అభివృద్ధి, డాటా విశ్లేషణ, క్వాంటమ్ కమ్యునికేషన్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఒ.టి.) వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కూడా కేంద్ర విజ్ఞాన శాస్త్ర విభాగం సంసిద్ధమైంది. కృత్రిమ మేధస్సు సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు భారత్ సమతుల్యమైన పద్ధతిలో ముందుకు సాగవలసి ఉంటుంది. వినూత్న ఆవిష్కరణను, జాతీయ అభివృద్ధిని ముందుకు నడిపించేందుకు ప్రైవేటురంగం, ప్రభుత్వం చేయి, చేయి కలిపి నడవలసి ఉంటుంది. కృత్రిమ మేధస్సు వినియోగంతో నైతిక పరమైన ఇబ్బందులు, సైబర్ భద్రత, చివరకు ఉద్యోగ భద్రతా పరమైన ముప్పు తలెత్త వచ్చున్న చర్చ, ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ఈ కారణాలతో దేశంలో కృత్రిమ మేధస్సు అభివృద్ధి, విస్తృతికి అడ్డంకులు కలగడానికి అవకాశం ఇవ్వరాదు. ఇదే జరిగితే, మనం మరింత పెద్ద ముప్పును ఎదుర్కొనే అవకాశంఉంది. మనదేశంపై, ప్రపంచంపై కృత్రిమ మేధస్సు ఎలాంటి ప్రతికూల ప్రభావాన్ని చూపగలదన్న అంశంపై అనేక అధ్యయనాలు, అంచనాలు ఉన్నప్పటికీ, ఇలాంటి సమస్యలన్నిం టికీ పరిష్కారాలను రూపొందించే అంశంపై కూడా ఆవిష్కరణకర్తలు, నిపుణులు తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ఉదాహరణకు కృత్రిమ మేధస్సు వినియోగంతో ఉద్యోగాలు పోతాయని జనంలో సాధారణంగా ఉన్న ఆందోళనలపై నిపుణులు వివరణ ఇస్తున్నారు. కృత్రిమ మేధస్సు పరిణామక్రమంలో జాబ్ మార్కెట్‌కు కూడా తగిన ప్రోత్సాహం లభిస్తుందని వారు భావిస్తున్నారు. జనం ఉద్యోగాలు చేసుకోవచ్చు. కృత్రిమ మేధస్సు సహాయంతో మరింత మెరుగైన సామర్థ్యంతో పని చేయవచ్చు అని వారు అంటున్నారు. మానవులు, యంత్రాల సంగమం భవిష్యత్తులో కొత్త కార్మిక శక్తిగా ఉంటుంది. ఇక బాధ్యత, భద్రత వంటి అంశాలపై తలెత్తే ఆందోళనలకు తగిన పరిష్కారాలను కనుగొనేం దుకు విధాన నిర్ణయకర్తలు, వాణిజ్య వేత్తలతో కలసి పనిచేయవలసి ఉంటుంది. కొత్త ఆవిష్కరణను ప్రోత్సహించడంతో పాటుగా, గోప్యతను, పారదర్శకతను పరిరక్షించే విధానాలను, వ్యవస్థలను రూపొందించేందుకు వారు కృషి చేయవలసి ఉంటుంది. ఈవిధంగా సగటు భారతీయ పౌరుడి జీవితాన్ని మెరుగు పరిచేందుకు కృత్రిమ మేధస్సు కచ్చితంగా దోహదం చేయగలదు. వినియోగ దారుల హక్కులను, నైతిక పద్ధతులను పరిరక్షిస్తూనే, అభివృద్ధిని, ఆవిష్కరణను ప్రోత్సహించేందుకు భారత్ కొన్ని చర్యలను తీసుకోవలసి ఉంటుంది అభివృద్ధికి లక్ష్యాలను నిర్దేశించుకోవడం, కృత్రిమ మేధస్సు దిశగా పరిశోధనను ప్రోత్సహించేందుకు పెట్టుబడులను పెంచడం, మన విద్యా ప్రణాళికలను, పాఠ్యాంశాల స్థాయిని పెంచుకుని, కృత్రిమ మేధస్సు వినియోగానికి తగినట్టుగా ఉద్యోగ, శ్రామిక శక్తిని సిద్ధం చేసుకోవడం, ఎప్పటి కప్పుడు కార్పోరేట్ శిక్షణా వ్యూహాలను మార్చుకోవడం అవసరం. చివరిగా మరోవిషయం బాధ్యతాయుతమైన కృత్రిమ మేధో విప్లవానికి మార్గదర్శక సూత్రాలను నిర్దేశించడమే కాకుండా, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించే ఒక చురుకైన నియంత్రణ వ్యవస్థను మనం ఏర్పాటు చేసుకోవలసి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధస్సు రంగంలోకి వేల కోట్ల డాలర్ల పెట్టుబడుల ప్రవాహం వచ్చి పడుతోంది. మన దేశం కూడా భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంలో పెట్టుబడులను పెట్ట వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ■

*14వ పేజీ తరువాయి...*

## 'దొడ్డి' దారి అలవాటు మాన్పిన బహుదొడ్డ కార్యక్రమం

మహిళా సాధికారికత, స్వచ్ఛతవంటి పలు మౌలిక సదుపాయాలతో ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి ఆయన బీహార్‌లో దీనిని మొదలుపెట్టారు. చంపారన్ సత్యాగ్రహ శత జయంత్యుత్సవాల ముగింపు సందర్భంగా గత ఏప్రిల్‌లో దీనిని పెద్దఎత్తున నిర్వహించారు. 'సత్యాగ్రహ నుండి స్వచ్ఛాగ్రహ" – పేరిట కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశం నలుమూలలనుంచి 10వేలమంది స్వచ్ఛాగ్రహులను రప్పించి స్థానికంగా బీహార్‌లోని మరో 10వేలమంది స్వచ్ఛా గ్రహులతో కలిపి మొత్తం అందరినీ రాష్ట్రంలోని 38 జిల్లాలకు పంపి స్వచ్ఛ ప్రచారాన్ని నిర్వహించారు. బయటి రాష్ట్రాలనుండి వచ్చి వేర్వేరు భాషలలో మాట్లాడుతూ ఇచ్చిన సందేశాలు స్థానికులను బాగా ఆకట్టుకున్నాయి.

ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్న




రాష్ట్రాలయిన బీహార్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, జమ్మూకాశ్మీర్‌లలో మార్చి 13–ఏప్రిల్ 10 మధ్య కాలంలో 30.91లక్షల మరుగుదొడ్లు అదనంగా వచ్చి చేరాయి.వీటిలో 14.82 లక్షలు కేవలం ఏప్రిల్ 4–10 మధ్యకాలంలో అవతరించడం విశేషం.

ఈ మొత్తం కార్యక్రమం ఇస్తున్న సందేశం ఒక్కటే– సంకల్పం గట్టిగా ఉండి, ప్రజల భాగస్వామ్యం తోడుగా ఉంటే..స్వచ్ఛ భారత్‌ను సాక్షాత్కరింపచేయడం సాధ్యమే. ఐక్యరాజ్య సమితి లక్ష్యమయిన పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన త్రాగునీరువంటివి కూడా ఇలాగే సాధించవచ్చని భారత్ ప్రపంచానికి ఒక నమూనాగా నిలిచి చూపుతున్నది. ■

**సామూహిక కార్యాచరణ**

# తెలంగాణలో ప్రజా ఉద్యమంగా మారిన స్వచ్ఛ భారత్ మిషన్

- తరుణ్ చక్రవర్తి




**స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రారంభించే నాటికి అమలులో ఉన్న నిర్మల్ భారత్ అభియాన్ పథకం ప్రధానంగా గ్రామీణ కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని, సంవత్సరానికి కట్టిన, కట్టవలసిన మరుగుదొడ్లను లెక్కిస్తూ సమీక్షించే పద్ధతిని అనుసరించే వారు. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభమయిన తరువాత, గ్రామాన్ని/గ్రామ పంచాయతీని యూనిట్‌గా తీసుకుని గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా ప్రకటించే వ్యూహాన్ని అమలులోకి తెచ్చారు. దీనివల్ల సంవత్సరానికి ఎన్ని గ్రామాలు బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలు (ఓడీఎఫ్)గా మారుతున్నాయో లెక్కిస్తూ సమీక్షించే వ్యూహం ప్రారంభమయింది.**

ఆగస్ట్ 15వ తేదీ, 2014 వ సంవత్సరం చారిత్రాత్మక ఎర్రకోట మీద నుండి ప్రధాన మంత్రి స్వచ్ఛభారత్ స్వప్నం గూర్చి యావత్ దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించడంతో ప్రారంభ మైన స్వచ్ఛ ఉద్యమం, బస్తీలను, వార్డులను, పంచాయతీలను, మునిసిపాలిటీలను ముంచె త్తింది. దేశంలోని ప్రగతిని కాంక్షించే ప్రజలంతా స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి స్వచ్ఛ ఉద్యమంలో పాలుపంచుకున్నారు. మొత్తం దేశాన్ని స్వచ్ఛంగా మార్చేందుకు స్వచ్ఛ దూతలై, స్వచ్ఛాగ్రాహీలై ముందుకు కదులుతున్నారు.




### స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభం.

మహాత్మ గాంధి 150 వ జయంత్యుత్సవం 2019 నాటికి మొత్తం దేశాన్ని బహిరంగ మల మూత్ర విసర్జన రహితంగా మార్చాలనే బృహదాశ యంతో త్రాగునీరు మరియు పారిశుధ్య మంత్రిత్వ శాఖ మరియు పురపాలక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో, 2014 అక్టోబర్ 02న అధికారికంగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించ బడింది. పట్టణ ప్రాంతాలలో స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్)గా, గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ)గా కార్యక్రమాలు ప్రారంభించ బడ్డాయి. కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అన్ని రాష్ట్రాలలో అప్పటికే ఉన్న నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమాలను స్వచ్ఛ భారత్ మిషన్‌గా మార్చారు. మరుగు దొడ్డి నిర్మాణానికి గతంలో ఉన్న ప్రోత్సాహక మొత్తాన్ని స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో రూ. 12,000 కు పెంచడం జరిగింది. 2011 సంవత్సరంలో జరిగిన బేస్ లైన్ సర్వే ప్రకారం దేశంలో 16.17 కోట్ల గ్రామీణ కుటుంబాలుండగా, వాటిలో 5.98 కోట్ల కుటుంబాలకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. 2014 అక్టోబర్ 02 నాటికి దేశంలో కట్టవలసిన మరుగుదొడ్లు 9.91 కోట్లు. అదే సమయానికి తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో కట్టవలసిన మరుగుదొడ్ల సంఖ్య 32 లక్షలు. తెలంగాణ రాష్ట్రంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రారంభమయ్యే నాటికి మరుగు దొడ్లు కలిగి ఉన్న గ్రామీణ ప్రాంత కుటుంబాలు 27.34 శాతం మాత్రమే.

### ప్రభుత్వ వ్యూహం

స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రారంభించే నాటికి అమలులో ఉన్న నిర్మల్ భారత్ అభియాన్ పథకం ప్రధానంగా గ్రామీణ కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని, సంవత్సరానికి కట్టిన మరియు కట్టవలసిన మరుగుదొడ్లను లెక్కిస్తూ

సమాచార విద్య ప్రచార (ఐ.ఇ.సి.) నిపుణులు, స్వచ్ఛ భారత్ & మిషన్ భగీరథ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్.
E-mail : tarun.chakravarthy@gmail.com

| మరుగుదొడ్ల వివరాలు | భారతదేశం | తెలంగాణ |
|---|---|---|
| 2011 నాటికి గ్రామీణ కుటుంబాలు | 16,17,56,051 | 43,76,787 |
| 2014 అక్టోబర్ 02 నాటికే ఉన్న మరుగుదొడ్లు | 6,25,99,592 | 11,96,614 |
| 2014 అక్టోబర్ 02 నాటికి కట్టవలసిన మరుగుదొడ్లు | 9,91,56,459 | 31,80,173 |
| 2014 నాటికి పారిశుధ్య శాతం | 38.70 | 27.34 |

సమీక్షించే పద్ధతి అనుసరించే వారు. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభమయిన తరువాత, గ్రామాన్ని/ గ్రామ పంచాయతిని యూనిట్‌గా తీసుకుని గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా ప్రకటించే సాచ్యురేషన్ వ్యూహాన్ని అమలులోకి తెచ్చారు. దీనివల్ల సంవత్సరానికి ఎన్ని గ్రామాలు బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలు (ఓడీఎఫ్)గా మారుతున్నాయో లెక్కిస్తూ సమీక్షించే వ్యూహం ప్రారంభమయింది. ఈ పద్ధతి పెద్ద ఎత్తున విజయం సాధించింది. ఈ పద్ధతిలో గ్రామాలు ఒకదాని వెనక మరొకటి వరుసగా ఓడీఎఫ్ గ్రామాలుగా మారడం ప్రారంభమయ్యింది. గ్రామంలో మరుగుదొడ్లు కట్టుకోకుండా మిగిలిపోయిన వారిపై తోటి గ్రామస్తుల వత్తిడి పెరగడం వల్ల కూడా మరుగుదొడ్ల నిర్మాణం ఊపందుకుంది. దీనికి తోడు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాఫ్ట్ వేర్ ఆధారిత చెల్లింపుల విధానంలోని పారదర్శకత ప్రజలను స్వచ్ఛ ఉద్యమంలో పాల్గొని మరుగుదొడ్లు కట్టుకుని వాడుకునేలా చేసింది.

## స్వచ్ఛ భారత్ మిషన్ అమలు – తెలంగాణ రాష్ట్ర సంస్కరణలు.

### గ్రామజ్యోతి:

కేంద్ర ప్రభుత్వం గ్రామాలను ఓడీఎఫ్ గా మార్చుతూ తద్వారా జిల్లాలను రాష్ట్రాలను ఓడీఎఫ్ గా మార్చాలనే లక్ష్యం పెట్టుకోగా, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ వ్యూహాన్ని మరికొంత మార్చి, కేంద్రం ప్రకటించిన గడువు కన్నా ఒక సంవత్సరం ముందుగానే అంటే 02 అక్టోబర్ 2018 నాటికే వంద శాతం పారిశుధ్యాన్ని సాధించాలని నిర్దేశించింది. అందులో భాగంగా ముందుగా అసెంబ్లీ నియోజకవర్గాలను బహిరంగ మల విసర్జన రహితంగా మార్చాలని, శాసన సభ్యులనే చేంజ్ ఏజెంట్‌గా చేస్తూ గ్రామ జ్యోతి కార్యక్రమాన్ని 2015 వ సంవత్సరంలో ప్రారంభించింది. గ్రామజ్యోతి కార్యక్రమం ప్రధానంగా 9 విభాగాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు నిర్దేశించినది. ఇందులో మొదటి అంశం గ్రామంలో 100 శాతం కుటుంబాలు మరుగుదొడ్డి కట్టుకుని వాడుకోవటం. గ్రామజ్యోతి కార్యక్రమం వల్ల, సిరిసిల్ల, సిద్ధిపేట, వేములవాడ, గజ్వేల్ అసెంబ్లీ నియోజక వర్గాలలోని అన్ని గ్రామాలు బహిరంగ మల విసర్జన రహితంగా మారి రాష్ట్రంలోని మిగతా గ్రామాలకు, నియోజక వర్గాలకు దిశానిర్దేశం చేసాయి. గ్రామజ్యోతి కార్యక్రమం ద్వారా మరుగుదొడ్ల నిర్మాణం విజయవంతం కావటంతో, అన్ని జిల్లాలలో గ్రామాలను సాచ్యురేషన్ పద్ధతిలో ఓడీఎఫ్ గా మార్చే కార్యక్రమం ప్రారంభమయ్యింది.

## కొత్త జిల్లాలు మరియు సాఫ్ట్ వేర్ ఆధారిత చెల్లింపులు:

త్రాగునీరు & పారిశుధ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి 2016లో ప్రారంభించిన 100 ఓడిఎఫ్ జిల్లాల కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్రంలో మరుగుదొడ్ల నిర్మాణం లో మెరుగైన పనితీరు చూపిస్తున్న 3 పాత జిల్లాలు కరీంనగర్, మెదక్ మరియు నిజామాబాద్ ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో పనులు సాగుతుండగానే, తెలంగాణా ప్రభుత్వం, జిల్లాల రీ ఆర్గనిజేషన్ చట్టం 2016 తీసుకువచ్చి పాత 10 జిల్లాలను, 31 జిల్లాలుగా ఏర్పరచడం జరిగింది. రాష్ట్రంలో కొత్త జిల్లాలలో భాగంగా ఏర్పాటైన రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా అవతరించింది. అప్పటికే విస్తృతంగా సాగుతున్న స్వచ్ఛ ఉద్యమం కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల మరియు పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ www.sbmgramin.telangana.gov.in వెబ్‌సైట్ సహాయంతో పూర్తిస్థాయిలో పాలుపంచుకోవటం వల్ల మరింత వేగంగా ముందుకు సాగింది.

## గ్రామ నీరు & పారిశుధ్య కమిటీలు

శాసన సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు, MPTC లు పంచాయతి కార్యదర్శులు అందరితో సమావేశం ఏర్పరిచి, వారి సందేహాలను తీర్చి వారి వారి గ్రామాలలో మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేసే కార్యక్రమాలను కరీంనగర్ జిల్లాలో ప్రారంభించడం జరిగింది. గ్రామ నీరు & పారిశుధ్య కమిటీలకు రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, ఆయా గ్రామాల్లో స్వచ్ఛ ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం పెరగడానికి కారణమయ్యింది. సాఫ్ట్‌వేర్ ద్వారా చెల్లింపులు కూడా గ్రామ నీరు & పారిశుధ్య కమిటీల అకౌంట్లలోకి పంపించడం కూడా స్వచ్ఛ ఉద్యమంలో స్వయం సహాయక మహిళా సంఘాలు క్రియాశీలకంగా మారడానికి దోహదపడింది. గ్రామ నీరు & పారిశుధ్య కమిటీలు క్రియాశీలకంగా మారి మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమయిన అన్నిరకాల సామాగ్రిని ఒకేసారి కొనడం తయారు చేయడం వంటి కార్యక్రమాలు లబ్దిదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించింది.

## రాష్ట్ర ప్రభుత్వ వినూత్న ఆలోచన– లబ్దిదారులకు అడ్వాన్స్ చెల్లింపు.

ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా, పరిపాలన అనుమతి పొందిన లబ్దిదారుడు, తన ఇంటి వద్ద వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవలసిన స్థలంలో స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన డిజైన్ మార్క్ అవుట్ వద్ద నిలబడి ఫోటో దిగి, ఆ ఫోటోను మండల కంప్యూటర్ సెంటర్లో సాఫ్ట్ వేర్ కు అప్ లోడ్ చేయించినట్లయితే, రాష్ట్ర ప్రభుత్వం నుండి మరుగుదొడ్డి నిర్మాణ ప్రోత్సాహక మొత్తంలో సగం డబ్బు అంటే రూ.6,000 లు గ్రామ నీరు & పారిశుధ్య కమిటీ ద్వారా లబ్దిదారుడికి అందించబడు



7తుంది. ఈ డబ్బుతో లబ్దిదారుడు నిర్మాణా నికి అవసరమైన సామాగ్రిని తెచ్చుకోవచ్చు. నిర్మాణం పూర్తయిన వెంటనే, ఫీల్డ్ అసిస్టెంట్ రెండవ ఫోటోను తీసి తిరిగి సాఫ్ట్‌వేర్‌లోకి అప్ లోడ్ చేసిన వెంటనే రెండవ దశ ప్రోత్సాహక మొత్తం అంటే మిగిలిన రూ. 6,000 లు గ్రామ నీరు & పారిశుధ్య కమిటీల ద్వారా జమ చేయడం జరుగుతుంది. ఈవిధంగా లబ్దిదారుడికి ఆర్థిక భారం తగ్గించే విధమైన చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.

**అవగాహన కార్యక్రమాలు.**


ఒకవైపు అత్యంత సరళతరమైన సాఫ్ట్‌వేర్ ఆధారిత చెల్లింపుల విధానాన్ని ప్రవేశపెట్టి, మరోవైపు గ్రామీణ ప్రాంతాల ప్రజలు పారిశుధ్య అవసరాన్ని గుర్తించేలా చేసేందుకు తద్వారా మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టేందుకు ఎన్నో రకాలైన అవగాహనా కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.

**కళాజాత - స్వచ్ఛ రథం**



తెలంగాణా రాష్ట్రంలో ప్రజలందరికి చిరపరిచితమైన జానపద కళా రూపాలను ఉపయోగించి, ప్రజలలో చైతన్యం పెంచే విధంగా కళాజాత బృందాలతో కూడిన స్వచ్ఛ రథాలను గ్రామాలకు పంపించడం జరిగింది. ఈ రథాలు కళాత్మక పద్ధతుల్లో మరుగుదొడ్ల నిర్మాణం మరియు వాడకం పట్ల అవగాహన కలిగించారు.

**వాల్ పెయింటింగ్**




గ్రామాలలో ప్రజలంతా గుమిగూడే ప్రాంతాలలో మరుగుదొడ్డి నిర్మాణం పట్ల చైతన్యం పెంచే వాల్ పెయింటింగ్ లను అన్ని జిల్లాలలో చేపట్టడం జరిగింది.

**స్వచ్ఛాగ్రాహీలు**

గ్రామంలో స్వయం సహాయక బృందాలలో క్రియాశీలకంగా ఉన్న ఒక మహిళను స్వచ్ఛాగ్రాహీగా నియమించి ఇంటింటికి తిరిగి ప్రజల సందేహాలు నివృత్తి చేసి, మరుగుదొడ్డి నిర్మాణానికి సంబంధించి అధికారులకు లబ్దిదారులకు మధ్య ఒక వారధి లాగ పనిచేసేలాగా చేయటం.

**గ్రామాలలో చైతన్యం - CLTS**

పారిశుధ్యం పట్ల చైతన్యం కలిగేందుకు CLTS (Community Led Total Sanitation) కార్యక్రమం ద్వారా గ్రామంలోనే పారిశుధ్య సమస్యను గ్రామస్తులందరూ కలిసి పరిష్కరించుకునే విధంగా అవగాహన కలుగచేసి, తద్వారా గ్రామాలను బహిరంగ మల విసర్జన రహితంగా మార్చేందుకు తోడ్పడటం. పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ (PRA) అనే సోషల్ టెక్నిక్ ద్వారా గ్రామస్తు లందరినీ ఒక్కతాటి మీదకు తేవడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం.




**వినూత్న కార్యక్రమాలు.**


* జగిత్యాల, మెదక్, మహబూబ్ నగర్ వంటి జిల్లాల్లో కేవలం కొన్ని గంటల సమయంలోనే, మొత్తం గ్రామాన్ని ఒడీఎఫ్ గా మార్చే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమాలు ఆయా జిల్లాలలోని ఇతర గ్రామాలనే కాక, రాష్ట్రంలోని ఎన్నో గ్రామాల ప్రజలను సైతం ప్రభావితం చేశాయి.
* బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలోని అందరు మహిళలతో కలసి గ్రామాన్ని స్వచ్ఛంగా చేస్తామనే సంకల్పంతో స్వచ్ఛ బతుకమ్మ పండుగను నిర్వహించుకోవడం.
* రాష్ట్రంలోని అన్ని పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు, యువతకు మరియు పంచాయతీ సర్పంచులకు స్వచ్ఛ ఉద్యమానికి, గ్రామ పారిశుధ్యానికి సంబంధించి, వ్యాస రచన, పెయింటింగ్ మరియు షార్ట్ ఫిలిం పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాల వల్ల పెద్ద ఎత్తున విద్యార్థులు యువత స్వచ్ఛ ఉద్యమంలో పాల్గొనడం జరిగింది.
* గ్రామాలలో తిరిగి యువతను గ్రామ స్వచ్ఛ ఉద్యమంలో భాగస్వామ్యం చేసేందుకు దాదాపు అన్ని జిల్లాలలో సంతకాల సేకరణ కార్యక్రమం మరియు యువతను స్వచ్ఛందంగా పాల్గొనేలా చేయడం.
* గ్రామాన్ని స్వచ్ఛంగా మార్చడమే సేవ అనే భావనతో అన్ని గ్రామాలలో, మండల కేంద్రాలలో మరియు జిల్లా కేంద్రాలలో రోడ్లను శుభ్ర పరచడం, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచడం, మంచి నీటి ట్యాంకులను శుభ్ర పరచడం,

గ్రామాలలో మరుగుదొడ్లు కట్టుకోని వారిని చైతన్యపరచడం, మురికి కాలువలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలను చేపట్టడం ప్రజల ఆలోచనా సరళిని ఎంతగానో మార్చివేసింది.

* రాత్రి వేళల్లో గ్రామస్తులంతా కలసి కొవ్వొత్తుల ర్యాలీ చేయడం ద్వారా తమ గ్రామం స్వచ్ఛ వెలుగులను విరజిమ్ముతోందని చాటి చెప్పడం. ఈ కార్యక్రమం ఎన్నో గ్రామాలలోని యువతలో ఎంతో విశ్వాసాన్ని పాదుకొల్పిందని చెప్పవచ్చు.
* వివిధ సామాజిక ఉత్సవాల సందర్భంలో, స్వచ్ఛ ఉద్యమంలో పాల్గొన్న చాంపియన్‌లను సన్మానించడం మరియు వారి విజయగాథలు అన్ని పత్రికలలో వచ్చేలా చేశారు.




కేంద్ర ప్రభుత్వం అనుమతించిన స్వచ్ఛంధ సంస్థలు యునిసెఫ్, టాటా ట్రస్ట్ వంటి వాటి సహకారం తీసుకుంటూ, ఆయా సంస్థల ప్రతినిధులను జిల్లా & రాష్ట్ర స్థాయిల్లో నియమించి, శిక్షణా మరియు ప్రచార కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఉధృతం చేసింది. రాష్ట్రం అమలు చేస్తున్న సంస్కరణల వల్ల, వినూత్న కార్యక్రమాల వల్ల, కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా చేపడుతున్న శిక్షణ & సమీక్షల వల్ల ప్రజల భాగస్వామ్యం రోజు రోజుకు పెరిగి, ఒక్క 2017-18 సంవత్సరం లోనే, మరుగుదొడ్ల నిర్మాణాలలో దాదాపు 36 శాతం పెరుగుదల నమోదయ్యింది. ప్రజల క్రియాశీలక భాగస్వామ్యం ప్రభుత్వానికి మరింత ఉత్సాహాన్ని కలుగచేసి, నిర్దేశించుకున్న గడువు 02 అక్టోబర్ 2018 నాటికి లక్ష్యాన్ని చేరతామనే భరోసాను కల్పించింది.




అంతే కాక, బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా మారిన తరువాత, గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న ఘన ద్రవ వ్యర్థ యాజమాన్య కార్యక్రమాలలో పాలుపంచుకుంటూ, తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధిలో మరో ఎత్తును చేరుకుంటున్నాయి. ద్రవ వ్యర్థ యాజమాన్య పద్ధతికి సంబంధించి, మ్యాజిక్ సోక్ పిట్ లను ప్రతీ గ్రామంలో ప్రతీ ఇంటికి తవ్వించడం జరిగింది. దీనివల్ల వ్యర్థ మురుగు నీరు గ్రామ రహదారులపై పారకుండా భూమిలోకి ఫిల్టర్ ద్వారా ఇంకిపోయి, గ్రామాలలో భూగర్భ జల మట్టం పెరగడానికి దోహదం చేస్తుంది. మ్యాజిక్ సోక్ పిట్లను తవ్వించడం, గ్రామాలలో దోమల బెడద తగ్గడానికి కారణమయ్యింది. ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రంలో ఎన్నో గ్రామాలు సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించి, ఇతర రాష్ట్రాల పర్యాటకులను, పరిశోధకులను ఆకర్షిస్తూ అభివృద్ధి మార్గంలో మైలు రాళ్ళుగా నిలుస్తున్నాయి.

తెలంగాణా స్వచ్ఛ ఉద్యమంలో ఎన్నో అవగాహనా కార్యక్రమాలు జరుగుతుండగానే, సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించిన జిల్లాలు అధికారికంగా ఓడీఎఫ్ జిల్లాలుగా ప్రకటించుకోవటం ప్రారంభమయ్యింది. ప్రస్తుతం రాష్ట్రంలో 11 జిల్లాలు 100 శాతం బహిరంగ మల విసర్జన నిర్మూలించిన జిల్లాలున్నాయి. అంతే కాక 2017 సెప్టెంబర్ నెలలో కేంద్ర పభుత్వం విడుదల చేసిన స్వచ్ఛ దర్పణ్ జిల్లా ర్యాంకింగ్స్‌లో తెలంగాణ నుండి రాజన్న సిరిసిల్ల మరియు జగిత్యాల జిల్లాలు జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకును దక్కించుకొని యావత్ తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా నిలిచాయి. ఈ విధంగా ఒక్కొక్క జిల్లా ఓడీఎఫ్ గా ప్రకటించుకోగానే మిగతా జిల్లాలు సైతం తామేం తక్కువ తినలేదంటూ, శరవేగంగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం వల్ల తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం 27 శాతం నుండి ఎగబాకి 83 శాతం కుటుంబాలకు పారిశుధ్య అవసరాలను తీర్చిన రాష్ట్రంగా మారింది.

స్వచ్ఛ ఉద్యమంలో గౌరవ శాసన సభ్యుల నుండి మొదలుకొని గ్రామస్థాయిలోని పౌరుడి దాకా అందరినీ కలుపుకుని అందరి భాగస్వామ్యంతో, 2018 అక్టోబర్ 02 నాటికి సంపూర్ణ పారిశుధ్య రాష్ట్రంగా అవతరించాలనే

■

# ప్రగతి పథంలో భారత గ్రామీణాభివృద్ధి

– డాక్టర్ పుల్లయ్య దూదేకుల




**తమిళనాడు రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన "ఉళవన్" (రైతు) యాప్ రైతులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ యాప్ లో రాయితీ పథకాల వివరాలు తెలుసు కోవడానికి, దరఖాస్తు చేసుకోవడం, పంటల బీమా, వ్యవసాయ అధికారుల వివరాలను చూసుకోవచ్చు. ఈ పథకాన్ని గత ఏప్రిల్‌లో ప్రారంభించారు. దీన్ని 70 వేల మంది పైగా రైతుల వినియోగిస్తున్నారు. 70 లక్షల మంది రైతులు సమాచారం, భూముల విస్తీర్ణం, భూసార పరిస్థితి, ఎరువులు, విత్తనాలు, బ్యాంకుల వివరాలు ఇందులోకి తీసుకొచ్చారు.**

స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి భారత దేశంలో 70 శాతం కన్నా ఎక్కువే గ్రామాల్లోనే నివసిస్తున్నారు. అసలు భారతదేశమే గ్రామాల్లో నివసిస్తుందని, గ్రామీణ ప్రజలు పేదరికం, నిరుద్యోగం, దారిద్ర్యంతో బాధపడుతున్నారని చెప్పవచ్చు. దేశాభివృద్ధి గ్రామీణాభివృద్ధి పైన, గ్రామీణాభివృద్ధి పల్లె ప్రజల ఆర్థిక అభివృద్ధిపైన ఆధారపడి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ''ప్రగతి పథంలో ఔత్సాహిక జిల్లాల రూపాంతరం'' అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రధాని ఇటీవల జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన అత్యంత వెనుకబడిన నూరు జిల్లాలను అభివృద్ధి పథాన నడపగలిగితే మొత్తం దేశం అభివృద్ధి చెందుతుంది అన్నారు. ఈ నూతన పథకం అమలుకు కేంద్ర రాష్ట్ర పథకాలను ఉమ్మడిగా అమలుచేయడం, సంబంధిత అధికారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వారు కలిసికట్టుగా గ్రామీణ పథకాల అమలును పర్యవేక్షించడం విశేషం. జిల్లా స్థాయి సంఘం కార్యక్రమ అమల గురించి ఒక నివేదిక తయారు చేసి అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా 2022 నాటికి అమలు కోసం ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తారు. దేశంలోని 115 ప్రగతిశీల జిల్లాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయ నగరం, విశాఖపట్నం, కడప జిల్లాలు ఉన్నాయి. తెలంగాణలోని భూపాలపల్లి, ఖమ్మం, కొమరంభీం జిల్లాలు ఉన్నాయి. ఈ విధంగా వెనుకబడిన జిల్లాలను ప్రగతి పథంలో నడిపించ డానికి రాజకీయ శక్తులు అడ్డులేకుండా ఉన్నప్పుడు గ్రామం అభివృద్ధి చెందుతుంది.

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థ :

### వ్యవసాయము మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ:

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత మైంది. దేశంలో 60 శాతం ప్రజలు ప్రత్యక్షంగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. గతంలోని ప్రభుత్వాలు వ్యవసాయంపైన, గ్రామీణాభివృద్ధి పైన దృష్టి పెట్టినా కోట్లాదిగా పేదలు వ్యవసాయంపైనే ఆధారపడి గ్రామీణ భారతంలో పేదరికంతో, సౌకర్యాల లేమితో సతమతం అవుతూ వచ్చారు. గ్రామీణ, సాంఘిక మౌలిక సౌకర్యాల అభివృద్ధిని సరైన విద్య, వైద్య సదుపాయాలతో బలోపేతం చేయవలసి ఉంది. దేశంలో వ్యవసాయం మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర ఆర్థికమంత్రి సరైన దిశలోనే దృష్టిపెట్టారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రధాని కలను సాకారం చేసే దిశగా

వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు, శ్రీ రామక్రిష్ణ డిగ్రీ కళాశాల [అటానమస్], నంద్యాల.
E-mail : pullaiahapril20@gmail.com

ఆర్థిక మంత్రి వ్యవసాయదారులు అత్యధిక ఫలసాయం తక్కువ పెట్టుబడితో సాధించడమే కాకుండా వాటి నుంచి అధికాదాయం సాధించడానికి అవసరమైన సహాయాన్ని అందించడంపై దృష్టి పెట్టారు. దీనికోసం రైతులకు వారు పండించిన పంటకు సరైన ధర రావాల్సి ఉంటుంది. గ్రామీణుల కొనుగోలు శక్తి పెరిగినప్పుడు మాత్రమే గ్రామీణ పారిశ్రామి కోత్పత్తి వృద్ధి బాట పట్టి GDP అధికమవు తుంది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు నూతన ఉత్తేజం తీసుకురావడం ద్వారా గ్రామీణులను ఉద్ధరించవచ్చని కేంద్రం గ్రహిం చింది. తదనుగుణంగా 2017- 18 నుంచి 2028-29 వరకు (DIDF) గ్రామీణ అభివృద్ధి నిధి ఏర్పాటుకు కేంద్రం అనుమతిం చింది. ఇదే కాకుండా వ్యవసాయ మార్కెట్ల అనుసంధానతను కూడా బలోపేతం చేయాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టి కల్పించడం గ్రామాల్లో మౌలిక వసతులను పెంపొందించడం ద్వారా వ్యవసాయానికి మరియు గ్రామీణ అభివృద్ధికి పుష్టికలుగుతుంది.

పల్లెలు దేశానికి పట్టు కొమ్మలు. గ్రామ స్వరాజ్యం సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. ఈ నినాదానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ నిర్ణయాలు మద్దతు ఇచ్చాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం ప్రాధాన్యతలుగా నిలిచాయి. దీంతో రైతుల ఆదాయం రెట్టింపై, పెట్టుబడులకు ప్రోత్సాహం కలుగుతుంది. ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టి కల్పించడం గ్రామాల్లో మౌలిక వసతులను పెంపొందించడం ద్వారా వ్యవసా యానికి మరియు గ్రామీణ అభివృద్ధికి దోహద పడుతుంది. ఈ బడ్జెట్‌లో అధిక మొత్తాన్ని గ్రామీణ ప్రాథమిక సౌకర్యాల కల్పనకు, గ్రామీణ జీవనోపాధికి కూడా కేటాయించారు. దీనివల్ల మహిళా సంఘాలకు పరపతి సౌకర్యం పెరిగింది. ఆహార తయారీ పరిశ్రమలు, పాడి-పరిశ్రమ కార్యక్రమాలకు కూడా కేటాయింపులు ఎక్కడా రాజీపడకుండా పెంచారు. దీనివల్ల గ్రామంలో అదనపు ఉపాధి కార్యక్రమాలు పెరిగి, వ్యవసాయం లాభసాటిగా అవుతుంది.

వ్యవసాయ ఉత్పత్తుల ధర-సరఫరాల్లోని వ్యత్యాసాలను తొలగించి, అందరికీ అందుబాటు లోకి తేవడానికి "ఆపరేషన్ గ్రీన్స్" పథకాన్ని ప్రకటించారు. పాడి పరిశ్రమ పథకం రీతిలోని అమలయ్యేలా ఈ పథకానికి రూ. 500 ల కోట్లు కేటాయించారు.

**డిజిటలీకరణ:**

తమిళనాడు రాష్ట్రం వ్యవసాయ శాఖ రూపొందించిన "ఉళవన్" (రైతు) యాప్ రైతులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ యాప్ రాయితీ పథకాల వివరాలు తెలుసు కోవడానికి, దరఖాస్తు చేసుకోవడం, పంటల బీమా, వ్యవసాయ అధికారుల వివరాలను చూసుకోవచ్చు. ఈ పథకాన్ని గత ఏప్రిల్‌లో ప్రారంభించిన దీన్ని 70వేల మంది పైగా రైతుల వినియోగిస్తున్నారు. 70 లక్షల మంది రైతులు సమాచారం, భూముల విస్తీర్ణం, భూసార పరిస్థితి, ఎరువులు, విత్తనాలు, బ్యాంకుల వివరాలు ఇందులోకి తీసుకొచ్చారు. దీనిని ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడ అందుబాటులోకి తెస్తే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది.

గ్రామీణ రైతులకు మేలు చేసేలా సమాచారం డిజిటలీకరణ చేసి చట్ట పరమైన నిర్ణయాలు తీసుకోవాలన్నా, రైతుకు రుణాలు ఇవ్వాలన్న, మార్కెట్ ధరలు నిర్ణయించాలన్న పంటల దిగుబడి మీద ఆధారపడి ఉంటాయని, దాన్ని కాపాడుకుంటూనే రైతుల నేపథ్యంలో సమగ్రంగా డేటా సేకరణ చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రపంచబ్యాంక్, పంట బీమా, bigdata నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆ అంచనాలకు తగ్గట్టుగా దిగుబడిని తీసుకు రావాలన్నా భూమి, వాతావరణం, ఇతర పరిస్థితుల మీద కచ్చితమైన సమాచారం అవసరం అని ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా రైతులు నమ్ముతున్న నేపథ్యంలో సమగ్రమైన డేటా వల్లే పురోగతి ఉంటుందని ప్రపంచ గ్రామీణ బ్యాంక్ వ్యవసాయ శాఖ తెలియజేసింది. ఐవోటీ, శాటిలైట్ చిత్రాల ద్వారా భూగర్భ పొరల్లో నీరు ఉందో తెలుసుకుని రైతులు సులభంగా ఒక అంచనాతో బోర్లు వేసుకునే వీలవుతుంది. "ఉగాండా" లాంటి దేశాల్లో ఖచ్చితమైన డాటా ఉండటం వల్లనే అక్కడ రైతులకు ఇచ్చే పెట్టుబడులకు షేర్ మార్కెట్‌లో పెట్టే విధానం అమలులోకి వచ్చింది. ఈ సమగ్ర డేటా వల్ల ప్రపంచవ్యాప్తంగా రైతుల పురోగతి సాధ్యమవుతుంది. ఈ సమగ్ర వివరాలు వల్ల ఎగుమతులకు ప్రోత్సాహం ఉంటుంది. లక్ష గ్రామాల డిజిటల్ అనుసంధానం, 32 కోట్ల జన్ ధన్ ఖాతాల విప్లవం, "ఈ నామ్" తో 470 వ్యవసాయ విపణులకు ఏర్పరిచిన అనుబంధం, దేశంలో ఆరు కోట్లమంది డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దే యజ్ఞం.

**సాగులో సాంకేతికత:**

దీర్ఘ కాలంలో ఆర్థిక వ్యవస్థ విస్తరణకు భారీ పెట్టుబడులు కేటాయించి శాస్త్ర సాంకేతిక విజ్ఞానాభివృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చారు. వ్యవసాయ ఉత్పాదకాలలో కీలకమైన నీటిపారుదల, విద్యుచ్ఛక్తి, భారీ పరిశ్రమలు, విద్యా వైద్య రంగాల అభివృద్ధికి కృషిచేశారు. ICAR వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణ, అభివృద్ధికి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి మేలు రకం విత్తనాలు, పంటల సంరక్షణ, పంటల దిగుబడి పెంచడానికి రసాయన ఎరువులు వాడకం, నూతన ఉత్పాదనలపై పరిశోధనలు చేపట్టి వీటిని సమాంతార కేంద్రాలుగా సమాచార బదిలీకి అవకాశం కల్పించింది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే కొత్త యోచనలు బలంగా ఉన్నాయి. 62 శాతం జనావళికి జీవికగా ఉన్న సేద్య రంగాన్ని శాస్త్ర సాంకేతికతలనే జోడెడ్లతో బడుగు రైతులకు లాభాల భరోసా ఇచ్చేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సాగిన "ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సాంకేతిక శిఖరాగ్ర సదస్సు" స్ఫూర్తిమంతంగా ముగిసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయానికి సాంకేతికతను అనుసంధానించి ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలు,సాంకేతిక ఆవిష్కరణలను పూర్తిస్థాయిలో అందిపుచ్చు

కోవాలని ఆలోచనలకు అద్దం పట్టింది. రైతులకు అవసరమైన సమాచారం అంతా వారి ఇంటి వద్దకే చేర్చాలన్న ధోరణికి కేంద్ర ప్రభుత్వం మద్దతు పలికింది. చిన్న చిన్న కమతాల రైతుల్ని బృందాలుగా ఏర్పాటు చేసి, వేల ఎకరాల్లో సామాజిక సాగును ప్రోత్సహిస్తే ఖర్చు గణనీయంగా తగ్గి భారీగా రైతులకు లాభాలు చేకూరుతుంది. వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ఆవిష్కరణలు వినియోగ అవసరాన్ని ప్రస్తావిస్తూనే మేలిమి విత్తనాల ప్రాధాన్యాన్ని ప్రపంచ సాంకేతిక దిగ్గజం బిల్ గేట్స్ సూటిగా ప్రశ్నించారు. థాయిలాండ్, మలేషియా లాంటి దేశాల్లో అధిక ఉత్పాదకత సాధ్యపడుతుందని, DNA పరిజ్ఞాన అనుసంధానాన్ని, సమ్మిళిత సమీకృత వ్యవసాయం ద్వారా ఆర్థిక ప్రగతి సాధించడానికి అవకాశం ఉన్నదని ఆ దేశాలు నొక్కి చెప్పారయి. వ్యవసాయం, గ్రామీణాభి వృద్ధి, సాగునీటి రంగాలకు ఈ ఏడాది బడ్జెట్లో ప్రధాన్యమిచ్చారు. రైతన్నల కుటుంబాల ఆదాయంపై ఆంధ్రప్రదేశ్ దేశంలో 21 స్థానంలో ఉన్న వాస్తవాన్ని గుర్తించి, అన్నదాతల రాబడి పెంపుదలకు సాంకేతిక పరిష్కారాన్ని వేగవంతం అన్వేషిస్తుతున్నది. సేద్యంలో సౌలభ్యాన్ని శాస్త్రీయతను పెంచేలా రైతుకు బాసటగా 259 కొత్త సాంకేతిక ఆవిష్కరణల ప్రదర్శనలకు విశాఖ సదస్సు వేదికైంది. రాష్ట్ర భవిష్యత్తు వ్యవసాయ ముఖ చిత్రాన్ని గుణాత్మకంగా మార్చి చొరవతో యువతరం ముందడుగు వేస్తే వ్యవసాయంలో సౌభాగ్యం సాకారమవుతుంది.

## పాడి పరిశ్రమల పాత్ర

మన దేశం పాల ఉత్పత్తిలో ముందంజలో ఉన్నది. కేంద్ర ప్రభుత్వం పాల డైరీ మౌలిక సదుపాయాల కోసం నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది ఆ పథకమే “ఆపరేషన్ ఫ్లడ్” ఈ పథకం క్రింద రూ. 10,881 కోట్లతో పాల ఉత్పత్తులకు కావలసిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ నిధిని ఖర్చుచేసి కొత్త పాల శుద్ధి కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేస్తామని కేంద్రం తెలియచేసింది. కానీ ఇంతవరకు కేంద్రాలు కొత్తగా ఏర్పాటు చేయడం లేదు ఈ విషయంలో పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం వీటిపై త్వరగా చర్య తీసుకుని అమలు చేయాలి. భారత రైతుల ఆదాయాన్ని 2022 నాటికల్లా రెట్టింపు చేయాలని లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం పెట్టుకుని అప్పుడే రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఆదాయ పరంగా పెద్ద ఎత్తున వ్యవసాయ అభివృద్ధి పథకాలను కేంద్రం ప్రకటించడం మంచిదే, కానీ అందుకు అనుగుణంగా పాడి పరిశ్రమను సైతం సమాంతరంగా ప్రోత్సహిస్తే అన్నదాతకు ఆదాయం నికరంగా పెరుగుతుంది. పాడి–పంట అనేది అనాదిగా ఉన్న నినాదం. ఇప్పుడు రైతులకు ఆదాయం అంటే పంట నుంచి మాత్రమే కాకుండా వ్యవసాయ అభివృద్ధి పథకాలపై దృష్టి పెట్టడంతో పాటు గ్రామీణ అభివృద్ధి పథకం అమలులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇటీవల “ఐరోపా సమైక్య వ్యవసాయ దృక్పథం 2017” పేరుతో విడుదల చేసిన నివేదికలో 2030 నాటికి సార్క్, ఉత్తర ఆఫ్రికా, china మరియు మధ్య ప్రాచ్యం దేశాలు ఏటా నాలుగు కోట్ల టన్నుల పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకునే స్థాయికి చేరుతాయని అంచనా వేసింది. ఈ అవకాశం భారత రైతుల ఆదాయం పెంచడానికి ఒక మంచి అవకాశంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి.

## గ్రామీణ సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమల పాత్ర

దేశ ఆర్థిక వ్యవస్థకు అభివృద్ధికి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలే కీలకం. ఈ రంగానికి గ్రామీణ ప్రాంతంలో ఉజ్వల భవిష్యత్తు ఉంది, ఇది గ్రామీణ యువతకు, మహిళా సాధికారతకు బాటలు వేస్తుంది. వీటిని తగిన విధంగా కేంద్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే సమగ్ర పారిశ్రామికీకరణ సాధ్యమవుతుంది. వ్యవసాయ పరిశ్రమ స్థిరీకరణకు గ్రామీణ ప్రాంతాల్లో వాతావరణ సమతుల్య స్థితి సానుకూలంగా ఉండాలన్న వాస్తవాన్ని కేంద్ర బడ్జెట్ ఎటువంటి సందేహం లేకుండా గుర్తించింది. దీర్ఘకాలిక సాగునీటి నిధికి తొలి కార్పస్‌గా 20 వేల కోట్లను ఇదివరకే ప్రకటించిన కేంద్రం ఈ పథకాలను కొనసాగించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు గత సంవత్సరం కన్నా ప్రస్తుత సంవత్సరం 28 శాతం పెంచారు. వ్యవసాయం, వ్యవసాయేతర ఆదాయాన్ని పెంచడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు స్వల్ప వ్యవధిలో ఫలితాలు సాధించడానికి వీలుగా నిధుల కేటాయింపు జరిగింది.

ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో ఉద్యోగా వకాశాల సృష్టి, ఉద్యోగిత కల్పనకు ప్రాధాన్యత లభించింది. దేశంలో ఉద్యోగ కల్పన కోసం గత మూడేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన ఎన్నో కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కల్పనను ప్రోత్సహిస్తున్నాయి. ఉద్యోగాల కల్పనలో ప్రధానంగా ఆసియా ఖండం అందులోనూ భారతదేశం కీలక పాత్రని తాజా నివేదికలో వెల్లడించింది. భారత స్థూల దేశీయ ఉత్పత్తి వృద్ధిరేటు 5.7 శాతం నుంచి 6.3 శాతానికి చేరినది. GDP లో చిన్న పరిశ్రమల పాట 45 శాతంగా ఉండటం సూక్ష్మ, చిన్న తరహా సంస్థలకున్న ప్రాధాన్యతను వెల్లడిస్తోంది. ముఖ్యంగా ముద్రా రుణాలు, MSME లకు చేయుత, నైపుణ్య శిక్షణ కేంద్రాలు కూడా అభివృద్ధి ఉపాధికి అద్దం పడుతు న్నాయి. పారిశ్రామిక రంగంలో వెనుకంజలో ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు సైతం ఇప్పుడు చిన్నతరహా పరిశ్రమలపై దృష్టి సారించాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న పరిశ్రమలకు పెద్ద ఎత్తున రాయితీలు, ప్రోత్సాహాలు కల్పిస్తున్నాయి. గ్రామీణ ఉపాధి, సేవారంగాలతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు భారీగా ఏర్పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం సాంకేతిక కేంద్ర విధాన కార్యక్రమం క్రింద నైపుణ్య శిక్షణకు కొత్త పరిశ్రమల స్థాపనకు తోడ్పడుతున్నది. దేశవ్యాప్తంగా 600 జిల్లాల్లో సాంకేతిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. చిన్న తరహా

పరిశ్రమల రంగంలో గిరిజనులకు, దళితులకు ప్రత్యేక ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. సాధారణ సబ్సిడీ పథకాలు కన్నా 15 శాతం సబ్సిడీని కల్పించి, వారి కోసం ప్రత్యేక మార్కెటింగ్ పథకాలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంక్యుబేషన్, t-hub కేంద్రాల ద్వారా అంకుర పరిశ్రమలకు పెద్ద ఎత్తున మద్దతు కల్పించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా చిన్న పరిశ్రమలకు ప్రత్యేక పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు గ్రామీణ ప్రాంతంలో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయడానికి భారీ ఎత్తున ప్రోత్సాహకాలు అందించారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతములో పాల ఉత్పత్తి పెంపునకు దోహదపడిన ఆపరేషన్ ఫ్లడ్ తరహాలో దీనిని చేపడతామని చెప్పారు. "ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్" లను ప్రోత్సహించేందుకు ఆయా ఉత్పత్తుల నిల్వ, రవాణా, ప్రాసెసింగ్ నిర్వహణల కోసం స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అన్ని రకాల స్థానిక సంఘాలకు మౌలిక వనరులు కల్పించే కీలక కేంద్రంగా పంచాయతీని విస్తరించాలి. స్థానిక సంస్థల ద్వారా వివిధ సేవలను వనరులను వ్యక్తులకు బదలాయించే క్రమంలో స్థానికతను మెరుగ్గా వినియోగించుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల వద్ద పౌరుల వివరాలు ఇప్పటికే నమోదై ఉన్నాయి. ప్రభుత్వాలు సామాజిక ఆర్థిక సర్వేలు నిర్వహించి నేపథ్యంలో స్థానికంగా పౌరులకు సేవల, వనరుల బదలాయింపును పారదర్శక ముగా ప్రభావవంతంగా జరపడం అసాధ్యమేమి కాదు. ప్రతి విభాగానికి ఒక వెబ్‌సైటును నిర్వహిస్తూ జరిగిన పనులకు సంబంధించిన రసీదులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతూ, లబ్ధిపొందిన, పొందవలసిన పౌరుల వివరాలను నిరంతరం నమోదు చేయ గలిగితే పాలన పారదర్శకంగా కొనసాగుతుంది.

**గ్రామీణ రుణాలు :**

కేంద్ర బడ్జెట్‌లో వ్యవస్థీకృత రుణాల పరిమాణాన్ని పది లక్షల కోట్ల రూపాయల నుంచి 11 లక్షల కోట్లకు పెంచారు. ఇది అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 10 శాతం అధికం తదనుగుణంగా సరిపడా నిధులను కూడా ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. కౌలు రైతులకు సైతం రుణ సదుపాయం కల్పించేందుకు కట్టుబడి ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ఉద్దేశాలు ప్రశంసించదగినవే! దేశవ్యాప్తంగా 40.5 శాతం కౌలు రైతులు, మరియు 52.1 శాతం సన్నకారు రైతులు, 30.8 శాతం మంది చిన్న రైతులు ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు రుణాలు తీసుకున్నట్లు ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తు న్నాయి. కాబట్టి రిజర్వ్ బ్యాంకు, జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు లతో కలిసి దేశంలో విస్తృత స్థాయిలో బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చి సమ్మిళిత ద్రవ్య సేవల విస్తరణకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నది. స్వయం సహాయక బృందాలు, బిజినెస్ కరస్పాండెంట్, బ్యాంక్ లింకేజీ, సేవలను వినియోగించుకోవడం, వినియోగదారుల గురించి వివరాలు తెలిపే కేవైసీ నిబంధనలు సరళతరం, ఎలక్ట్రానిక్ విధానం ద్వారా లబ్ధిదారులకు నగదు బదిలీ, మొబైల్ టెక్నాలజీ వినియోగం ద్రవ్య పరమైన అంశాలకు సంబంధించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ, క్రెడిట్ కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు, జాతీయ పెన్షన్ పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆధార్ పథకం వంటి వాటిని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ బ్యాంకింగ్ సదుపాయం గ్రామీణ ప్రాంతంలో అందుకుంటున్న వారి సంఖ్య చాలా తక్కువగానే ఉన్నది. అందువల్ల ప్రతి కుటుంబానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్ ధన్ యోజనను తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతంలో ఈ రుణాలను అందించడంలో అసంఘటిత రంగం ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది, అసంఘటిత రంగం పాత్ర ను తగ్గించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంక్ సేవలను విస్తరించి, ప్రజలకు కావలసిన రుణ సదుపాయాలను తక్కువ వడ్డీకి ప్రోత్సహించి తగిన రుణ సదుపాయాన్ని అందించవలెను. 2015 నాటికి ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకం కింద దేశంలోని 95 శాతం కుటుంబాలకు బ్యాంకు ఖాతాలను విజయవంతంగా సమకూర్చ గలిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయదారులకు "రైతు బంధు" ను ప్రారంభించింది. ఈ పథకం ప్రతి సంవత్సరం పూనాస, యాసంగి (ఖరీఫ్, రబీ) పంటల కాలంలో ప్రతి రైతుకు నేరుగా ఎకరానికి ఎనిమిది వేల రూపాయల వంతున పెట్టుబడిని అందిస్తున్నది. గ్రామీణ ప్రాంతంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న పేదలకు వృద్ధాప్యంలో ఆదాయ భద్రత కల్పించే విధంగా అటల్ పెన్షన్ యోజన వీలు కల్పిస్తున్నది.

**స్థానిక సంస్థల పాత్ర:**

ప్రజాస్వామిక వ్యవస్థలో స్థానిక ప్రభుత్వాలు అత్యంత ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ స్థానిక ప్రభుత్వాల ద్వారా సాధ్యమవుతుంది. స్థానిక సంస్థలు అనేవి భారతదేశంలో అతి ప్రాచీన కాలం నుంచి పనిచేస్తున్నాయి. 1882లో లార్డ్ రిప్పన్ కాలంలో చేసిన తీర్మానాలను స్థానిక స్వపరిపాలన సంస్థల పట్ల మాగ్నాకార్టాగా అభివర్ణించారు. అందుకే లార్డ్ రిప్పన్‌ను "స్థానిక సంస్థల పితామహుడిగా" పేర్కొంటారు. 14వ ఆర్థిక సంఘం కేటాయింపులు మరోసారి కొత్త ఆశలను రేకెత్తించాయి, ఈ సంఘం గ్రామ పంచాయతీలకు 20,292 కోట్ల రూపాయలు కేటాయించింది. దీనికి 2015-2020 సంవత్సరం మధ్యకాలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను జత చేస్తే పంచాయితీరాజ్ సంస్థలు గ్రామాభివృద్ధికి ఒక మహత్తర అవకాశం ఇచ్చినట్లు ఉంటుంది. ■

**సామాజిక ప్రగతి**

# గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కేంద్ర పథకాలు

- డా॥ ఎం. చిన్నదురై
- డా॥ కె.ఆర్. అశోక్



**కేంద్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామీణుల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడంతోపాటు, సామాజిక ప్రగతిని కూడా సాధిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మధ్య వ్యత్యాసాలను తొలగించి, గ్రామాలలో నివసించే ప్రజలందరికీ మెరుగైన మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి ఈ పథకాలు దోహదం చేస్తాయి. భారత ప్రభుత్వం చేపట్టిన వైవిధ్యభరితమైన ఈ కార్యక్రమాలతో పది సంవత్సరాల ముందు వారి ఆర్థిక పరిస్థితికి, ప్రస్తుత పరిస్థితులకు మధ్య గణనీయమైన వ్యత్యాసం కనిపిస్తున్నది.**

భారతదేశ ఆర్థిక ప్రగతికి గ్రామీణ ఆర్థికాభివృద్ధి కీలకమని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మన గ్రామాలలో ముఖ్య జీవనాధారమైన వ్యవసాయ రంగం అభివృద్ధికి అనేక పథకాలను ప్రారంభించి అమలుపరుస్తున్నది. వ్యవసాయం తోపాటు ఇతర వ్యవసాయేతర ఉపాధి పథకాలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నది. దీనికిగాను తగిన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నది. వ్యవసాయ మరియు వ్యవసాయాధారిత రంగాలలో అభివృద్ధి సూచిక గత కొన్ని సంవత్సరాలుగా హెచ్చు, తగ్గులకు లోనవుతున్నది. అభివృద్ధి సూచిక 2012-13లో 1.5 శాతంగాను, 2013-14లో 5.6 శాతంగాను నమోదవగా, 2014-15లో మైనస్ 0.2 శాతానికి పడిపోయింది. తిరిగి 2015-16 లో పుంజుకొని 0.7 శాతం అభివృద్ధి రేటుకు చేరి, 2016-17 నాటికి 4.9 శాతానికి పెరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా భారత వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. కాలక్రమేణా వ్యవసాయ రంగ స్థూల విలువ చేరిక (జి.వి.ఎ.)లో పశు పోషణ ఆదాయ వాటా పెరుగుతున్నది. వ్యవసాయ రంగం ద్వారా రైతులకు లభిస్తున్న ఆదాయం జి.వి.ఎ.లో 2011-12లో 65 శాతం కాగా ఈ ఆదాయం 2015-16 నాటికి 60 శాతానికి దిగిపోయింది. భారత వ్యవసాయంలో ఇంతవరకు వినియోగంలోనికి రాకుండా నిలిచిపోయిన వనరులను ప్రధాన వ్యవసాయ స్రవంతిలోనికి తీసుకుని రావడానికిగాను 2000లో భారత ప్రభుత్వం జాతీయ వ్యవసాయ పాలసీ ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచి, వ్యవసాయ రంగాన్ని వేగంగా అభివృద్ధి చేసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరిచే చర్యలను చేపట్టింది. వ్యవసాయాధారిత వాణిజ్యరంగాన్ని శీఘ్రగతిన అభివృద్ధిపరచి గ్రామీణులకు ఉపాధి కల్పించడానికి, వ్యవసాయ కుటుంబాలకు, వ్యవసాయ కూలీలకు ఆర్థిక పరిపుష్టి కలిగించడానికి, వారి జీవనోపాధికి భరోసా కల్పించి, పట్టణ ప్రాంతాలకు వలసలను అరికట్టడానికి, ఆర్థిక రంగ సరళీకరణ, ప్రపంచీకరణల నేపథ్యంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అనేక పథకాలను ప్రారంభించింది. ఈ నూతన పాలసీలో గ్రామీణ విద్యుదీకరణ, మార్కెట్ సదుపాయాలు, వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పి వ్యవసాయ, ఉద్యానపంటల ఉత్పత్తులకు విలువను పెంచడం,గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయేతర ఆదాయ వనరులను ప్రోత్సహించడం, తద్వారా గ్రామీణ యువతకు

సంచాలకులు, వ్యవసాయ & గ్రామీణాభివృద్ధి అధ్యయనాల కేంద్రం, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొయంబత్తూరు.
ప్రొఫెసర్, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొయంబత్తూరు. E-mail : directorcards@tnau.ac.in

ఉపాధి కల్పించడం వంటి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. గ్రామీణ భారతానికి ఆర్థిక పరిపుష్టిని కల్పించడానికిగాను కేంద్రం ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న వివిధ పథకాల సమగ్ర సమాచారాన్ని ఈ వ్యాసంలో పొందు పరచి, వివిధ పథకాల ప్రధానాంశాలను, వాటి ద్వారా ప్రస్తుత పరిస్థితులలో సాధించనున్న అభివృద్ధి అంచనాలను పేర్కొనడం జరిగింది.

### జాతీయ ఆహార భద్రతా పథకం

భారత ప్రభుత్వం 2007-08లో జాతీయ ఆహార భద్రతా పథకాన్ని ప్రవేశపెట్టి 19 రాష్ట్రాలలోని 482 జిల్లాలలో అమలు చేస్తున్నది. ఈ పథకం ద్వారా గోధుమ, బియ్యం, పప్పు ధాన్యాల ఉత్పత్తిని, దిగుబడిని దేశ వ్యాప్తంగా క్రమబద్ధంగా, ఖచ్చితంగా పెంచి ఆహార ధాన్యాల కొరతను నివారించే చర్యలు చేపట్టింది. గిరాకీని పూర్తి స్థాయిలో తీర్చడానికి గాను, ఉత్పత్తికి వినియోగానికి మధ్య ఏర్పడుతున్న వ్యత్యాసాలను తగ్గించే విధంగా, వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెడుతున్నారు. పంటలను సాగు చేయడంలో అనేక నూతన సాంకేతిక పద్ధతులను అనుసరించడంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ పథకం నిర్వహణకు 2017-18లో రూ. 521 కోట్ల నిధులను కేటాయించారు. ఈ పథకం అమలు చేస్తున్న జిల్లాలలో పంటల దిగుబడిని గణనీయంగా పెంచడం ద్వారా దేశంలో ఆహార ధాన్యాల నిల్వలను సమృద్ధి పరుస్తున్నారు. దీనితో దేశంలో గోధుమ, బియ్యం, పప్పు ధాన్యాల దిగుబడి ఇబ్బడి, ముబ్బడిగా పెరిగింది.

### రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై.)

దేశంలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలలో అభివృద్ధి సాధించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో ఆర్.కె.వి.వై. తలమానికంగా నిలిచింది. ఈ పథకాన్ని 2007-08లో ప్రవేశపెట్టారు. పంటల ఉత్పత్తిని గణనీయంగా పెంచి, రైతులకు వారి శ్రమకు తగ్గ ఫలితాన్ని అందించడమే ఈ పథకం యొక్క ప్రధాన ధ్యేయం. దీని ద్వారా వ్యవసాయ రంగంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు పెట్టే పెట్టుబడులను గణనీయంగా పెంచేలా తగిన చర్యలు చేపడతారు. ఆయా రాష్ట్రాలలోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తగిన ప్రణాళికలను రూపొందించి, అమలుపరచడం, వ్యవసాయానికి కావలసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సహజ వనరులను అందుబాటు లోనికి తేవడం, స్థానిక పరిస్థితులు, అవసరా లకు అనుగుణంగా తగిన వ్యవసాయ ప్రణాళిక లను రూపొందించడం, ఉత్పత్తి, డిమాండ్‌ల మధ్య వ్యత్యాసాలను తగ్గించడం, దీనికిగాను ప్రధాన పంటలకు పెట్టుబడులను పెంచడం వంటి కార్యక్రమాలు నిర్దేశించారు. ఈ ప్రాజెక్టుకుగాను 2017-18లో రూ. 4,750 కోట్లు నిధులను కేటాయించి, వ్యయం చేస్తున్నారు.

### ప్రధాన్‌మంత్రి ఫసల్ బీమా యోజన (ప్రధానమంత్రి పంటల బీమా పథకం)

ఈ పథకాన్ని 2016లో ప్రారంభించారు. ప్రకృతి విపత్తుల కారణంగా పంటల దిగుబడిని కోల్పోయిన రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించి, వారు తిరిగి నిలదొక్కుకునేలా చేయూతనివ్వడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. పంటల భీమా పథకాన్ని అందుబాటులోనికి తేవడం ద్వారా, రైతులకు తగిన ప్రోత్సాహాన్ని కలిగించి, నూతన వ్యవసాయ పద్ధతులను అవలంభించడం, వ్యవసాయ రంగానికి పెట్టుబడులను అందించడం జరుగుతున్నది. దేశంలోని వ్యవసాయదారులలో 26.50 శాతం మేరకు అంటే 366.64 లక్షల మందికి పంటల బీమా పథకం అమలుపరచడంతో, రూ. 1,41,339 కోట్ల బీమా మొత్తంతో 388.62 లక్షల హెక్టార్లకు పంటల బీమా లభించింది. గతంలో అమలవుతున్న పంటల బీమా పథకంలోని అనేక లోపాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వాటిని సవరిస్తూ ఈ కొత్త పథకాన్ని అమలులోనికి తెచ్చింది. నవీకరించిన ఈ పథకంతో రైతులకు బీమా విషయంలో వారికి కావలసిన అన్ని సదుపాయాలు లభిస్తాయి. ఈ పథకంలో ఆహార భద్రత, పంటలలో విస్తృత అవకాశాలు, రైతుల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయంలో పోటీతత్వం నెలకొనడంతోపాటు రైతులకు భరోసా లభిస్తుంది. ఈ పథకానికిగాను 2017- 18 ఆర్థిక సంవత్సరంలో రూ. 13,240 కోట్లు కేటాయించారు.

### జాతీయ వ్యవసాయ మార్కెట్ (నామ్)

ప్రస్తుతం దేశంలో నిర్వహిస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఎ.పి.ఎం.సి.)ల స్థానంలో, రైతుల ఉత్పత్తులకు మరింత మెరుగైన వర్తక సదుపాయాలను అందుబాటులోనికి తెచ్చే లక్ష్యంతో ఈ నూతన పథకాన్ని ప్రారంభించారు. ఇది దేశవ్యాప్తంగా లభించే ఎలక్ట్రానిక్ ఆధారిత నెట్‌వర్క్ మార్కెటింగ్. పూర్వకాలపు మండీలు ఒకదానితో మరొక దానికి సంబంధం లేకుండా ఉండేవి. కాని అన్ని వాణిజ్య కేంద్రాలను కంప్యూటర్‌ల ద్వారా అనుసంధించారు. తద్వారా మొత్తం దేశంలోని అన్ని రాష్ట్రాల రైతులకు దేశవ్యాప్త వాణిజ్య అవకాశాలు లభించాయి. "నామ్" నెట్‌వర్క్ ద్వారా సింగిల్ విండో సర్వీసులు, సమగ్ర సమాచారం రైతులందరికీ లభిస్తుంది. అన్ని రాష్ట్రాలలోను వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌ను, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వారి రాష్ట్రాలలో అమలులో ఉన్న నియమ నిబంధనల మేరకు నిర్వహిస్తారు. దీని ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను వివిధ "మార్కెట్ ఏరియా"లుగా విభజించి ప్రతి ప్రాంతాన్ని ఒక ప్రత్యేక ఎ.పి.ఎం.సి.గా పరిగణిస్తారు. ఈ కమిటీలు ఎవరికివారు తమ ప్రత్యేక నిబంధనలను, రుసుములను నిర్ణయించి ఉత్పత్తుల కొనుగోళ్లు, అమ్మకాలు కొనసా గిస్తారు. దీని వలన ఒక ప్రాంతానికి, మరొక ప్రాంతానికి ఎటువంటి సంబంధాలు లేకుండా, ధరలలోను, వాణిజ్యంలోను వ్యత్యాసాలు చోటు చేసు కొంటున్నాయి. ఈ విధమైన విభజన

వలన, ఒకే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల రైతులకు సమాన అవకాశాలు లభించడం లేదు. దీనితో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌లో దళారీ వ్యవస్థల ప్రమేయం ఎక్కువయిపోయి, రైతులకు తక్కువ ఆదాయం, వినియోగదారులకు అధిక ధరలకు ఉత్పత్తుల విక్రయం జరుగుతున్నాయి. అంతే కాకుండా డిమాండ్ ఉన్న చోటికి, డిమాండ్ తక్కువగా ఉన్న ప్రాంతం నుండి ఉత్పత్తుల రవాణా కూడా జరగడం లేదు. ఉత్పత్తులకు రుసుములు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం అమలు చేస్తున్న "నామ్" పథకంలో ఈ అవకతవకలన్నీ నిలిచిపోయి, ఆన్‌లైన్ ట్రేడింగ్ సదుపాయం వలన, దేశమంతటా ఒక సమీకృత వాణిజ్య వేదిక నెలకొన్నది. దేశవ్యాప్తంగాను, రాష్ట్రాల స్థాయిలోను సమతులమైన సమగ్ర వేదిక లభించడంతో, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు, వినియోగదారులకు మధ్య దూరం తగ్గిపోయింది. మండీల రుసుములలో వ్యత్యాసాలు లేకుండా సమానత్వం నెలకొన్నది. అమ్మకందారులు, కొనుగోలుదారుల మధ్య దళారీల వ్యవస్థ లేకపోవడంతో ధరలలో స్థిరత్వం వచ్చింది. వాణిజ్య సమాచారం అందరికీ అందుబాటులోకి రావడంతో అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మధ్య నేరుగా సంబంధాలు నెలకొన్నాయి. వేలం మార్కెట్‌లో పారదర్శకత, ధరల అదుపు, ఉత్పత్తుల లభ్యత, నాణ్యతలో గణనీయమైన మెరుగుదల, చెల్లింపులలో సౌలభ్యం, తదితర అనేక ప్రయోజనాలు సమకూరుతున్నాయి. ఈ పథకానికి 2017-18లో రూ. 200 కోట్ల నిధులు కేటాయించారు.

## భూసార పరిరక్షణ (సాయిల్ హెల్త్ మేనేజ్‌మెంట్)

వ్యవసాయాన్ని ఒక ప్రధానమైన ఆర్థిక రంగంగా గుర్తించిన కేంద్రం, మరింత మెరుగైన ఉత్పత్తులను సాధించడానికి, ఉత్పత్తుల క్రమబద్ధీకరణకు, పర్యావరణ పరిరక్షణకు, సహజ వనరుల అభివృద్ధికి, ఒక ప్రత్యేక పథకంగా నేషనల్ మిషన్ ఫర్ సస్టయినబుల్ అగ్రికల్చర్ (ఎన్.ఎమ్.ఎస్.ఏ.)ను ప్రారంభించి అమలుపరుస్తున్నది. అంతే కాకుండా వ్యవసాయంలో నీటి వినియోగాన్ని పరిమితం చేయడానికి, భూసార పరిరక్షణకు కావలసిన చర్యలు చేపడుతున్నారు. సెకండరీ, మరియు మైక్రో న్యూట్రియంట్‌లతో సహా రసాయన ఎరువుల వినియోగాన్ని అదుపు చేయడానికి, పర్యావరణహితమైన ఆర్గానిక్ ఎరువులు, బయో ఫెర్టిలైజర్ల వినియోగాన్ని ప్రోత్సహించి, భూసారాన్ని రక్షించడానికి, ఉత్పత్తులను పెంచడానికి కావలసిన సదుపాయాల వినియోగంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ న్యూట్రియంట్ మేనేజ్‌మెంట్ (ఐ.ఎన్.ఎమ్.) పద్ధతులను రైతులు అవలంభించడానికి తగిన సమాచారం అందిస్తున్నారు. భూసార పరీక్షలు, ఎరువుల నాణ్యతా పరీక్షలు నిర్వహించి, వీటి ఫలితాల ఆధారంగా రైతులకు ఆధునిక వ్యవసాయంతో సమకూరే మెరుగైన ఫలితాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్, 1985లోని నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించి ఎరువుల నాణ్యతను నిర్ధారిస్తున్నారు. భూసార పరీక్షలు, ఎరువుల పరీక్షలు నిర్వహించడానికి లేబరేటరీలు ప్రారంభించి, సిబ్బందిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను మెరుగుపరచి, వారు అందించిన సమాచారం మేరకు రైతులకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చి, ఆర్గానిక్ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ పథకం అమలు పరచడానికిగాను 2017-18లో రూ. 2,092 కోట్లు కేటాయించారు.




## ప్రధాన్‌మంత్రి కృషి సించాయీ యోజన

వ్యవసాయానికి ప్రధానమైన సాగునీటి లభ్యత, నీటిపారుదల పథకాలు, జల సంరక్షణ, నీటి సక్రమ వినియోగం తదితర అంశాలలో సమగ్రమైన చర్యలను చేపట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించి అమలు చేస్తున్నది. ఈ పథకంలో ప్రధానంగా ఈ క్రింది కార్యక్రమాలను అమలు చేస్తారు. 1) క్షేత్ర స్థాయిలో సాగునీటి పథకాల కోసం నిధుల సమీకరణ, 2) నీటి సరఫరా హామీతో వ్యవసాయ క్షేత్రాల పరిధి విస్తరణ, 3) నీటి వృధాను అరికట్టడానికిగాను మెరుగైన క్షేత్ర స్థాయి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించడం, 4) సమర్థవంతమైన నీటిపారుదల పథకాల అమలు, నీటి సంరక్షణలో ఆధునిక పరిజ్ఞాన వినియోగం (తక్కువ నీటితో ఎక్కువ సాగు), 5) నీటి వనరులను అభివృద్ధిపరచి, తద్వారా నీటి లభ్యతను పెంచడం, 6) వ్యర్థ జలాల పునర్వినియోగం కోసం తగిన సదుపాయాల కల్పన, 7) మునిసిపల్ వ్యర్థ జలాలను శుద్ధపరచి, పెరి-అర్బన్ వ్యవసాయ రంగానికి నీటి సరఫరా పెంపొందించడం, 8) నీటి పారుదల రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ఇతోధికంగా ఆకర్షించడం. ఈ ప్రాజెక్ట్ నిర్వహణకుగాను 2017-18లో రూ. 7,375 కోట్ల బడ్జెట్‌ను కేటాయించి, వ్యయం చేస్తున్నారు. గతంలో అమలులో ఉన్న ఈ క్రింది పథకాలన్నింటినీ పి.ఎమ్.కె.ఎస్.వై.లో విలీనం చేశారు. 1) నీటి వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్ (ఎ.ఐ.బి.పి.), 2) రివర్ డెవలప్‌మెంట్ అండ్ గంగా రిజువనేషన్ ప్రోగ్రామ్, 3) డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ ఆధ్వర్యంలోని ఇంటిగ్రేటెడ్ వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, 4) డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ కో-ఆపరేషన్ ఆధ్వర్యంలోని "ఆన్ ఫారమ్ వాటర్ మేనేజ్‌మెంట్" పథకం.

## పరంపరాగత్ క్రిషి వికాస్ యోజన

వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడిని పెంచడానికిగాను భూసార పరిరక్షణ, సాగునీటి

లభ్యత అంశాలకు గల ప్రాధాన్యతను గుర్తించి, వాటిని మెరుగుపరచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. గతంలో భారతదేశంలో వినియోగించిన ఆర్గానిక్ ఎరువులను తిరిగి ప్రవేశపెట్టి, వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచుకోవడానికి రైతులకు చేయూతనందిస్తారు. సామూహిక వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తారు. ఈ పద్ధతిలో కనీసం 50 మంది రైతులు సమూహంగా ఏర్పడి, ఈ గ్రూప్ ఆధ్వర్యంలో కనీసం 50 ఎకరాల భూమిలో ఆర్గానిక్ వ్యవసాయాన్ని అమలు చేస్తారు. ఈ పథకం క్రింద పదివేల సమూహాలను ఏర్పాటు చేసి, 5 లక్షల హెక్టార్ల మాగాణి భూములలో మూడు సంవత్సరాల వ్యవధిలో ఆర్గానిక్ వ్యవసాయం నిర్వహిస్తారు. ఈ ప్రాజెక్టును 2017-18 సంవత్సరంలోరూ.. 350 కోట్ల వ్యయంతో నిర్వహించారు.

## ప్రధాన్‌మంత్రి జన్‌ధన్ యోజన

సాధారణ ప్రజలకు సులువైన రీతిలో వివిధ బ్యాంకు సదుపాయాలను అందుబాటు లోనికి తేవడానికిగాను 2014లో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ జాతీయ స్థాయి పథకంలో ప్రజలందరికీ ఆర్థిక రంగంలో స్థానం కల్పించి, వివిధ ఆర్థిక పథకాలు అందిస్తారు. సాధారణ బ్యాంకింగ్, సేవింగ్ ఖాతాలు, డిపాజిట్లు, నగదు జమ, చెల్లింపులు, రుణవితరణ, బీమా, పెన్షన్ తదితర అన్ని సర్వీసులను సులువైన మార్గంలో అందుబాటులో ఉంచుతారు. దేశంలోని ఏ బ్యాంకు శాఖలోనైనా, బిజినెస్ కరస్పాండెంట్ (బ్యాంకు మిత్ర)లో గాని, ప్రజలు తమ ఖాతాలను ప్రారంభించవచ్చును. "జీరోబ్యాలెన్స్" తో ఈ ఖాతాలను బ్యాంకులు ఆమోదిస్తాయి. ఈ పథకాన్ని ప్రధానంగా పేద ప్రజల కోసం ప్రారంభించారు. బ్యాంకులలో ఖాతా లేని వారందరూ ''జీరోబ్యాలెన్స్''తో సేవలు పొందవచ్చును. ఈ పథకం ప్రవేశపెట్టిన తరువాత కేవలం ఒకటిన్నర సంవత్సరాలలోనే 21 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారు.

## దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వం 2011వ సంవత్సరంలో నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్స్ మిషన్ (ఎన్.ఆర్.ఎల్.ఎమ్.) పథకం ప్రారంభించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా ప్రారంభించిన ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 2015లో దీనదయాళ్ అంత్యోదయ యోజన పథకంగా నామకరణం చేసింది. ప్రపంచ బ్యాంకు పాక్షిక ఆర్థిక సహాయంతో, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పథకం ద్వారా గ్రామీణ నిరుపేదలకు సమర్థవంతమైన వేదికల ద్వారా పని కల్పించి వారికి జీవనోపాధిని అందిస్తారు. వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుస్తారు. దేశంలోని 600 జిల్లాలలో, ఆరు వేల బ్లాక్‌లలో, 2.5 లక్షల గ్రామ పంచాయతీలలో, ఆరు లక్షల గ్రామాలలోని ఏడుకోట్ల మంది గ్రామీణ నిరుపేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని ఒక లక్ష్యాన్ని నిర్దేశించారు. స్వయం పరిపాలిత, స్వయం సహాయ గ్రూప్‌ల ద్వారా, సమగ్ర సంస్థల ద్వారా రానున్న 8 నుండి 10 సంవత్సరాల వ్యవధిలో లక్ష్యాలను సాధిస్తారు. ఈ పథకాన్ని 2017-18లో రూ. 4,814 కోట్ల వ్యయంతో అమలు చేశారు. అంతే కాకుండా ఈ పథకంలో భాగంగా గ్రామీణ నిరుపేదలకు హక్కులను పొందడం, ప్రజాసర్వీసులను పొందడం, రిస్క్ మేనేజ్‌మెంట్, మెరుగైన సామాజిక సౌకర్యాల అంశంలో సాధికారతను సాధించడం తదితర విషయాలలో అవగాహన కల్పిస్తారు. నిరుపేదలలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడం, వారి పని సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడానికి అవసరమైన సమాచారం, నిపుణత, పరికరాలు, ఆర్థిక సహాయం సమకూర్చి, సామూహిక తత్వాన్ని, దాని ప్రయోజనాలను తెలియ పరుస్తారు. తద్వారా దేశ ఆర్థిక రంగ ప్రగతిలో వారి భాగస్వామ్యాన్ని ఒక భాగం చేస్తారు.

## రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్

దేశవ్యాప్తంగా పంచాయతీరాజ్ వ్యవస్థను



పటిష్టపరచే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. పంచాయతీల పరిపాలనలో ఎదురవుతున్న ఆటంకాలను తొలగించి, విజయవంతమయ్యేలా తోడ్పడతారు. పంచాయతీలు, గ్రామసభల సామర్థ్యాలను మెరుగుపరచి, సమర్థంగా విధులు నిర్వహించేలా ప్రోత్సహించి, ప్రజాస్వామ్యబద్ధమైన నిర్ణయాలు తీసుకొని నిర్వహించడానికి, పనులలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని కలిగిస్తారు. పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, సంస్థాగత వ్యవస్థలను పటిష్టపరచి, వారిలో పరిపాలన పట్ల అవగాహనను కలిగిస్తారు. పంచాయతీలకు జవసత్వాలు పెంపొందించి, అధికార వికేంద్రీకరణ, బాధ్యతల పంపిణీ తదితర చట్టబద్ధ చర్యలను అమలు చేస్తారు. "పెసా" చట్టం నియమ నిబంధనలు దృష్టిలో ఉంచుకొని, గ్రామ పంచాయతీల దినవారీ విధుల సక్రమ నిర్వహణకు, ప్రజల భాగస్వామ్యంతో పరిపాలన సజావుగా కొనసాగడానికి గ్రామీణ వికాసానికి పట్టు కొమ్మలైన పంచాయతీ సంస్థలలో, స్థానిక స్వపరిపాలనను నిర్వహించుకోవడానికి, పంచాయతీలు లేని ప్రాంతాలలో అందుకు తగిన స్థానిక సంస్థలను నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటారు. ఈ పథకం నిర్వహణకు రూ. 655 కోట్లు కేటాయించారు.

## మిషన్ అంత్యోదయ

గ్రామీణ ప్రజల జీవితాలను, ఉపాధి కార్యక్రమాలను సమగ్రంగా వ్యవస్థీకరించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే వివిధ ప్రత్యేక కార్యక్రమాల సమాహారమే కేంద్ర ప్రభుత్వ "మిషన్ అంత్యోదయ" పథకం. గ్రామీణ

ప్రాంతాల ప్రజలలో పేదరికాన్ని అంతం చేయడానికిగాను ఒకేసారి, వివిధ మార్గాలలో చేపట్టే బహుముఖ కార్యక్రమాలు ఈ పథకంలో ఉంటాయి. గ్రామాలను శీఘ్రగతిన అభివృద్ధి పథంలో నడిపించే ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో, సమిష్టి భాగస్వామ్య పద్ధతిలో నిర్వహించడం జరుగుతుంది. దీని ద్వారా ప్రజలకు వివిధ రకాల ఉపాధి కార్యక్రమాలను చేపడతారు. నిర్ణీత కాలవ్యవధిలో, వివిధ మార్గాల ద్వారా సహజ వనరులను వినియోగించుకొని, తగిన ఆర్థిక సహాయం, నైపుణ్యంగల ఉద్యోగుల అండదండలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఉన్నతస్థాయిలో నిలుపుతారు. 2022 నాటికి బీదరికం లేని భారతదేశాన్ని ఆవిష్కరించి, మానవ అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, పర్యావరణ అభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి వంటి వివిధ అభివృద్ధి సూచికలను ఉన్నత స్థాయికి చేర్చడమే ఈ పథకం లక్ష్యం. దేశంలోని 5 వేల గ్రామీణ ప్రాంతాలు, 50 వేల గ్రామ పంచాయతీలను, సమగ్ర అభివృద్ధి పథకాల ద్వారా బీదరికం నుండి విముక్తం చేసి, ప్రజలందరికీ ఉపాధి కల్పిస్తారు. ఈ పథకాన్ని 2017-18లో రూ. 48,000 కోట్లతో అమలు చేశారు.

**మహాత్మీగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం**

2005లో అమలులోకి వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిబంధనల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. ఆ తరువాత దీనికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా నామకరణం చేశారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రజలందరికీ ఖచ్చితమైన ఉపాధి పొందే హక్కు లభించింది. వారికి సామాజిక భద్రత కూడా చేకూరింది. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి సదుపాయాలను మెరుగుపరచి, గ్రామీణులకు ఆహార భద్రత, హామీ లభించేలా ఈ పథకాన్ని రూపొందించారు. గ్రామంలోని అన్ని కుటుంబాలలోను, ఒక కుటుంబ సభ్యునికి, అతను నైపుణ్యంతో పనిలేని కార్మికునిగా పని చేయడానికి ఇష్టపడినట్లయితే, ప్రతి ఆర్థిక సంవత్సరంలోను కనీసం వంద రోజులపాటు ఉపాధి హామీని కల్పిస్తారు. దీనికి నిర్ణయించిన మేరకు వేతనాలను చెల్లిస్తారు. ఈ పథకాన్ని ప్రధానంగా గ్రామ పంచాయతీలు అమలు చేస్తాయి. ఈ పథకంలో భాగంగా గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన, నీటిని నిలువ చేయడం, కరువు నివారణ, వరదల నష్టాన్ని నివారించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈ పథకానికి 2017-18లో గత సంవత్సరాల కన్నా అత్యధిక మొత్తంలో రూ. 48 వేల కోట్ల నిధులను కేటాయించారు. ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడానికిగాను, నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను నెలకొల్పారు. వేతనాలలో 96 శాతం మేరకు నేరుగా ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్నారు. ఈ పథకం క్రింద ప్రతి సంవత్సరం సుమారు ఒక కోటి 50 లక్షల అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. ఈ పథకంలో 2017-18లో రూ. 48 వేల కోట్ల వ్యయంతో, 2 కోట్ల పనులను నిర్వహించారు.

**ముగింపు**

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామీణుల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడంతోపాటు, సామాజిక ప్రగతిని కూడా సాధిస్తున్నారు. గ్రామీణులకు ఆర్థిక ఎదుగుదలకు కావలసిన కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా, వ్యవసాయరంగ అభివృద్ధికి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందింప చేయడానికి, వారికి మార్కెట్ సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నారు. పట్టణ-గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మధ్య వ్యత్యాసాలను తొలగించి, గ్రామాలలో నివసించే ప్రజలందరికీ మెరుగైన మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి ఈ పథకాలు దోహదం చేస్తాయి. భారత ప్రభుత్వం చేపట్టిన వైవిధ్యభరితమైన ఈ కార్యక్రమాలతో పది సంవత్సరాల ముందు వారి ఆర్థిక పరిస్థితికి, ప్రస్తుత పరిస్థితులకు మధ్య గణనీయమైన వ్యత్యాసం కనిపిస్తున్నది.

యోజన
పునరుత్తేజ భారతం
జూలై, 2018 సంచిక

# పేదలకు వరం - ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన

- బిప్లవ్ ఛటర్జీ




**ఒకవైపు ప్రతి పది మందిలో ఆరుగురికి బ్రాండెడ్ ఔషధాలు అందుబాటులో లేవు, మరోవైపు, ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు నాణ్యమైన ఔషధాలు తయారుచేస్తున్న ప్రపంచంలోని తొలి నాలుగు దేశాల జాబితాలో మన దేశం ఉంది. ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన (పిఎంబిజెపి) కారణంగా నాణ్యమైన మందుల ధరలు బాగా తగ్గడంతోపాటు సమాజంలోని పేద వర్గాలకు విరివిగా అందుబాటులోకి వచ్చాయి. ఈ పథకం కింద లభించే మందులు, బ్రాండెడ్ మందుల ధరలతో పోల్చిచూసినపుడు 50 నుంచి 90 శాతం వరకు తక్కువగా ఉన్నాయి.**

దేశానికి స్వాతంత్ర్యంవచ్చి 70సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా , దేశ జనాభాలో సుమారు 40 శాతం మంది జనాభా మాత్రమే బ్రాండెడ్ ఔషధాలను కొనుగోలు చేయగల స్థితిలో ఉన్నారు. బ్రాండెడ్ ఔషధాల మార్కెట్ విలువ మన దేశంలో లక్షా 20 వేల కోట్ల రూపాయలు. దేశంలో ప్రతి పది మందిలో ఆరుగురికి బ్రాండెడ్ ఔషధాలు అందుబాటులో లేవు. అయితే ఆశావహమైన పరిస్థితి ఏమంటే, ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన జెనిరిక్ ఔషధాలను ఎగుమతి చేస్తున్న దేశాలలో ఇండియా ఒకటి. సుమారు 200 దేశాలకు ప్రపంచస్థాయి ప్రమాణాలు గల జెనిరిక్ ఔషధాలను మనదేశం ఎగుమతి చేస్తున్నది. ప్రపంచంలో వాడే ప్రతి ఆరు ఔషధాలలో, ఒకటి భారత్ నుంచి తయారైనదే. ఇక్కడగల వైరుధ్యాన్ని గమనిం చండి, ఒకవైపు ప్రతి పది మందిలో ఆరుగురికి బ్రాండెడ్ ఔషధాలు అందుబాటులో లేవు, మరోవైపు, ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు నాణ్యమైన ఔషధాలు తయారుచేస్తున్న ప్రపంచంలోని తొలి నాలుగు దేశాల జాబితాలో మన దేశం ఉంది. ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన (పిఎంబిజెపి) ఈ వైరుధ్యాన్ని సరిచేసేందుకు ఉద్దేశించిన పథకం. కుల, మత, వర్గ, ఆర్థిక స్థితిగతులతో ఏమాత్రం సంబంధం లేకుండా, దేశంలోని ప్రతి పౌరుడికి అందుబాటు ధరలలో నాణ్యమైన ఔషధాలను అందుబాటులోకి తెచ్చేందుకు అంకితమైన పథకం ఇది. వీలైనంత త్వరగా దేశ ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడం దీని ఉద్దేశం.

నాణ్యమైన జనరిక్ ఔషధాలను అందరికీ అందుబాటుధరలలో లభ్యమయ్యేట్టు చూసేందుకు జనఔషధి పథకాన్ని భారత ప్రభుత్వ రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ లోని ఫార్మాసూటికల్ విభాగం దేశవ్యాప్తంగా 2008 నవంబర్‌లో ప్రారంభించింది. ఈ పథకాన్ని, రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖకు చెందిన ఫార్మాసూటికల్స్ విభాగం పాలనా పరమైన నియంత్రణ కిందగల బ్యూరో ఆఫ్ ఫార్మా పి.ఎస్‌యుఎస్ ఆఫ్ ఇండియా (బిపిపిఐ), గుర్గాం, హర్యానా ద్వారా అమలు చేస్తున్నారు. అయితే 2015 వరకు కేవలం 99 పిఎంబిజెపి కేంద్రాలు మాత్రమే పనిచేస్తుండేవి. 2015 సెప్టెంబర్‌లో జన ఔషధి పథకాన్ని , ప్రధానమంత్రి జనఔషధి యోజన (పిఎంజెఎవై)గా మార్చి పునరుద్ధరించారు. ఈ పథకాన్ని మరింత విస్తృతస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చేసేందుకు తిరిగి దీనిని ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన (పిఎంబిజెపి)గా 2016

---

మాజీ ముఖ్య కార్యనిర్వహణాధికారి, ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన, న్యూఢిల్లీ.

డిసెంబర్‌లో మార్చారు. ఇందుకు సంబంధించి జాతీయ, ప్రాంతీయ పత్రికలలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి, ఈ పథకం అమలులో పాలువంచుకోవలసిందిగా ప్రజలను ఆహ్వానించడం జరిగింది.

**ఈ పరియోజనలోని ముఖ్యాంశాలు...**

- సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు, ప్రత్యేకించి, పేదలు, అణగారిన వర్గాల ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందు బాటులో ఉండేట్టు చూడడం.
- నాణ్యమైన జెనిరిక్ ఔషధాల అందు బాటును మరింత విస్తరింపచేయడం ద్వారా, ప్రతి వ్యక్తి చికిత్సకు అయ్యే ఖర్చును తగ్గించడం.
- జిఎంపి, సిపిఎస్‌యుల తయారీ దారుల ద్వారా నాణ్యమైన ఔషధాలను సేకరిం చడం, ఎన్.ఎ.బి.ఎల్ ల్యాబ్‌ల అనుమతితో ప్రతి బ్యాచ్‌ని విడుదల చేయడం.
- అధికధర గల ఔషధాలు మాత్రమే నాణ్యతకు కొలమానమన్న భావన కాకుండా జనిరిక్ ఔషధాలపై ప్రజలలో అవగాహన కల్పించడం ఇందుకు సంబంధించిన సమాచారంతో పబ్లిసిటీ ద్వారాప్రజలను చైతన్యవంతులను చేయడం.
- ప్రభుత్వం, పిఎస్‌యులు, ప్రైవేటు రంగం, ఎన్‌జిఓలు, సొసైటీలు, సహకార సంఘాలు ఇతర సంస్థల సమష్టి కృషితో ప్రజా కార్యక్రమ నిర్వహణ
- తక్కువ ఖర్చు, చికిత్సా విధానంలో అవసరమైన అన్ని రకాల ఔషధాలను అందుబాటులోకి తెస్తూ, మెరుగైన ఆరోగ్యసంరక్షణకు వీలు కల్పించడం ద్వారా జనిరిక్ ఔషధాలకు డిమాండ్‌ను కల్పించడం.
- జనఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ఎంతోందికి ఉపాధి అవకాశాలు కల్పించడం.
- రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా స్థలం సమకూర్చిన సందర్భాలలో ఆపరేటింగ్ ఏజెన్సీకి రెండున్నర లక్షల రూపాయలు ఆర్థిక మద్దతు నివ్వడం.
- ప్రభుత్వ భవనంలో కాని, లేదారైల్వేలు, రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ విభాగం లేదా నగర స్థానిక సంస్థలు, పంచాయతిరాజ్ సంస్థలు, పోస్టాఫీసులు, రక్షణ కార్యాలయాలు, పిఎస్‌యుల యాజమాన్యంలోని భవనాలలో ఉచితంగా స్థలాన్ని ఇచ్చే సందర్భాలలో ప్రభుత్వ ఏజెన్సీలకు రెండున్నర లక్షల రూపాయలు ఆర్థిక మద్దతు కల్పించడం .
- ఏ వ్యక్తి అయినా పిఎంబిజెకెను ప్రారంభిస్తే అతనికి ప్రోత్సాహకం కింద రెండున్నర లక్షల రూపాయల వరకు సమకూరుస్తారు.
- ఎస్.సి, ఎస్.టిలు, దివ్యాంగులైన వారికి ప్రారంభంలో 50,000 రూపాయల వరకు ఔషధాలు ఉచితంగా ఇస్తారు.

**గత రెండు సంవత్సరాలలో సాధించిన ప్రగతి....**

- 700కుపైగా ఔషధాలు, 154 సర్జికల్, వాడకానికి ఉపయోగించేవి పిఎంబిజెకె ద్వారా అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే వీటిని వెయ్యి ఔషధాల స్థాయికి పెంచడం జరుగుతుంది.
- సెంట్రల్ వేర్‌హౌస్‌లో తగినంత స్టాక్‌ను నిల్వచేయడం జరిగింది. డిస్ట్రిబ్యూటర్లకు, కేంద్రాలకు ఔషధ ఉత్పత్తులు సక్రమంగా అందే ఏర్పాటు చేయడం జరిగింది.
- ఔషధాల మెరుగైన సరఫరా ,సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్,కోసం వివిధ రాష్ట్రాలలో 8 సి అండ్ ఎఫ్ ఏజెంట్లను నియమించడం జరిగింది. మరికొన్నింటిని నియమించ నున్నారు.
- ఔషధాలు సక్రమంగా అందుబాటులో ఉండేలా చూసేందుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలో 54 మంది డిస్ట్రిబ్యూటర్లను నియమించడం జరిగింది.
- మెరుగైన సరఫరాకోసం ఎండ్ టు ఎండ్ సప్లయ్ వ్యవస్థను అమలుచేయడం జరిగింది.
- తమ తమ రాష్ట్రాలలో పి.ఎం.బి.జె.పి పథకాన్ని అమలు చేసేందుకు చాలా రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

**అందుబాటు...**

- దేశవ్యాప్తంగా గల రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పనిచేస్తున్న ,ప్రధానమంత్రి భారతీయ జనౌషధి కేంద్రాల సంఖ్య 3500కు పైగా చేరింది.
- రోజుకు సగటున ఒక్కొక్క కేంద్రంలో 3300 రూపాయల విలువగల ఔషధాలు అమ్ముడుపోతున్నాయి. అంటే బ్రాండెడ్ ఔషధాల విక్రయంతో పోలిస్తే 15,000 రూపాయల విలువగల ఉత్పత్తులు అమ్ముడుపోయినట్టు లెక్క.
- బిపిపిఐ దేశవ్యాప్తంగా రోజుకు 4-5 కేంద్రాలను ప్రారంభిస్తున్నది.
- పిఎంబిజెపి కేంద్రాలు ప్రస్తుతం వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కలిపి ముప్పైమూడింటిలో ఉన్నాయి.
- దేశంలోని 718 జిల్లాలలోని 584 జిల్లాలలో పి.ఎం.బి.జె.పి కేంద్రాలు ఉ న్నాయి.

ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన -పిఎంబిజెపి, కారణంగా నాణ్యమైన మందుల ధరలు బాగా తగ్గడంతో పాటు సమాజంలోని పేద వర్గాలకు బాగా అందుబాటులోకి వచ్చాయి. ఈ పథకం కింద లభించే మందులు , బ్రాండెడ్ మందుల ధరలతో పోల్చిచూసినపుడు 50 నుంచి 90 శాతం వరకు తక్కువగా ఉన్నాయి. దీనివల్ల ప్రజలు 400 కోట్ల రూపాయలవరకు ఆదా చేసుకోగలుగుతున్నారు. ■

# మనసులోని మాట




**ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” (మనసులోని మాట) కార్యక్రమం ద్వారా మే 27, 2018 న ఆకాశవాణిలో దేశ ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగం సంక్షిప్తంగా!**

నమస్కారం! 'మన్ కీ బాత్' మాధ్యమం ద్వారా మరోసారి మీ అందరి ముందుకు వచ్చే అవకాశం లభించింది. మీ అందరికీ బాగా గుర్తుండే ఉంటుంది నౌక దళానికి చెందిన ఆరుగురు మహిళా కమాండర్ల బృందం గత కొద్ది నెలల క్రితం సముద్రయానం చేస్తున్నారని చెప్పిన సంగతి. 'నావికా సాగర్ పరిక్రమ' పేరుతో చేపట్టిన ఈ యాత్ర గురించి నేను కొన్ని విషయాలు మాట్లాడాలనుకుంటున్నాను. భారతదేశానికి చెందిన ఈ ఆరుగురు ఆడపడుచుల బృందం రెండువందల ఏభై నాలుగు రోజులు పైగా సముద్రంపై ప్రయాణించి ఐ.ఎన్.ఎస్.వి తారిణీ నౌకలో ప్రపంచాన్ని చుట్టి మే నెల 21వ తేదీన భారతదేశానికి తిరిగి వచ్చారు. దేశమంతా వారికి ఎంతో ఉత్సాహంతో స్వాగతం చెప్పింది. రకరకాల మహాసముద్రాలలో, సముద్రాలలోనూ ప్రయాణిస్తూ, దాదాపు ఇరవై రెండు వేల సముద్రపు(నాటికల్) మైళ్ళ యాత్రను సాగించాలని వారు నిర్ణయించుకున్నారు. ప్రపంచంలోనే ఒక మొట్టమొదటి సంఘటన ఇది. గత బుధవారం నాకు ఈ ఆడపడుచులను కలిసి, వారి అనుభవాలను తెలుసుకునే అవకాశం లభించింది. మరోసారి నేను ఈ ఆడబిడ్డలందరికీ వారి సాహసానికి, నౌకాదళ ప్రతిష్టను పెంచినందుకు, భారతదేశ గౌరవ మర్యాదలను పెంచినందుకు, ముఖ్యంగా భారతదేశపు ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదు అని ప్రపంచానికి చాటినందుకు గానూ అనేకానేక అభినందనలు తెలియచేస్తున్నాను.

మహారాష్ట్రలో చంద్రపూర్‌లోని ఒక ఆశ్రమపాఠశాలకు చెందిన ఐదుగురు ఆదివాసి విద్యార్థులు – మనీషా ధ్రువ్, ప్రమేష్ ఆలే, ఉమాకాంత్ మడ్వీ, కవిదాస్ కాత్మోడే, వికాస్ సోయామ్ – వీరంతా ఒక బృందంగా ఏర్పడి, మే 16న ప్రపంచంలోనే అతిపెద్ద శిఖరాన్ని ఎక్కారు. ఆశ్రమపాఠశాలకు చెందిన ఈ ఐదుగురు విద్యార్థులు ఆగస్టు 2017లో శిక్షణను మొదలుపెట్టారు. వర్ధా, హైదరాబాద్, డార్జిలింగ్, లేహ్, లద్దాక్‌లలో వీరికి శిక్షణను ఇచ్చారు. “మిషన్ శౌర్య” ద్వారా ఎన్నుకోబడిన ఈ యువకులు, ఆ పేరుని సార్థకం చేస్తూ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి, యావత్ దేశం గర్వపడేలా చేసారు. చంద్రపూర్ పాఠశాల సిబ్బందినీ, ఈ చిన్నారి స్నేహితులకీ హృదయ పూర్వకంగా అనేకానేక అభినందనలు తెలుపుతున్నాను. ఈమధ్యనే పదహారేళ్ళ శివాంగీ పాఠక్, నేపాల్ నుండి ఎవరెస్ట్‌ని అధిరోహించిన అతిపిన్న వయస్కురాలైన భారతీయ మహిళగా నిలిచింది. శివాంగికి అనేకానేక అభినందనలు.

అజీత్ బజాజ్, వారి అమ్మాయి దియా ఎవరెస్టుని అధిరోహించిన మొదటి భారతీయ తండ్రీ–కూతురు అయ్యారు. కేవలం యువకులు మాత్రమే ఎవరెస్టుని ఎక్కడంలేదు. మే 19న సంగీతా బెహ్ల్ ఎవరెస్టుని అధిరోహించారు. ఆమె వయసు ఏభై దాటింది. ఎవరెస్టుని ఎక్కేవారిలో కొందరికి కేవలం నైపుణ్యం మాత్రమే కాదు సున్నితత్వం కూడా ఉంది అని నిరూపించారు. కొద్ది రోజుల క్రితం “స్వచ్ఛ గంగా ప్రచారం”లో భాగంగా బి.ఎస్.ఎఫ్ కు చెందిన ఒక సమూహం ఎవరెస్టుని ఎక్కి తిరిగి వచ్చేటపుడు తమతో పాటూ బోలెడు చెత్తను కూడా తీసుకొచ్చారు. ఇది ఎంతో ప్రసంశనీయమైన పని. దానితో పాటుగా ఇది

ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం సౌజన్యంతో.....

పరిశుభ్రత పట్ల, పర్యావరణం పట్ల వారికున్న నిబద్ధతను చూపెడుతుంది. ఏళ్లతరబడి ఎందరో వ్యక్తులు ఎవరెస్టుని అధిరోహించే ప్రయత్నం చేస్తున్నారు, వారిలో ఎందరో విజయవంతంగా ఈ పనిని పూర్తిచేసారు కూడా. ఈ సాహస వీరులందరికీ, ముఖ్యంగా ఆడబిడ్డలకు హృదయపూర్వక అభినందనలు తెలుపు తున్నాను.

నా ప్రియమైన దేశప్రజలారా, ముఖ్యంగా నా యువ స్నేహితులారా, రెండు నెలల క్రితం నేను ఫిట్ ఇండియా గురించి చెప్పినప్పుడు ఇంత ఎక్కువ స్పందన వస్తుందని ఆశించలేదు. ఫిట్ ఇండియా గురించి నేను మాట్లాడు తున్నప్పుడు, నేను నమ్మేదేమిటంటే మనం ఎంత ఎక్కువగా ఆడితే, దేశమంతా కూడా అంతే ఎక్కువగా ఆడుతుంది. సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ఫిట్‌నెస్ సవాళ్ల వీడియోలు పంచుకుంటున్నారు. వాటిల్లో ఒకరినొకరు ట్యాగ్ చేసుకుని మరీ సవాలు చేసుకుంటు న్నారు. ఈ ఫిట్ ఇండియా ప్రచారంలో అందరూ భాగస్తులౌతున్నారు. నలువైపుల నుండీ కూడా ఒకే పిలుపు వినిపిస్తోంది – “మనం ఫిట్ గా ఉంటే దేశం ఫిట్‌గా ఉంటుంది” అని. భారతీయ క్రికెట్ టీం కేప్టెన్ విరాట్ కోహ్లీ నన్ను కూడా సవాలు చేసాడు. ఆ సవాలుని స్వీకరించాను. ఇది చాలా మంచి విషయం అని నేను నమ్ముతున్నాను. ఇలాంటి సవాళ్ళు మనల్ని ఫిట్‌గా ఉంచుతాయి, ఇతరులని కూడా ఫిట్‌గా ఉండమని ప్రోత్సహిస్తాయి.

నా ప్రియమైన దేశప్రజలారా, మన్ కీ బాత్‌లో చాలాసార్లు నేను ఆటల గురించి, ఆటగాళ్ల గురించీ, ఏవో ఒక కబుర్లు నా ద్వారా మీరు వింటూనే ఉన్నారు. క్రితంసారి కామన్వెల్త్ గేమ్స్ గెలుపొందిన క్రీడాకారులు తమ అభిప్రాయాలను మనతో మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా పంచుకున్నారు కూడా.

“నమస్కారం సర్! నోయిడా నుండి నేను ఛవీ యాదవ్‌ను మాట్లాడుతున్నాను. నేను మీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా వింటాను. ఈసారి వేసవి సెలవులు మొదలైపోయాయి. ఒక తల్లిగా నేను గమనిం చినది ఏమిటంటే, పిల్లలు ఎక్కువ సమయం ఇంటర్నెట్ లో ఆటలు ఆడుతూ గడిపేస్తున్నారు. మా చిన్నప్పుడు మాత్రం మేము ఎక్కువగా అవుట్ డోర్ గేమ్స్ అయిన కొన్ని సంప్రదాయక వీధి ఆటలు ఆడేవాళ్లము. ఏడు పెంకులాట – అంటే ఏడు పెంకులను ఒకదానిపై ఒకటి వరసగా పేర్చి, దాన్ని బంతితో కొట్టేవాళ్ళం. ఇంకా నేలా–బండ, ఖోఖో మొదలైన అప్పటి ఆటలను ఇప్పుడు దాదాపుగా అందరూ మర్చిపోతున్నారు. మీరు ఆనాటి సంప్రదాయక వీధి ఆటల పట్ల ఈ తరం పిల్లలకు ఆసక్తి పెరిగేలా వాటిని గురించి మీరు చెప్పాలని కోరుతున్నాను. ధన్యవాదాలు”

ఛవీ యాదవ్ గారూ, మీరు ఫోన్ కాల్ చేసినందుకు ధన్యవాదాలు. ఇదివరకూ ప్రతి వీధిలోనూ, ప్రతి పిల్లాడి జీవితంలోనూ భాగమయిన కొన్ని ఆటలు ఇవాళ నెమ్మదిగా మాయమైపోతున్నాయి. ఈ ఆటలకు వేసవి సెలవులలో ప్రత్యేకమైన స్థానం ఉండేది. ఒకోసారి మండుటెండలో, ఒకోసారి రాత్రి వేళల్లో భోజనం అయిన తరువాత ఏ చింతా లేకుండా, నిశ్చింతగా పిల్లలందరూ గంటలు గంటలు ఈ ఆటలన్నీ ఆడుకుంటూ ఉండే వారు. కొన్ని ఆటలు అయితే కుటుంబం మొత్తం కలిసి ఆడుకునేలా ఉండేవి. ఏడు పెంకులాట లేదా గోళీలాట, ఖో ఖో, బొంగరాలాట లేదా గూటీ బిళ్ల, ఇలా ఎన్నో లెక్క లేనన్ని వీధి ఆటలు కాశ్మీరు నుండీ కన్యాకుమారి వరకూ, కచ్ నుండి కామరూప్ వరకూ ప్రతి ఒక్కరి బాల్యంతోనూ జతపడి ఉండేవి. ఈ ఆటలను వేరు వేరు ప్రాంతాల్లో వేరు వేరు పేర్లు ఉండి ఉండచ్చు. ఉదాహరణకు పిట్టూ ఆనే ఆటని లాగోరీ, సాతోలియా, ఏడు పెంకులాట, సాత్ పత్థర్, డికోరీ, సతోదియా... ఇలాగ ఒకే ఆటని ఎన్నో పేర్లతో పిలుస్తారు. సంప్రదాయక ఆటల్లో ఇన్ డోర్ గేమ్స్ కూడా ఉన్నాయి, అవుట్ డోర్ గేమ్స్ కూడా ఉన్నాయి. మన దేశంలో భిన్నత్వంలో దాగి ఉన్న ఏకత్వం ఈ ఆటల్లో కూడా కనబడుతుంది. ఒకే ఆటను రకరకాల ప్రాంతాల్లో రకరకాల పేర్లతో పిలుస్తారు. నేను గుజరాత్‌కు చెందిన వాడిని కదా, అక్కడ ఒక ఆట ఉంది, దానిని 'చోమల్ ఇస్తో' (అష్టా–చెమ్మా) అంటారు. ఇది గవ్వలు, చింతపిక్కలు లేదా డైస్‌తో, 8x8 square board తో ఆడేవారు. ఈ ఆటను దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ ఆడేవారు. కర్ణాటకలో దీనిని చౌకాబారా అంటారు, మధ్యప్రదేశ్‌లో దీనిని అత్తు, కేరళలో పకీడాకాళీ, మహారాష్ట్రలో చంపూల్, తమిళనాడులో దాయామ్, ఇంకా థాయామ్ అనీ, రాజస్థాన్‌లో చంగాపో – ఇలా ఎన్నో పేర్లు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల వారు ఇతర భాషలు రాకపోయినా, ఈ ఆటను ఆడిన తరువాత, అరే ఈ ఆట మేమూ ఆడేవాళ్లం అని గుర్తుపట్టేస్తారు. చిన్నప్పుడు గిల్లీ డండా (గూటీ–బిళ్ళ) ఆట ఆడనివారం ఎవ్వరం ఉండము. గ్రామాల నుండీ పట్టణాల దాకా ఈ ఆటను అందరూ ఆడతారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో రకరకాల పేర్లతో ఈ ఆటను పిలుస్తారు. ఆంధ్రప్రదేశ్ లో ఈ ఆటను గూటీ–బిళ్ల లేదా కర్రా–బిళ్ల అనీ పిలుస్తారు. ఒరిస్సా లో గులిబాడీ అనీ, మహారాష్ట్రలో విత్తిదాలు అనీ అంటారు. కొన్ని ఆటలు ఆడేందుకు ఒకో కాలం ఉంటుంది. గాలిపటం ఎగురవేయ డానికి కూడా ఒక సమయం ఉంది. అందరూ గాలిపటాలు ఎగురవేస్తారు. ఆ సమయంలో ఆడుకునేప్పుడు మనలో ఉన్న ప్రత్యేకమైన లక్షణాలను మనం స్వేచ్ఛగా వ్యక్తపరచగలము. మీరు గమనించే ఉంటారు, స్వతహాగా సిగ్గరి అయిన పిల్లవాడు ఆడుకునేప్పుడు మాత్రం చలాకీగా అయిపోతాడు. తన భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరుస్తాడు. గంభీరంగా ఉండే కొందరు పెద్దలు ఆటలాడేటప్పుడు మాత్రం వారిలోని పిల్లాడు బయటకు వస్తాడు. సంప్రదాయకమైన ఆటలు శారీరిక సామర్థ్యాన్ని పెంచే విధంగా తయారుచెయ్యబడ్డాయి. అంతే కాక మనలో తార్కికమైన ఆలోచననూ, ఏకాగ్రతనూ, అప్రమత్తతనూ, స్ఫూర్తినీ పెంపొందిస్తాయి. ఆటలు కేవలం ఆటలు

మాత్రమే కాదు, అవి జీవిత విలువలను కూడా నేర్పుతాయి. అంటే – లక్ష్యాలను ఏర్పరుచుకోవడం, ధృఢత్వాన్ని ఎలా సొంతం చేసుకోవాలి, టీమ్ స్పిరిట్‌ని ఎలా నేర్చుకోవాలి, పరస్పర సహకారాన్ని ఎలా అందించుకోవాలి మొదలైనవన్నమాట.

ఈ మధ్యకాలంలో నేను గమనిస్తున్నదేమిటంటే, బిజినెస్ డెవలప్‌మెంట్ తాలూకు శిక్షణా కార్యక్రమాలతో ముడిపడి ఉన్న సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం మానవ సహ నైపుణ్యాలు పెంచుకోవడానికి మన సంప్రదాయక ఆటలను ఈమధ్య ఉపయో గించుకుంటున్నారు. సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి ఆ ఆటలు ఎంతో ఉపయోగపడుతున్నాయి కూడా. ఈ ఆటలను ఆడడానికి వయసుతో నిమిత్తం లేదు. పిల్లల నుండీ మొదలుకుని తాతా–అమ్మమ్మలూ, తాతా–నాన్నమ్మా వరకూ అంతా కలిసి ఈ ఆటలు ఆడితే మనం ఈనాడు చెప్పుకునే తరాల అంతరాలు కూడా ఇట్టే మాయమైపోతాయి. దానితో పాటుగా మన సంస్కృతి, సంప్రదాయాలను కూడా తెలుసుకుంటాం. ఎన్నో ఆటలు సమాజం, పర్యావరణ మొదలైన అంశాలను గురించి మనల్ని అప్రమత్తం చేస్తాయి. ఈ ఆటలన్నీ మనం కోల్పోతామేమో అని అప్పుడప్పుడు బెంగగా ఉంటుంది. అలా జరిగితే గనుక ఈ ఆటలనే కాదు, బాల్యాన్ని కూడా కోల్పోతాం.

సమూహం నుండి సేకరణ (crowd sourcing) ద్వారా మనం మన సంప్రదాయక ఆటల తాలూకూ అతి పెద్ద భాండాగారాన్నే (అర్కైవ్) తయారుచేయగలం. ఈ ఆటల నియమాలతో, ఆడే విధానాలతో వీడియోలు తయారు చేసి పిల్లలకు చూపెట్టచ్చు. యేనిమేషన్ చిత్రాలను కూడా తయారుచేసి కొత్త తరాలవారికి చూపెట్టవచ్చు. అలా అయితే, వీధి ఆటలు గా పిలవబడే ఈ ఆటల వారికి ప్రత్యేకంగా అనిపిస్తాయి. వాటిని చూస్తారు, ఆడతారు, వికసిస్తారు.

నా ప్రియమైన దేశప్రజలారా, రాబోయే జూన్ ఐదవ తేదీ నాటి ప్రపంచ పర్యావరణ దినోత్సవ సంబరాలను అధికారికంగా భారతదేశం నిర్వహించనుంది. 'Beat Plastic Pollution' అనేది ఈసారి ఇతివృత్తం. ఈ ఇతివృత్తం తాలూకు భావాన్ని దృష్టిలో ఉంచుకుని మనందరమూ కూడా పోలిథిన్, లోగ్రేడ్ పోలిథిన్‌లను ఉపయోగించకుండా ఉంటామని గట్టిగా నిశ్చయించుకోవాలి. మన ప్రకృతిపై, వన్య ప్రాణులపై, మన ఆరోగ్యంపై పడుతున్న ప్లాస్టిక్ కాలుష్యపు ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలి. ప్రపంచ పర్యావరణ దినోత్సవం తాలూకు వెబ్‌సైట్ wed-india 2018 కు వెళ్ళి, అక్కడ పొందుపరిచిన ఎన్నో ఆసక్తికరమైన సలహాలను చూసి, తెలుసుకుని, వాటిని మీ రోజువారీ జీవితాలలో భాగంగా చేసుకోవడానికి ప్రయత్నించండి. మన సంస్కృతి, మన సంప్రదాయం మనకి ప్రకృతితో విభేదించడాన్ని నేర్పలేదు. మనం ప్రకృతిపట్ల సద్భావంతో ఉండాలి. ప్రకృతితో ముడిపడి ఉండాలి. ఇవాళ భారతదేశం వాతావరణ న్యాయం (climate justice) గురించి మాట్లాడినా, Cop 21, ఇంకా Paris ఒప్పందాలలో ప్రముఖ పాత్ర వహించినా, అంతర్జాతీయ సౌర కూటమి (international solar alliance) మాధ్యమం ద్వారా యావత్ ప్రపంచాన్నీ ఒక్క త్రాటిపై నిలబెట్టినా, వీటన్నింటి వెనుకా మహాత్మా గాంధీ గారి కలను నిజం చెయ్యాలన్న ఒక ఆలోచన ఉంది. మన భూగ్రహాన్ని పరిశుభ్రంగా, ఆకుపచ్చగా తయారుచెయ్యాలంటే ఏం చెయ్యగలం అని ఈ పర్యావరణ దినోత్సవం నాడు మనందరమూ ఆలోచిద్దాం.

నా ప్రియమైన దేశప్రజలారా, ప్రత్యేకించి నా యువ మిత్రులారా, మీరు జూన్ 21ని బాగా గుర్తుంచుకున్నారుగా? మీరే కాదు, ప్రపంచం మొత్తం జూన్ 21ని గుర్తుంచుకుంటుంది. యావత్ ప్రపంచం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటుంది. ఇది అందరి ఆమోదాన్నీ పొందింది. ప్రజలు కొన్ని నెలల ముందు నుండే తయారవ్వడం మొదలుపెడుతున్నారు. యావత్ ప్రపంచం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడానికి పూర్తిగా సన్నాహాలు చేసుకుంటోందని నాకు వార్తలు వచ్చాయి. yoga for unity – అంటే' ఐక్యత కోసం యోగా', harmonious society – అంటే ' సామరస్య సమాజం" అనే సందేశాలను ప్రపంచం గత కొద్ది ఏళ్లలో మళ్ళీ మళ్ళీ అనుభూతి చెందింది. సంస్కృత మహాకవి భర్తృహరి ఎన్నో యుగాల క్రితమే తన శతకత్రయంలో రాశారు –

ధైర్యం యస్య పితా క్షమా చ జననీ శాంతిశ్చిరం గేహినీ
సత్యం సూనురయం దయా చ భగినీ భ్రాతా మనః సంయమః
శయ్యా భూమితలం దిశోపి వసనం జ్ఞానా మృతం భోజనం
యతే యస్య కుటుంబిన: వద సఖే కస్మాద్ భయం యోగినః

ఎన్నో యుగాలకు పూర్వం చెప్పబడిన ఈ మాటలకు సరళమైన అర్థం ఏమిటంటే "పరిమితంగా యోగాభ్యాసం చెయ్యడం వల్ల మంచి గుణాలు, సత్సంబంధాలు, స్నేహితులుగ మారిపోతాయి. యోగా చెయ్యడం వల్ల అది తండ్రిలా మనల్ని రక్షించే సాహసం చేస్తుంది. తల్లికి బిడ్డల పట్ల ఉండేలాంటి క్షమా భావాన్ని పుట్టిస్తుంది. మానసిక ప్రశాంతత మన స్నేహితుడిలా మారిపోతుంది. భర్త ృహరి చెప్పినట్లుగా నియమంగా యోగా చెయ్యడం వల్ల సత్యం మన సంతానంగా, దయ సోదరిగా, స్వీయ నియంత్రణ మన సోదరుడిగా, భూమి మన పరుపుగా, జ్ఞానం మన ఆకలిని పోగొట్టేదిగా తయారవుతాయి. ఈ గుణాలన్నీ ఒక్కరిలో ముడిపడి ఉన్నప్పుడు యోగి అన్ని రకాలభయాలపై విముక్తిని సాధించుకుంటాడు. మన వారసత్వమైన యోగాని ముందుకు నడిపించవలసిందిగా మరోసారి నేను దేశ ప్రజలందరినీ కోరుతున్నాను. తద్వారా ఆరోగ్యకరమైన, ఆనందభరితమైన, సద్భావపరమైన దేశాన్ని నిర్మిద్దాం.

నా ప్రియమైన దేశప్రజలారా, మీ అందరికీ అనేకానేక ధన్యవాదాలు. మరోసారి మళ్ళీ వచ్చే నెలలో 'మన్ కీ బాత్' లో కలుద్దాం.

నమస్కారం! ■




## అటల్ ఇన్నోవేషన్ మిషన్:

దేశంలో సృజనాత్మక వాణిజ్యతత్వాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ఇది. రానున్న సంవత్సరాలలో దేశంలోని వాణిజ్యావసరాలను క్షుణ్ణంగా పరిశీలించాక నీతి ఆయోగ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏ.ఐ.ఎం.) ను ప్రారంభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవారీగా సృజనాత్మక పథకాలను పట్టాలకెక్కించడానికి ఈ ఏ.ఐ.ఎం. ప్రధానంగా లక్ష్యింపబడింది. ఉన్నత పాఠశాలలు, శాస్త్ర, సాంకేతిక కళాశాలలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు అన్నిటిలోనూ దీనికి పాత్ర ఉంటుంది. స్వయం ఉపాధికోసం వ్యాపారతత్వాన్ని ప్రోత్సహించడం, సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహమివ్వడం ఈ ఏ.ఐ.ఎం. ప్రధాన లక్ష్యాలు. ఈ కార్యక్రమంలోని ప్రధాన అంశాలేమంటే:

## అటల్ టింకరింగ్ ప్రయోగశాలలు:

దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ 1200-1500 చదరపు అడుగుల స్థలం ఉంటేచాలు, ఈ ప్రయోగశాలలను ఏర్పాటుచేస్తారు. ఈ ప్రయోగశాలలలో 3డి ప్రింటర్లు, రోబోటిక్స్, ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ వంటి సౌకర్యలన్నింటినీ రూ. 20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తారు. 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులు వీటిని వినియోగించుకోవచ్చు. ఇప్పటికే, 2,441 పాఠశాలల్లో ఈ ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. 2018 చివరి నాటికి వీటి సంఖ్య 5000 లకు చేరుతుందని అంచనా. కేవలం గ్రాంట్లను అందచేయడమేకాక, విద్యార్థులకు తమ చుట్టుపక్కలనున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి సహకారమందిస్తుంది. ఈ ప్రయోగశాల అఖిలభారత సాంకేతిక విద్యామండలితో జత కలిసింది. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటీవల 17 రాష్ట్రాల విద్యార్థులతో ఒక ప్రయత్నం జరిగింది. వీటిలో 30 ఆవిష్కరణలు జాతీయ స్థాయి ప్రశంసలందుకున్నాయి.

## అటల్ ఇంక్యుబేటర్స్:

ప్రపంచ స్థాయి సృజనాత్మక పారిశ్రామిక వేత్తలను తయారుచేయడానికి ఈ ఇంక్యుబేటర్లను ప్రారంభించారు. ఔత్సాహికులు విజయవంతంగా తమ అంకుర సంస్థలను ప్రారంభించేంత వరకు ఈ ఇంక్యుబేటర్లు సహాయ సహకారాలందిస్తాయి. ప్రస్తుతమున్న ఇంక్యుబేటర్ల స్థాయిని పెంచడానికి పది కోట్ల రూపాయల వరకూ ఏ.ఐ.ఎం. సహాయమందిస్తుంది. మొత్తం గుర్తించిన 110 స్మార్ట్ సిటీలలోను, ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో మొదటి 5-10 విద్యా సంస్థలలో ఈ ఇంక్యుబేటర్లను ఏర్పాటుచేయాలనేది లక్ష్యం.

## ఇటీవలి కార్యక్రమాలు:

సామాజికంగా, వాణిజ్యపరంగా మరింత ఉన్నత సేవలను అందించడానికి పునరుత్పాదక ఇంధనవనరులు, ఇంధన నిల్వ, వాతావరణహిత వ్యవసాయం, త్రాగు నీరు, స్వచ్ఛభారత్, ప్రజా రవాణా, విద్య, ఆరోగ్యం వంటి ప్రత్యేక అంశాలలో ప్రత్యేక కార్యక్రమాలను, పోటీలను నిర్వహిస్తారు.

ఆసక్తి కలవారు http://aim.gov.in/atal-new-india-challenge.php వెబ్ సైట్ ద్వారా తమ దరఖాస్తులను జూన్ 10, 2018 లోపు పంపుకోవచ్చు. ■

Publishing date 1 June 2018
Posting on 2- 3 June 2018
Yojana (Telugu) June 2018

RNI Regd. No 37729/80
Regd. No. H/SD-512/2018-20




Release Order No. 246/Mag/Advt./2018 Dt. 26-05-2018

Printed & Published by Mrs. Sadhana Rout, Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India.
and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com
and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314